Prajalakshyam Telugu Daily

# ప్రజాలక్ష్యం

తెలుగు దిన పత్రిక

ఎడిటర్ : గోలి సమ్మిరెడ్డి

సంపుటి: 16 | సంచిక: 316 | కరీంనగర్ | ఆదివారం 5 ఏప్రిల్ 2026 | పేజీలు: 12 | వెల: 2.00

## గోదావరిఖనిలో ఘోర రోడ్డు ప్రమాదం

### - స్తంభాన్ని ఢీకొన్న కారు: ఒకరు మృతి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

పెద్దపల్లి,ఏప్రిల్4 :గోదావరిఖనిలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. సింగరేణి కార్మికులు ప్రయాణిస్తున్న ఓ కారు అతివేగంతో వచ్చి రాజేశ్ థియేటర్ వద్ద ఉన్న కరెంటు స్తంభాన్ని బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో ఒకరు అక్కడికక్కడే మృతిచెందగా.. మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. శనివారం తెల్లవారుజామున ఈ ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో కారు ముందు భాగం నుజ్జునుజ్జయ్యింది. దీంతో కారులోనే వారంతా ఇరుక్కుపోయారు. ఇది

11లో

## ప్రజల దృష్టి మరల్చేందుకు దాడులు

### – మాజీమంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, ఏప్రిల్ 4 : అధికారంలోకి వచ్చిన నాటి నుంచి విధ్వంసమే పరామవధిగా కొనసాగుతున్న కాంగ్రెస్ నాయకుల దాడి ఈసారి బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ క్యాంపు కార్యాలయంపై దాడి చేశారు. గజ్వేల్ లోని క్యాంపు కార్యాలయంలోకి చొరబడ్డ కాంగ్రెస్ కార్యకర్తలు విధ్వంసం సృష్టించారు.కేసీఆర్ క్యాంపు కార్యాలయం ప్రభుత్వ ఆస్తి, దానిని ధ్వంసం చేయడం అంటే ప్రభుత్వ

11లో

## బాసర మాస్టర్ ప్లాన్‌కు

# సిఎం రేవంత్ ఓకే



- రూ.225 కోట్ల వ్యయంతో ఆలయ అభివృద్ధి
- ఆధ్యాత్మికత ఉట్టిపడేలా నిర్మాణాలు
- 6న బాసర ఆలయ అభివృద్ధి పనులకు సిఎం శంకుస్థాపన
- అధికారులతో అభివృద్ధి పనులపై సమీక్షించిన రేవంత్ రెడ్డి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, ఏప్రిల్ 4 : బాసర ఆలయ అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి సారించింది. సీఎం రేవంత్‌రెడ్డి ఈ నెల 6న బాసర సరస్వతి ఆలయం అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నారు. సుమారు రూ.225 కోట్ల వ్యయంతో ఆలయ అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించనున్నట్లు ప్రభుత్వం తెలిపింది. బాసర ఆలయ అభివృద్ధికి సంబంధించి సమగ్ర మాస్టర్ ప్లాన్ ఇప్పటికే సిద్ధం కాగా, ఆలయాన్ని భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి చేయాలని సీఎం అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని విశాలమైన రహదారులు నిర్మించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే ఆలయ పరిసరాల్లో పర్యావరణ పరిరక్షణ దృష్ట్యా ఈవీ వాహనాలనే అనుమతించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఆలయ పవిత్రతకు భంగం కలగకుండా కఠిన నిబంధనలు అమలు చేయాలని స్పష్టం చేశారు. తిరుమల తిరుపతి దేవస్థానం తరహాలో ఆలయ పరిసరాల్లో ఎలాంటి రాజకీయ కార్యకలాపాలు జరగకుండా నియంత్రణలు ఉండాలని సీఎం పేర్కొన్నారు. భక్తులకు

11లో


## దక్షిణాది రాష్ట్రాలకు

# అన్యాయం జరగదు

### - సీట్లు కోల్పోతామన్న వాదనలో అర్థం లేదు
### - కేరళ ఎన్నికల ప్రచారంలో ప్రధాని మోడీ

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

తిరువనంతపురం, ఏప్రిల్ 4 : జనాభా నియంత్రణతో దక్షిణాది రాష్ట్రాలు లోక్‌సభ స్థానాలు కోల్పోతాయంటూ చేస్తున్న వాదనల్లో నిజం లేదని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. కొందరు కావాలనే ఈ వాదనను తెరపైకి తెచ్చారని అన్నారు. కేరళ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ సారథ్యంలోని నేషనల్ డెమోక్రటిక్ అలయెన్స్ అధికారంలోకి వస్తుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ఎల్డీఎఫ్ ఉద్వాసనకు కౌంట్‌డౌన్ మొదలైందని చెప్పారు. తిరువళ్లలో శనివారంనాడు జరిగిన ఎన్నికల ప్రచార సభలో మోదీ మాట్లాడుతూ, కేరళ అభివృద్ధిపై కాంగ్రెస్ సారథ్యంలోని యూడీఎఫ్ కూటమి ఎన్నడూ దృష్టి పెట్టలేదని, 2004-2014 మధ్య కేరళ అభివృద్ధికి అప్పటి కేంద్రంలోని యూపీఏ ప్రభుత్వం కేటాయించిన మొత్తం కంటే తమ ప్రభుత్వం ఎక్కువ కేటాయించిందని చెప్పారు. 'ఇంతకుముందు కూడా ఇక్కడకు వచ్చాను. కానీ ఈసారి అన్నివైపుల నుంచి మార్పు కోరుతున్న బలమైన సంకేతాలు కనిపిస్తున్నాయి. కేరళలో అతిపెద్ద మార్పు రాబోతోంది. తొలిసారి బీజేపీ-ఎన్డీయే ప్రభుత్వం కేరళలో



అధికారంలోకి రాబోతోంది' అని మోదీ ధీమా వ్యక్తం చేశారు. ఎల్డీఎఫ్-యూడీఎఫ్ ప్రభుత్వాలు ఎప్పుడూ ఈ ప్రాంతం గురించి పట్టించుకోలేదని, రోడ్ల పరిస్థితి అధ్వానంగా ఉందని, చాలా ఏళ్లుగా ఒక్క ప్రధాన బ్రిడ్జి కూడా నిర్మించ లేదని, మెడికల్ కాలేజీ పరిస్థితి దయనీయంగా ఉందని

11లో

## తెలంగాణ సంపద

# కొల్లగొడుతున్న రేవంత్

- కాంగ్రెస్ ఎన్నికల ఫండ్ కోసం రాష్ట్ర సంపద తరలింపు
- బిజెపి ఎంపి ఈటెల రాజేందర్ ఘాటు విమర్శలు



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

వరంగల్,ఏప్రిల్4 : తెలంగాణ ప్రజల సంపదను రేవంత్ రెడ్డి కొల్లగొడుతున్నారని ఈటల రాజేందర్ ఆరోపణలు గుప్పించారు. ఐదు రాష్ట్రాల ఎన్నికల కోసం రాష్ట్ర ప్రజల సంపదను తరలిస్తున్నారని మండిపడ్డారు. ఈ మేరకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ఆరు గ్యారెంటీలు, ఫీజురీయింబర్స్‌మెంట్ సహా పలు అంశాలపై సీఎంకు ప్రశ్నలు సంధించారు. తెలంగాణ ఎన్నికల వేళ ఆరు గ్యారంటీలు- 66 హామీల పేరుతో ప్రజలను ఆయన మోసం చేశారని ఎంపీ ఈటల

11లో





## కాంగ్రెస్‌కు కౌంట్‌డౌన్ మొదలు

### ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, ఏప్రిల్ 4 : క్యాతనపల్లి, ఇబ్రహీంపట్నం పీఠాలు బీఆర్ఎస్ కైవసం కావడం హర్షణీయమని ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. అధికార కాంగ్రెస్ ఎన్ని అరాచకాలు చేసినా ఆ స్థానాలను బీఆర్ఎస్ దక్కించుకుందన్నారు. అణచివేత, అప్రజాస్వామిక చర్యలకు రాష్ట్రంలో తావులేదని ఈ తీర్పు స్పష్టం చేసింది. కాంగ్రెస్‌కు ప్రజాక్షేత్రంలో కౌంట్‌డౌన్ మొదలైందని ఈ ఫలితాలు చెప్పాయి. మున్సిపల్ ఛైర్మన్, వైస్ ఛైర్మన్లుగా ఎన్నికైన వారికి శుభాకాంక్షలు' అంటూ ఎక్స్‌లో పోస్టు చేశారు.

## భారీ ఉగ్రకుట్రను

# భగ్నం చేసిన పోలీసులు

### - కుట్రదారులు నలుగురి అరెస్ట్







న్యూఢిల్లీ,ఏప్రిల్4 : దేశంలో భారీ పేలుళ్ల ఉగ్రకుట్రను ఉత్తర్ ప్రదేశ్ పోలీసులు భగ్నం చేశారు. పేలుళ్లకు ప్రణాళికలు రచించిన నలుగురిని ఉత్తర ప్రదేశ్ ఉగ్రవాద నిరోధక దళం(ఏటీఎస్) అరెస్టు చేసింది. నిందితులకు పాక్ ఉగ్ర సంస్థలతో సంబంధాలు ఉన్నట్లు విచారణలో తేలింది. నలుగురు నిందితులను సాకిబ్ అలియాస్ డెవిల్, వికాస్ గెహ్లోవత్ అలియాస్ రౌనక్, లోకేశ్ అలియాస్ పాఎ÷-లా పండిట్ అలియాస్ బాబు అలియాస్ సంజు, అర్బాబ్‌గా గుర్తించారు. పాకిస్థాన్ హ్యాండ్లర్ల ఆదేశాల మేరకు వీరంతా పని చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. వీరంతా దేశవ్యాప్తంగా పేలుళ్లకు ప్లాన్ చేసినట్లు పోలీసులు తెలిపారు. నలుగురు నిందితులు టెలిగ్రామ్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సోషల్ మీడియా వేదికల ద్వారా పాకిస్థాన్ తీవ్రవాద గ్రూపులతో సంబంధాలు కలిగి ఉన్నట్లు విచారణలో ఏటీఎస్ పోలీసులు గుర్తించారు. ప్రధాన నిందితుడు మీరట్‌కు చెందిన సాకిబ్ అలియాస్ డెవిల్ అని తెలిపారు. మిగిలిన ముగ్గురితో కలిసి దేశంలో

11లో

# ఖానాపూర్ మున్సిపల్ ఎన్నిక వాయిదా

### - చేతులు ఎత్తే క్రమంలో కౌన్సిలర్ల మధ్య వివాదం
### - ఎన్నిక సందర్భంగా జోగురామన్న మౌజ్ అరెస్ట్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

నిర్మల్,ఏప్రిల్4 :ఖానాపూర్ ఛైర్‌పర్సన్ ఎన్నిక నేపథ్యంలో కౌన్సిలర్ల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. చేతులు ఎత్తే క్రమంలో కౌన్సిలర్ల మధ్య వివాదం నెలకొంది. అధికారులతో ఎమ్మెల్యే, కాంగ్రెస్ కౌన్సిలర్లు వాగ్వాదానికి దిగారు. దీంతో నిర్మల్ జిల్లా ఖానాపూర్ మున్సిపల్ ఛైర్మన్ ఎన్నిక వాయిదా పడింది. మళ్లీ ఎప్పుడు నిర్వహిస్తారన్న దానిపై సందిగ్ధత నెలకొంది. ఛైర్మన్ ఎన్నిక సందర్భంగా చేతులు ఎత్తే క్రమంలో కౌన్సిలర్ల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. అధికారులతో ఎమ్మెల్యే బొజ్జు, కాంగ్రెస్ కౌన్సిలర్లు వాగ్వాదానికి దిగారు. ఈ క్రమంలోనే సమావేశం నుంచి ఎమ్మెల్యే బయటకు వెళ్లిపోయారు. మరోవైపు మున్సిపల్ కార్యాలయం ఎదుట భాజపా, బీఆర్ఎస్ సభ్యులు ఆందోళనకు దిగారు. ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అధికారులను ఆయన బెదిరిస్తున్నారని ఆక్షేపించారు. ఇఇలావుంటే ఖానాపూర్ మున్సిపల్ ఛైర్మన్ ఎన్నిక సందర్భంగా మాజీ మంత్రి , నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జి జోగు రామన్నను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. ఆదిలాబాద్‌లోని మాజీ మంత్రి ఇంటికి వెళ్లిన పోలీసులు హౌస్ అరెస్టు చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా జోగు రామన్న మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి హోంశాఖను తన ఆధీనంలో ఉంచుకొని ప్రశ్నించే గొంతులను అక్రమ అరెస్టులు చేయించి జైలుకు పంపడమే లక్ష్యంగా

11లో

## కెసిఆర్ క్యాంప్ కార్యాలయంపై దాడి

### - రేవంత్ ఆదేశాలతోనే దాడికి వ్యూహం
### - తీవ్రంగా ఖండించిన హరీష్ రావు



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, ఏప్రిల్ 4 : ప్రతిపక్ష నేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ గజ్వేల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం పై కాంగ్రెస్ గూండాల దాడిని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్‌రావు తీవ్రంగా ఖండించారు. ఇది ముమ్మాటికీ సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలతో

11లో

## బిఆర్ఎస్ ఖాతాలో

# ఇబ్రహింపట్నం, క్యాతన్‌పల్లి

### - పట్నం ఛైర్మన్‌గా టేకుల సుదర్శన్ రెడ్డి ఎన్నిక
### - క్యాతన్‌పల్లి ఛైర్‌పర్సన్‌గా గొడిశెల సంధ్యారాణి ఎన్నిక
### - రెండుచోట్లా ఎన్నికలకు దూరంగా ఉన్న కాంగ్రెస్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్,ఏప్రిల్4 : రంగారెడ్డి జిల్లాలోని ఇబ్రహీం పట్నం మున్సిపాలిటీని బీఆర్ఎస్ కైవసం చేసుకుంది. ఛైర్మన్‌గా టేకుల సుదర్శన్‌రెడ్డి ఎన్నిక య్యారు. వైస్ ఛైర్‌పర్సన్‌గా భాజపా కౌన్సిలర్ ముత్యాల శ్యామలను ఎన్నుకున్నారు. మరోవైపు మంచిర్యాల జిల్లా క్యాతనపల్లి మున్సిపాలిటీని కూడా గులాబీ పార్టీ దక్కించుకుంది. ఇక్కడ ఛైర్మన్‌గా బీఆర్ఎస్ అభ్యర్థి సంధ్యారాణి ఎన్నికయ్యారు. వైస్ ఛైర్‌పర్సన్ పదవిని సీపీఐ అభ్యర్థి సరిత దక్కించుకున్నారు. ఈ ఎన్నికకు కాంగ్రెస్ కౌన్సిలర్లు దూరంగా ఉన్నారు. గత కొన్ని





రోజులుగా ఇబ్రహీంపట్నం మున్సిపల్ ఛైర్మన్ ఎన్నికపై ఉత్కంఠ వీడింది. ఎట్టకేలకు ఈ మున్సిపాలిటీని భారత్ రాష్ట్ర సమితి కైవసం చేసుకుంది. ఛైర్మన్‌గా బీఆర్ఎస్ అభ్యర్థి టేకుల సుదర్శన్‌రెడ్డి ఎన్నికయ్యారు. వైస్ ఛైర్‌పర్సన్‌గా బీజేపీ కౌన్సిలర్ ముత్యాల శ్యామలను ఎన్నుకున్నారు. మరోవైపు.. ఈ ఎన్నికలో ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. ఎన్నికను వాయిదా వేయాలని కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ 55 రోజులు క్యాంప్ నిర్వహించిందని కాంగ్రెస్ ఆరోపించింది.

11లో

# సింగరేణి కార్మికులకు శుభవార్త

### – సహజమరణానికి కూడా పదిలక్షల బీమా

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్,ఏప్రిల్4 : సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ కార్మికుల సంక్షేమం దిశగా మరో కీలక అడుగు పడింది. సింగరేణి యాజమాన్యం తీసుకున్న ప్రత్యేక చొరవతో, కార్మికులకు లభించే బీమా సౌకర్యం ఇప్పుడు మరింత విస్తృతమైంది. ఇకపై ప్రమాదవశాత్తు జరిగే మరణాలకే కాకుండా, సహజ మరణానికి కూడా రూ. 10 లక్షల ఉచిత బీమా పథకాన్ని అమలు చేయాలని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నిర్ణయించింది. సాధారణంగా బ్యాంకులు ప్రమాద బీమాను మాత్రమే అందిస్తుంటాయి. అయితే, సింగరేణి కార్మికుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని యాజమాన్యం యూనియన్ బ్యాంక్ అధికారులతో జరిపిన చర్చలు సఫలమయ్యాయి. కార్మికులందరికీ జీతాల ఖాతాలు అదే బ్యాంకులో ఉండటంతో, సామాజిక బాధ్యతలో భాగంగా ఈ అదనపు ప్రయోజనాన్ని కల్పించేందుకు బ్యాంక్ అంగీకరించింది.సింగరేణిలో పనిచేస్తున్న కార్మికులందరికీ ఇది వర్తిస్తుంది. ఈ నూతన బీమా విధానం ఈ నెల 1వ తేదీ నుండే అమలులోకి వచ్చింది. దీని కోసం కార్మికులు

11లో

# ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్,ఏప్రిల్4 :హైదరాబాద్ నగరంలో ఫుట్‌పాత్ ఆక్రమణలపై జీహెచ్‌ఎంసీ కొరడా ఝళిపించింది. ఆరు జోన్లలో ఫుట్‌పాత్‌లను ఆక్రమించి చేపట్టిన అక్రమ నిర్మాణాలు, షెడ్లను జీహెచ్‌ఎంసీ సిబ్బంది తొలగిస్తున్నారు. జాంబాగ్ వద్ద ఆక్రమణల తొలగింపు చర్యలను కమిషనర్ ఆర్.వి.కర్ణన్ పరిశీలించారు. అత్తాపూర్ సర్కిల్ వద్ద రోడ్డును ఆక్రమించి చేపట్టిన నిర్మాణాల కూల్చివేతను అధికారులు చేపట్టారు. ఆరాంఘర్ నుంచి డెయిరీ ఫామ్ చౌరస్తా వరకు అక్రమ నిర్మాణాలు వెలిశాయి. దీంతో రంగంలోకి దిగిన అధికారులు భారీ బందోబస్తు మధ్య కూల్చివేతలు చేపట్టారు. పోలీసులతో యజమానులు వాగ్వాదానికి దిగడంతో ఇక్కడ పరిస్థితి ఉద్రిక్తంగా మారింది.

# గ్రామ సభలు, వార్డు సభల పేరుతో ప్రజాధనం వృధా

## - సమస్యలకు పరిష్కారం లేని సభలు ఎందుకు...?
## - జిల్లా తొలి జడ్పీ చైర్పర్సన్ దావ వసంత సురేష్



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జగిత్యాల, ఏప్రిల్ 04 : గ్రామ సభలు, వార్డు సభల పేరుతో ప్రభుత్వం ప్రజాధనం వృధా చేస్తుందని, సమస్యలకు పరిష్కారం లేని సభలు ఎందుకు అని జిల్లాతొలి జడ్పీ చైర్పర్సన్ దావ వసంత సురేష్ అన్నారు. శనివారం జగిత్యాల జిల్లా బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో బిఆర్ఎస్ నాయకులతో కలిసి మీడియా సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మొన్న జరిగినటువంటి గ్రామసభలు, వార్డు సభలు ఎందుకోసం, ఎవరి కోసం జరిపినట్టు అని ప్రశ్నించారు. గతంలో ప్రజాపాలన పేరు మీద దరఖాస్తులు తీసుకొని ఒక్కదానికి కూడా సమస్యకు పరిష్కారం దొరికిందా అని ప్రశ్నించారు. గ్రామసభలు, వార్డు సభలో ప్రభుత్వం ప్రజలకు జవాబుదారితనంగా ఉండాలి కానీ.. ఏదో నామమాత్రంగా సభలు నిర్వహించారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మేనిఫెస్టో ప్రకారం ఏ ఒక్క హామీ అయినా అమలు అయిందా అని అన్నారు. బిఆర్ఎస్ హయంలో ఇచ్చిన పెన్షన్లు, రుణమాఫీ, రైతుబంధు, కళ్యాణ లక్ష్మి మొన్న జరిగిన గ్రామసభల్లో చెప్తున్నారు. ఇచ్చిన హామీలు వందరోజులు అమలు చేస్తా అన్నావ్ కానీ ఇంతవరకు ఒక్కటి కూడా అమలు కాలేదని ముఖ్యమంత్రిని ప్రశ్నించారు. గ్రామ సభలు పెట్టడానికి అధికారులు, ప్రజాప్రతినిధులు వెనుకడుగు వేస్తున్నారని, ఎందుకంటే ఒక హామీ కూడా అమలు చేయలేదు ప్రజలకు ఏమి జవాబు చెప్పాలని, మార్పు మార్పు అని రేవంత్ రెడ్డిని గెలిపిస్తే తెలంగాణలో ఏం మార్పు వచ్చిందని అన్నారు. ఎంతమంది ఆడబిడ్డలకు మహాలక్ష్మీ పథకం కింద రూ.2,500, కళ్యాణ లక్ష్మి కింద తులం బంగారంతో పాటు లక్ష రూపాయలు చెక్కు ఇచ్చారని అన్నారు. విద్య భరోసా కింద ఐదు లక్షల పథకం జగిత్యాల నియోజకవర్గంలో ఎంత మంది విద్యార్థులకు అమలైందని అడిగారు. జగిత్యాల నియోజకవర్గ ప్రజలందరూ కేసీఆర్ కావాలని ఎమ్మెల్యేనీ గెలిపించుకుంటే, గెలిచిన ఎమ్మెల్యే రేవంత్ రెడ్డి కావాలని కాంగ్రెస్ పార్టీలోకి వెళ్లారని అన్నారు. ప్రభుత్వం ప్రజలకు జవాబుదారితనంగా ఉన్నప్పుడే సభలు నిర్వహించాలని, అర్జీలు పెట్టుకుంటే సమస్యకు పరిష్కారం దొరికే విధంగా ఉండాలని అన్నారు. వార్డు సభలు గ్రామసభలు గందరగోళంగా ఉన్నాయని అన్నారు.

కెసిఆర్ కుటుంబాన్ని బిఆర్ఎస్ పార్టీని తిట్టడం తప్ప ఈ రెండున్నర సంవత్సరాలలో కాంగ్రెస్ ప్రభుత్వం రేవంత్ రెడ్డి చేసింది ఏమీ లేదని అన్నారు. రేవంత్ రెడ్డి కేరళలో ఎన్నికల ప్రచారం చేస్తూ తెలంగాణలో ఆరు గ్యారెంటీలు అమలు చేశాడని చెప్తున్నాడు కదా..తెలంగాణలోని కొడంగల్ నియోజకవర్గానికి వచ్చి ఆరు గ్యారంటీలు అమలు చేశాం అని చెప్పే దమ్ము రేవంత్ రెడ్డికి ఉందా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజలు చీకోడుతున్నారని ప్రజలలో అతి తక్కువ కాలంలో వ్యతిరేకత సాధించుకున్న పార్టీ ఏదైనా ఉందా అంటే అది కాంగ్రెస్ పార్టీ అని అన్నారు. గ్రామసభలో వార్డ్ సభల పేరిట కొత్త నాటకం తెరలైపోయారు తప్ప దానివల్ల ప్రజలకు ఎలాంటి ఉపయోగం లేదని ప్రభుత్వ ధనం వృధా అవుతుంది అని అన్నారు. మోసపూరిత మాటలకు ప్రజలు ఆశపడి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని అన్నారు. వార్డు సభల పేరిట ప్రజల దృష్టి మళ్లించి డైవర్షన్ పాలిటిక్స్ ఈ కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తుందని అన్నారు. కొట్లాడి సాధించుకున్న తెలంగాణను 10 సంవత్సరాలు కేసీఆర్ బంగారు తెలంగాణ చేస్తే తెలంగాణ ద్రోహి రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి తెలంగాణ అభివృద్ధికి అడ్డుపడుతున్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు ఏ మేరకు అమలు అయ్యాయి అని గ్రామసభలో వార్డు సభలో ఉంచాల్సిన బాధ్యత ప్రభుత్వానికి ఉంటది అని అన్నారు. కెసిఆర్ నాయకత్వంలో ప్రజల గొంతుకై ప్రభుత్వాన్ని ఎల్లవేళలా ప్రశ్నిస్తూనే ఉంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు అయిల్నేని వెంకటేశ్వర్ రావు, బిఆర్ఎస్ కౌన్సిలర్ లు దేవేందర్ నాయక్, హరీష్, మాజీ పాక్స్ చైర్మన్ మహిపాల్ రెడ్డి, జగిత్యాల రూరల్, అర్బన్ మండల అధ్యక్షుడు అయిల్నేని ఆనంద్ రావు, తుమ్మ గంగాధర్, నాయకులు గంగారం, హరీష్, గంగారెడ్డి, గంగాధర్, అనురాధ, బొల్లారాపు కళ్యాణి, నవీన్, ఆరుముల్ల మానస, శివకుమార్, తదితర బిఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

# జనక్ ప్రసాద్‌కు గౌరవ డాక్టరేట్ ప్రదానం

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



హైదరాబాద్, ఏప్రిల్ 4: కార్మిక సంక్షేమం మరియు ట్రేడ్ యూనియన్ ఉద్యమాల్లో నిరంతరం కృషి చేస్తున్న ఐఎన్టియుసి సెక్రటరీ జనరల్, తెలంగాణ రాష్ట్ర కనీస వేతన సలహా మండలి చైర్మన్ జనక్ ప్రసాద్ గారికి అరుదైన గౌరవం దక్కింది. కార్మికుల హక్కుల పరిరక్షణలో ఆయన అందిస్తున్న విశేష సేవలను గుర్తిస్తూ 'గౌరవ డాక్టరేట్' పురస్కారంతో ఆయనను సత్కరించారు. న్యూఢిల్లీలోని ప్రతిష్టాత్మక కాన్స్టిట్యూషన్ క్లబ్ ఆఫ్ ఇండియాలో శనివారం ఈ వేడుక అత్యంత వైభవంగా జరిగింది. జి.హెచ్.ఆర్.టి. ఇండియా సంస్థ, డబ్ల్యూ.ఈ.బి.బి.సి. యూనివర్సిటీ, ఏ.ఐ.యు. యూనివర్సిటీల సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ యూనియన్ మంత్రి ముఖ్య అతిథిగా విచ్చేసి జనక్ ప్రసాద్ గారికి డాక్టరేట్ పట్టాను అందజేశారు. ఈ వేడుకలో ఆఫ్ఘనిస్తాన్, ఎథియోపియా, ఘానా దేశాల కాన్సులేట్ జనరల్స్ ప్రత్యేక అతిథులుగా పాల్గొని ఆయనను అభినందించారు. దశాబ్దాలుగా కార్మిక వర్గాల సమస్యలపై పోరాడుతూ, వారి సామాజిక, ఆర్థికాభివృద్ధికి జనక్ ప్రసాద్ చేస్తున్న కృషిని ఈ సందర్భంగా వక్తలు కొనియాడారు. కార్మిక లోకం నుంచి ఆయనకు ఈ గౌరవం దక్కడం పట్ల పలువురు ట్రేడ్ యూనియన్ నాయకులు, ప్రముఖులు హర్షం వ్యక్తం చేస్తున్నారు

# ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ ఇప్పించండి సారూ...

## - విలేకరుల సమావేశంలో బాధితురాలు పద్మ ఆవేదన

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



ఖమ్మం, ఏప్రిల్ 4 : గత సంవత్సర కాలంగా ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ కోసం రెవెన్యూ అధికారుల చుట్టూ తిరిగిన సర్టిఫికెట్ ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని కామేపల్లి మండలం పండితాపురం గ్రామానికి చెందిన అమ్మడి పూడి పద్మ ఆవేదన వ్యక్తం చేశారు. ఖమ్మం ప్రెస్ క్లబ్ లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అమ్మడి పూడి పద్మ మాట్లాడుతూ...తన తండ్రి అమ్మడి పూడి సత్యంకు మొదటి భార్య మంగమ్మకు ఐదుగురు సంతానమని, రెండో భార్య భాగ్యమ్మకు ఒక కుమారుడు జన్మిం చాడని, తన తండ్రి తో పాటు ఇద్దరు భార్యలు కూడా మృతి చెంది చాలా కాలం అవుతుందని తెలిపారు. ఇద్దరు భార్యలకు కలిగిన సంతానానికి ఉమ్మడిగా ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికేట్ కోసం కామేపల్లి మండలం తహసిల్దార్ కార్యాలయంలో గత సంవత్సరం క్రితం ఫ్యామిలీ నెంబర్ సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేయడం జరిగిందని తెలిపారు. సర్టిఫికెట్ కోసం తహసిల్దార్ ను కలిస్తే ఆర్ఐని కలవమని, ఆర్ఐని కలిస్తే వీఆర్వో ను కలవమని ఒకరిపై ఒకరు చెప్పుకుంటూ కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. రెండు కుటుంబ సభ్యులు కలిసి సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేసినా సకాలంలో సర్టిఫికెట్ ఇవ్వకుండా అనేక ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ తీసుకొనే హక్కు తమకు ఉందని, కానీ కామేపల్లి మండల తహసిల్దార్ కార్యాలయంలో అధికారుల తీరు అభ్యంత రకరంగా, అనాలోచిత చర్యగా ఉందన్నారు. జిల్లాలో ఎక్కడాలేని విధంగా కేవలం కామేపల్లి మండల తహసిల్దార్ కార్యాలయంలోనే ఇటువంటి వింత ప్రవర్తన కలిగి ఉండటం విచారకరమని మండిపడ్డారు. ఇటువంటి ఘటన మరెవరికి రాకూడద న్నారు.జిల్లా ఉన్న తాధికారులు జోక్యం చేసుకొ ని తమకు ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ ఇప్పించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# కార్మిక సంఘాల ఆధిపత్య ధోరణితోనే కార్మిక హక్కులు హరించుకుపోతున్నాయి

## - టి.ఎస్.యు.ఎస్. రాష్ట్ర అధ్యక్షులు కామెర గట్టయ్య

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



జయశంకర్-భూపాలపల్లి, ఏప్రిల్ 4 : సింగరేణిలో కొన్ని కార్మిక సంఘాల ఆధిపత్య ధోరణి కారణంగా కార్మిక హక్కులు క్రమంగా హరించుకుపోతున్నాయని తెలంగాణ సింగరేణి ఉద్యోగుల సంఘం (టి.ఎస్.యు.ఎస్.) రాష్ట్ర అధ్యక్షుడు కామెర గట్టయ్య ఆరోపించారు. భూపాలపల్లి పట్టణంలోని తెలంగాణ సింగరేణి ఉద్యోగుల సంఘం కార్యాలయంలో జరిగిన కార్మిక సంఘాల ఐక్యవేదిక సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. గతంలో సింగరేణిలో ఐక్య పోరాటాల ద్వారా అనేక హక్కులు సాధించుకున్న చరిత్ర కార్మిక వర్గానిదని గుర్తు చేశారు. సింగరేణి కార్మికుల పోరాటాల ప్రభావంతో కోల్ ఇండియా కార్మికులు కూడా పలు హక్కులు పొందిన విషయం తెలిసిందేనన్నారు. అయితే, సింగరేణిలో ఎన్నికల పాలసీ ప్రవేశపెట్టిన తర్వాత కార్మిక సంఘాలు విభజనకు గురై, గెలిచిన సంఘాలు యాజమాన్యం మరియు ప్రభుత్వాలకు అనుకూలంగా మారినట్లు విమర్శించారు. ఈ పరిస్థితి కొనసాగితే సింగరేణి భవిష్యత్తే ప్రమాదంలో పడే అవకాశముందని ఆయన హెచ్చరించారు. ఈ సంవత్సరం ఫిబ్రవరి 12న దేశవ్యాప్తంగా బొగ్గు గనుల్లో భారీ సమ్మె జరిగినప్పటికీ కేంద్ర ప్రభుత్వం స్పందించలేదని ఆయన పేర్కొన్నారు. కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్లను ఏకపక్షంగా 2026 ఏప్రిల్ నుండి అమలు చేసేందుకు ప్రయత్నించడం అప్రజాస్వామికమని ఆయన విమర్శించారు. రైతు నల్ల చట్టాలకు వ్యతిరేకంగా ఢిల్లీలో దాదాపు 700 రోజులపాటు సాగిన రైతాంగ పోరాటాన్ని ఉదాహరణగా ప్రస్తావిస్తూ, అలాంటి దీర్ఘకాలిక ఐక్య ఉద్యమాలు సింగరేణి కార్మికులకు కూడా అవసరమని గట్టయ్య అభిప్రాయపడ్డారు. దేశవ్యాప్తంగా 40 కోట్ల కార్మిక వర్గం తమ హక్కుల పరిరక్షణ కోసం ఏకమై పోరాడాల్సిన అవసరం ఉందన్నారు.కొన్ని కార్మిక సంఘాలుఎన్నికల అనంతరం కృత్రిమ ఉద్యమాలు చేస్తున్నాయని ఆరోపించిన గట్టయ్య, నిజంగా కార్మిక హక్కుల పట్ల చిత్తశుద్ధి ఉంటే అన్ని సంఘాలను ఏకం చేసి దీర్ఘకాలిక పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం లేబర్ కోడ్ల అమలుపై పట్టుబడుతున్న నేపథ్యంలో బొగ్గు, ఆయిల్, విద్యుత్ రంగాల కార్మికులను ఏకం చేసి జాతీయ స్థాయిలో నిరవధిక సమ్మెకు సిద్ధం కావాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో ఐఎఫ్టీయూ రాష్ట్ర నాయకులు జి.రాములు, పోషమల్లు, ఎస్‌జీకేఎస్ రాష్ట్ర నాయకులు మహేందర్, టీఎస్‌యూఎస్ నాయకులు నీరేటి రాజన్న, జైపాల్ సింగ్, చారువాక దాసరి జనార్ధన్, మసాలా ప్రసాద్ రెడ్డి, నామన శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



# 'మాజీ సీఎం కేసీఆర్' క్యాంపు కార్యాలయంపై దాడిని ఖండించిన సీతాలక్ష్మి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భద్రాద్రి-కొత్తగూడెం, ఏప్రిల్ 4:మాజీ సీఎం కేసీఆర్ గజ్వేల్ క్యాంపు కార్యాలయం పై చేసిన దాడిని భద్రాద్రి జిల్లా కొత్తగూడెం మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ కాపు సీతాలక్ష్మి ఖండించారు. సుజాతనగర్ మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు సత్యనారాయణ ఆధ్వర్యంలో శనివారం సుజాతనగర్ మండల కేంద్రంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ నిరసన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. తొలి తెలంగాణ ముఖ్యమంత్రి, తెలంగాణ రాష్ట్ర సాధకుడు కేసీఆర్ అని, అలాంటి గొప్ప నాయకుడి క్యాంపు కార్యాలయం పై దాడులు చేయడం హేయమైన చర్య అని తెలిపారు. కాంగ్రెస్ గూండాలు దాడికి పాల్పడటమే కాకుండా, సీఎం రేవంత్ రెడ్డి ఫోటో పెట్టి రాక్షసానందాన్ని పొందారని ఆమె ఆరోపించారు. ఇంత జరుగుతుంటే పోలీసులు చోద్యం చూస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణలో అమలు అవుతుంది ప్రజా పాలన కాదని, కాంగ్రెస్ గూండాల పాలన నడుస్తుందని ఫైరయ్యారు. గజ్వేల్ ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ పై దాడి చేసిన గూండాలను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు చింతలపూడి జగన్, చల్ది రవి, కార్తీక్, కిషోర్, రాజు, సాజిత్, ఆసిఫ్ జానీ, పులి వెంకటేష్, ప్రదీప్, ఇర్ఫాన్, గాజుల కృష్ణ, వెంకటేష్, అమన్, మద్దెల సుధీర్, పూర్ణచందర్, జనిత్, హరి, షణ్ముఖ సాయి తదితరులు పాల్గొన్నారు.

# పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

## మేయర్ మహంకాళి స్వామి



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కోల్ సిటి (గోదావరిఖని), ఏప్రిల్ 4 : ఇంటిని శుభ్రంగా ఉంచుకున్న మాదిరిగా పరిసరాలు కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాలని రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి ప్రజలను అభ్యర్థించారు. వార్డు సందర్శనలో భాగంగా శనివారం 11 వ డి విజన్ సంజయ్ నగర్ , జ్యోతి నగర్ ప్రాంతాల్లో డిప్యూటీ మేయర్ పాతపెల్లి ఎల్లయ్య , స్థానిక కార్పొరేటర్ కారెశీగుల రమ్య , నాయకులు దాసరి విజయ్ తదితరులతో కలసి ఆయన పర్యటించారు . ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు సహకరించి చెత్త బయట వేయకపోతే కాలువలన్నీ సాఫీగా ప్రవహించి పూడిక తొలగించడానికి డబ్బులు ఖర్చు చేయవలసిన అవసరం ఉండదని అన్నారు. కాలువల్లో పూడిక తొలగిస్తుంటే పాడై పోయిన కూలర్లు , పరుపులు వంటి భారీ వస్తువులు కూడా బయట పడడం విచారకరమని అన్నారు. కాలువ ప్రవాహానికి ఆటంకం కలిగించే ఈ తరహా వస్తువులు వేసిన వారికి జరిమానా విధించక తప్పదని అన్నారు. గతంలో మాదిరిగా లక్షలాది రూపాయలు ఖర్చు చేసే ఆర్థిక భారం పడకుండా మునిసిపల్ వాహనాలు , సిబ్బంది సేవలను ఉపయోగించుకుంటూ శుభ్రం చేయిస్తున్నామని అన్నారు. ఈ సంధర్భంగా రోడ్ల ప్రక్కన అడ్డంగా పెరిగిన కొమ్మలు , చెట్లు తొలగించారు. పిచ్చి చెట్లు , పొదలు తొలగించి శుభ్రం చేశారు. ఫైవ్ ఇంక్ లైన్ వంతెన వద్ద రైల్వే ట్రాక్ ప్రక్కన కాలువలో చైన్ జి సి బి సహాయంతో పూడిక మొత్తం తొలగించి నీరు సాఫీగా ప్రవహించేలా చర్యలు తీసుకున్నారు. సంజయ్ నగర్ లో అర్థాంతరంగా నిలిచిపోయిన భవనాన్ని పూర్తి చేసి స్వశక్తి మహిళలకు ఉపయోగపడేలా తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు. సంజయ్ నగర్ లోని ప్రభుత్వ పాఠశాల ను కూడా సందర్శించారు. తమ ఇళ్లపైన ప్రమాదకరంగా తీగలు వేలాడుతున్నాయని పలువురు దృష్టికి తీసుకురాగా చర్య తీసుకోవాలని ట్రాన్స్ కొ అధికారులను ఆదేశించారు. నగర పాలక సంస్థ సేవలు సరిగా అందుతున్నాయా అని ఆరా తీశారు. రోడ్డు వెడల్పు పనుల్లో భాగంగా కాలువ కూడా నిర్మిస్తామని అన్నారు. ప్రతి చివరి ఇంటి వరకు మంచి నీళ్లందిస్తామని అన్నారు. కాగా 11 వ డివిజన్ ప్రజలు ఆయనకి సాదరంగా స్వాగతం పలకడంతో పాటు అభిమానంగా ఆయన అభిరుచి మేరకు నోటు పుస్తకాలు అందజేశారు . వృద్ధురాలు దాసరి కొమురమ్మ కూడా తన వంతుగా నోట్ పుస్తకం ఇవ్వడంతో మేయర్ ఆమె అభిమానానికి మురిసిపోయారు. కృతజ్ఞతలు తెలిపారు. ఈ సంధర్భంగా కార్పొరేటర్లు వద్లూరి రవి , దాసరి సాంబమూర్తి , చిదురాల నాగరాజు , డేవిడ్ రాజు నాయకులు గడ్డం శ్రీనివాస్ , చుక్కల శ్రీనివాస్ , నగర పాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ నాయిని వెంకట స్వామి , డి . ఇ .ఇ . అఫ్తాబ్ , ఎ . ఇ అన్వేష్ , టి పి ఎస్ నవీన్ , సూపరింటెండెంట్ పబ్బాల శ్రీనివాస్ , శానిటరీ ఇన్స్ పెక్టర్ సంపత్ జవాన్ అడెపు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



# మరోసారి ఔదార్యం చాటుకున్న తాళ్లూరి పంచాక్షరయ్య చారిటబుల్ ట్రస్టు

## - భద్రాచలంలోని సరోజిని వృద్ధాశ్రమానికి భారీ వితరణ
## - ఆశ్రమానికి రూ.5 లక్షల వ్యయంతో 10 కేవీ సోలార్ విద్యుత్తు ఏర్పాటు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భద్రాద్రి-కొత్తగూడెం, ఏప్రిల్ 4 : భద్రాద్రి-కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం ఇరవెండికి చెందిన తాళ్లూరి పంచాక్షరయ్య చారిటబుల్ ట్రస్టు మరోసారి ఔదార్యం చాటుకుంది. భద్రాచలంలోని సరోజిని వృద్ధాశ్రమానికి రూ.5 లక్షల వ్యయంతో 10 కేవీ సోలార్ విద్యుత్తు సౌకర్యాన్ని ఏర్పాటు చేసింది. తాళ్లూరి పంచాక్షరయ్య చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో గతంతోలనే ఆశ్రమం భవనం నిర్మించడంతో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. తాజాగా సోలార్ విద్యుత్తును ఏర్పాటు చేసి తమ మంచి మనసును చాటుకున్నారు. ట్రస్టు చైర్మన్ తాళ్లూరి పంచాక్షరయ్య మనవడు ప్రవాస భారతీయులు తానా మాజీ అధ్యక్షుడు తాళ్లూరి జయశేఖర్ - నీలిమ దంపతుల కుమారుడు సాయిపంచాక్షర్ తన మొదటి నెల వేతనం నుంచి రూ.5 లక్షల వ్యయంతో 10 కేవీ సోలార్ విద్యుత్తును ఏర్పాటు చేయించారు. సాయిపంచాక్షర్ చిన్నతనం నుంచే సమాజసేవపై తనకు ఉన్న మక్కువను చాటుకున్నారు. తమ సొంతగడ్డ మీద అభివృద్ధి కార్యక్రమాలకు చేయూతను అందిస్తున్నారు. నూతనంగా ఏర్పాటు చేసిన సోలార్ విద్యుత్తును శనివారం లాంఛనంగా ప్రారంభించారు. ఆశ్రమానికి భారీ వితరణ అందించిన ట్రస్టు బాధ్యులకు ఆశ్రమం నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు చైర్మన్ తాళ్లూరి పంచాక్షరయ్య, తానా మాజీ అధ్యక్షులు తాళ్లూరి జయశేఖర్- నీలిమ దంపతులు, తాళ్లూరి ట్రస్టు డైరెక్టర్ వల్లూరిపల్లి వంశీకృష్ణ, బూర్గంపాడు పీఏసీఎస్ మాజీ చైర్మన్ బిక్కసాని శ్రీనివాసరావు, భద్రాచలం సర్పంచి పూనెం కృష్ణ, అడుసుమిల్లి జగదీశ్, పల్లంటి దేశప్ప, మోతుకూరి వీరయ్య, బొడ్డపాటి రామారావు, చావా లక్ష్మీనారాయణ, జలగం చంద్రశేఖర్, ఆశ్రమం నిర్వాహకులు సరోజిని తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణిలో ఆన్ ఫిట్ కార్మికుల వారసులకు వెంటనే ఉద్యోగాలు ఇవ్వాలి

## అధికారులకు లేఖ రాసిన ఆధార్ పార్టీ నేత బోడికళ ప్రేమ్ దయాల్



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భద్రాద్రి-కొత్తగూడెం, ఏప్రిల్ 4 : సింగరేణి సంస్థలో మెడికల్ బోర్డు ద్వారా అన్ఫిట్ అయిన కార్మికుల వారసులకు వెంటనే ఉద్యోగాలు కల్పించాలని అలియన్స్ ఆఫ్ డెమోక్రటిక్ రీఫార్మ్స్ (ఆధార్ పార్టీ) భద్రాద్రి జిల్లా, కొత్తగూడెం అసెంబ్లీ ఇంచార్జ్ బోడికళ ప్రేమ్ దయాల్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన శనివారం తెలంగాణ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, ఆర్థిక--విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క, సింగరేణి సంస్థ చైర్మన్-కమ్-మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ బుద్ధ ప్రకాష్ జ్యోతి, డైరెక్టర్ (పి.ఏ అండ్ డబ్ల్యూ), ఫైనాన్స్ గౌతమ్ పోట్రు లకు రెండు పేజీల లేఖ రాశారు. ఈ సందర్భంగా ప్రేమ్ దయాల్ మాట్లాడుతూ, మెడికల్ బోర్డు ప్రక్రియలో భాగంగా అనారోగ్య కారణాలతో అన్ఫిట్ అయిన కార్మికుల వారసులు సుమారు 700 మంది ఉద్యోగాల కోసం నెలలుగా ఎదురుచూస్తున్నారని తెలిపారు. కుటుంబ పెద్దలు అనారోగ్యంతో ఉద్యోగం చేయలేని పరిస్థితిలో ఉండటంతో వేతనాలు కోల్పోయి, కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని అన్నారు. వారసులకు నియామక పత్రాలు ఎప్పుడు వస్తాయో తెలియక ఆందోళన, నిరాశ నెలకొన్నదని, మరోవైపు వయసు పెరుగుతుండడంతో ఉద్యోగ సేవా కాలం కోల్పోతున్నారని పేర్కొన్నారు. విజిలెన్స్ విచారణ వంటి కారణాలతో కాలయాపన చేయకుండా వెంటనే నియామకాలు చేపట్టాలని లేఖలో కోరినట్లు తెలిపారు. గతంలో సింగరేణి భవిష్యత్తుపై అనిశ్చితి వ్యక్తమవుతున్న నేపథ్యంలో ఉద్యోగ ఖాళీలపై సందేహాలు వ్యక్తమవుతున్నాయని విమర్శించారు. అన్ఫిట్ కార్మికుల వారసులకు వెంటనే ఉద్యోగాలు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు.

# "మన ఇసుక వాహనం పోర్టల్" ద్వారా పారదర్శకంగా సరఫరా : జిల్లా కలెక్టర్ హరిత



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఆసిఫాబాద్, ఏప్రిల్ 04 : జిల్లాలో "మన ఇసుక వాహనశీ పోర్టల్" ద్వారా పూర్తి పారదర్శకంగా ఆన్లైన్ బుకింగ్ ద్వారా ఇసుకను అందించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ హరిత అన్నారు. శనివారం సమీకృత కలెక్టరేట్ భవన సముదాయంలోని సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ వారిచే మన ఇసుక ఆన్లైన్ బుకింగ్ వెబ్ పోర్టల్ పై తహసిల్దార్లు, పంచాయతి కార్యదర్శులు, గ్రామ పాలన అధికారులు, ఆపరేటర్లకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ ఎం డేవిడ్, ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావు, జిల్లా పంచాయతీ అధికారి బిక్షపతి, భూగర్భగనుల శాఖ సంచాలకులు గంగాధర్ రావుతో, కలిసి కలెక్టర్ హరిత పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇసుక అక్రమ రవాణా జరగకుండా ఏప్రిల్ 1 నుండి ఆన్లైన్ బుకింగ్ ద్వారా మాత్రమే ఇసుకను అందించాలని, అందులో భాగంగా తహసిల్దార్లు, పంచాయతీ కార్యదర్శులు, గ్రామ పాలన అధికారులు మన ఇసుక వాహనం పోర్టల్లో పొందుపరిచిన విధులు, బాధ్యతల పై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. ఇసుక రవాణాను ఆన్లైన్ ద్వారా పూర్తి పారదర్శకతతో నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లకు ఇసుక రవాణా పై లబ్ధిదారులకు మన ఇసుక వాహనం పోర్టల్ పై వివరించే బాధ్యత పంచాయతీ కార్యదర్శులదే అని తెలియ జేశారు. అధికారులు సమన్వయంతో పనిచేసి ఇసుక అక్రమ రవాణా జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామపంచాయతీలలో వేసవి త్రాగునీటికి ఇబ్బందులు లేకుండా చేతి పంపులు, బోర్ వెల్స్, పైప్ లైన్లను మరమ్మత్తులు చేపట్టి త్రాగునీటికి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. గ్రామపంచాయతీలలో పారిశుద్ధ్యం ప్రతిరోజు చేపట్టాలని వీధిలైట్లు పగటి పూట వెలుగుతున్నాయని వాటికి నియంత్రికలు అమర్చాలన్నారు.ఏప్రిల్ నెలలో నిర్వహిస్తున్న జనగణలో భాగంగా ఏన్యుమరేటర్లు ఇళ్ళ జాబితాను రూపొందిస్తున్నారని, వారికి పంచాయతీ కార్యదర్శులు సహకరించాలన్నారు. భూభారతి ధరఖాస్తులు పెండింగ్ లో లేకుండా తహసిల్దార్ లు దృష్టి సారించాలన్నారు. పిడిఎస్ బియ్యం మూడు నెలలవి ఒకేసారి పంపిణీ చేస్తున్నందున రద్దీ లేకుండా చూడాలని తెలిపారు.

ప్రజాలక్ష్యం

సంపాదకీయం

# గ్రామాల అభివృద్ధికి దృష్టి సారించాలి !

రైజింగ్ తెలంగాణ, ట్రీ మిలియన్ ఎకానమీ... ఇవన్నీ వినడానికి బాగానే ఉన్నా..ఆచరణలో పట్టుదల ముఖ్యం. ఎపిలో స్వర్ణగ్రామం, స్వర్ వార్డులు అంటూ కొత్త పేర్లతో ఊదరగొడుతున్నారు. గ్రామాలు లేకుండా అభివృద్ధి సాధ్యం కాదు. ఎంతసేపు పల్లెలను విస్మరించి, పట్టణాలకే పెద్దపీట వేయడం సరికాదు. గ్రామాల అవసరాలను గుర్తించడంలో ప్రభుత్వాలు విఫలం అవుతున్నాయి. నిరంతరంగా ప్రభుత్వంపై ఆధారపడే దుస్థితి నుంచి తప్పించాలి. ఫ్యూచర్ సిటీ, దేశ పురోభివృద్ధి, ఆర్థికంగా బలోపేతంలో పదిశాతం భాగస్వామ్యం అవుతామంటున్న సిఎం రేవంత్ రెడ్డి, గ్రామాలను విస్మరిస్తే అనుకున్న ఫలితాలను సాధించలేరు. గ్రామా లను బలోపేతం చేస్తే పట్టణాలపై ఒత్తిడి తగ్గగలదు. గ్రామాల్లో విద్య,వైద్యం, పారిశుధ్యం, పచ్చదనం వంటి వన్నీ ప్రధాన సమస్యలుగా ఉన్నాయి. గత రెండేళ్లుగా గ్రామాలు కునారిల్లాయి. కనీస వసతులు లేవు. గ్రామాల్లో అత్యధిక శాతం అధికార కాంగ్రెస్ ఆధిపత్యం లోనే ఉన్నాయి. రాజకీయాలకు అతీతంగా గ్రామాల అభివృద్ధి విషయంలో అంతా కలసి రావాలి. గ్రామాలను బలోపేతం చేస్తేనే, గ్రామాల ఆర్థిక వ్యవస్థలు బలపడితేనే రాష్ట్రం, తద్వారా దేశం అభివృద్ధి చెందగలదు. అందువల్ల ఇప్పటి నుంచే గ్రామాల అభివృద్ధికి ప్రణాళికలు రచించాలి. గ్రామాలను ఆర్థికంగా బలోపేతం చేసే విధంగా ఆలోచన చేయాలి. గ్రామాల్లో ప్రస్తుతం ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలన్నీ పరిష్కరించలేనివేమీ కాదు. అందువల్ల వెంటనే ఇందుకు కార్యాచరణ చేయాలి. సాగునీరు, తాగునీరు, విద్యుత్ సరఫరా, పారిశుద్యం వట్టి సమస్యలపై ఇరు రాష్ట్రాల సిఎంలు శ్రమించాలి. ఉచిత పథకాలు పెరిగినా కొద్దీ గ్రామాల్లో కూలీల కొరత ఏర్పడుతోంది. పనిచేసే కూలీలు దొరక్క రైతులు నానా అగచాట్లు పడుతున్నారు. అన్నీ ప్రభుత్వం చేస్తుందనే ధోరణి నుంచి ప్రజలు బయపటడేలా చేయాలి. నా గ్రామాన్ని నేనే కాపాడుకోవాలన్న నినాదంతో ముందుకు సాగాలి. సర్పంచ్‌లను అందుకు భాగస్వాములను చేయాలి. అనవసర పథకాలకు వేలకోట్లు తగలేసే బదులు గ్రామాలను అభివృద్ధి చేసే కార్యాచరణకు నిధులు వెచ్చించాలి. ప్రభుత్వంపై ఆశతో ప్రజలు ఉన్నా రని గుర్తించాలి. ఏదో చేస్తారన్న నమ్మకం ఉంది. ఇందిరమ్మ ఇళ్లు కావచ్చు, ఇతర అభివృద్ధికావచ్చు గ్రామాలను దృష్టిలో పెట్టుకుని ముందుకు సాగాలి. ప్రపంచ చిత్రపటంలో తెలంగాణను ముందువరసలో నిలబెడతామంటున్న ముఖ్యమంత్రులు చంద్రబాబు, రేవంత్ రెడ్డిలు గ్రామాలను విస్మరిస్తే ముందుకు సాగలేరు. ప్రధానంగా తాగునీటి సమస్య, వైద్యరం గాలను, విద్యారంగాన్ని బలోపేతం చేయాలి. గ్రామాల ను ఆర్థికంగా బలోపేతం చేసేలా కార్యచరణ ఉంటే నిరుద్యోగిత కూడా తగ్గుతుంది. వ్యయసాయాధిరత చిన్న పరిశ్రమలకు ఊతం ఇచ్చే చర్యలకు ప్రాధాన్యం ఇవ్వాలి. ప్రపంచంలో తెలంగాణకు ముఖ్యంగా రాజధాని హైదరాబాద్‌కు అత్యధిక ప్రాధాన్యతను కలిగి ఉన్నది. చారిత్రకంగా, భౌగోళికంగా,ఆర్థికంగా దేశ అభివృద్ధిలో తెలంగాణ అత్యంత కీలక పాత్రను పోషిస్తున్నది. రాష్ట్ర రాజధాని హైదరాబాద్ అబివృద్ధి ఆధునిక, హైటెక్ రాజధానిగా అభివృద్ధి చెందింది. దేశంలో ప్రధాన మెట్రో సిటీలుగా ప్రసిద్ధి చెందిన ఢిల్లీ, చెన్నై, ముంబయ్, కలకత్తాల కంటే అనువైన వాతావరణ పరిస్థితులు హైదరాబాద్‌లో ఉన్నాయి. హైదరాబాద్ చుట్టూ తెలం గాణ అభివృద్ధి చెందడానికి అనువైన వాతావరణం ఉంది. గ్రామీణ ఆర్థిక వ్యవస్థను అభివృద్ధి చేస్తే రాజ ధానులపై ఒత్తిడి తగ్గుతంది. ప్రధానంగా వ్యవసాయా ధారిత పరిశ్రమలతో యువతను గ్రామాలకు మళ్లిం చాలి. దాంతో ఆర్థికంగా ఎదుగుదలతో పాటు గ్రామాలు పురోగమిస్తాయి. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవతో ఉజ్వల తెలంగాణ నిర్మాణానికి పూనుకుంటే అది దేశానికి ఆదర్శంగా నిలుస్తుంది. 2047 నాటి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా నిర్మించటం విజన్ డాక్యుమెంట్ లక్ష్యం కనుక, మనం వ్యవసా యరంగంలో అగ్రభాగాన ఉన్నాం కనుక వ్యవసా యోత్పత్తులు, అనుబంధ రంగాలను బలోపేతం చేసుకుం టూ పోతే, ఆర్థికంగా ఎదగడానికి దోహదపడగలదు. దీనికోసం ప్రధానంగా సేవలు, పారిశ్రామిక రంగంపై దృష్టి కేంద్రీకరించాలి. మద్దతుగా వ్యవసాయ రంగాన్ని ఆధునీకరించాలి. గ్రామాన్ని యూనిట్‌గా తీసుకుని అభివృద్ధికి దోహదపడేలా చేయాలి. అప్పుడే తెలంగాన కల సాకారం కాగలదు. గతంలో లాగా చెట్టుపేరు చెప్పి కాయలు అమ్ముకునే దుస్థితి రాకుండా చూసుకోవాలి. వ్యవసాయ పంటల కొనుగోళ్లను సజావుగా సాగేలా చూడాలి. పంటల విధానంలో మార్పులు రావాలి. ఇవన్నీ జరిగితేనే అనుకున్న అభివృద్ధి సాధ్యం కాగలదు.

# సరిహద్దులు దాటిన సిద్ధాంతం
# సామాన్యుడికి దక్కిన అధికారం

## కేరళ రాజకీయ ప్రస్థానం : సామాజిక విప్లవం నుండి ఆధునిక అభివృద్ధి నమూనా వరకు
## ఎడమపక్ష కోట - ప్రజాస్వామ్య బాట : కేరళ రాజకీయ ప్రస్థానంపై ప్రత్యేక విశ్లేషణ



రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494

1957 సంవత్సరంలో భారత ప్రజాస్వామ్య చరిత్రలో ఒక విశిష్ట ఘట్టం ఆవిష్కృతమైంది. స్వాతంత్ర్యం అనంతరం తొలి దశలోనే దేశ రాజకీయాల్లో ప్రధానంగా జాతీయ కాంగ్రెస్ ఆధిపత్యం కొనసాగుతున్న సమయం లో, ప్రజాస్వామ్య పద్ధతిలోనే ఒక కమ్యూనిస్టు పార్టీ అధికారంలోకి రావడం ప్రపంచ దృష్టిని ఆకర్షించింది. ఆ చారిత్రక సంఘటన కేరళ రాష్ట్రంలో చోటుచేసుకుంది. భారత కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో జరిగిన ఈ రాజకీయ విప్లవానికి నాయకత్వం వహించినవారు ఇఎంఎస్ నంబూద్రిపాద్. ప్రజల ఓట్లతో అధికారంలోకి వచ్చిన ప్రపంచంలోనే తొలి కమ్యూనిస్టు ప్రభుత్వం ఇదేనని చరిత్రకారులు గుర్తిస్తారు.

ఇది కేవలం ఒక పార్టీ విజయం మాత్రమే కాదు, శతాబ్దాల తరబడి పేరుకుపోయిన సామాజిక అసమానతలపై సామాన్యుడు సాధించిన సంచలనాత్మక విజయం... భారతదేశ రాజకీయ పటంలో కేరళ రాష్ట్టానిది ఒక ప్రత్యేకమైన గుర్తింపు. వైవిధ్య భరితమైన భౌగోళిక పరిస్థితులు, అత్యధిక అక్షరాస్యత, విలక్షణమైన సామాజిక చైతన్యం కేరళను దేశం లోని ఇతర రాష్ట్రాల కంటే భిన్నంగా నిలబెట్టాయి.

1950వ దశకంలో కేరళ సామాజిక చిత్రం అత్యంత క్లిష్టంగా ఉండేది. భూస్వామ్య వ్యవస్థ వేళ్లూనుకుని ఉండటం వల్ల సామాన్య రైతాంగం తీవ్ర దోపిడీకి గురయ్యేది. కుల వివక్ష పరాకాష్టకు చేరుకుని, అంటరానితనం వంటి సామాజిక రుగ్మతలు సమాజాన్ని పీడిస్తున్న నేపథ్యంలో, అణగారిన వర్గాల్లో అసంతృప్తి జ్వాలలు ఎగిసిపడ్డాయి. ఈ తరుణంలో కమ్యూనిస్టు సిద్ధాంతాలు శ్రామిక వర్గాల్లో ఆశలు రేకెత్తించాయి. ఎలమకుళం మనక్కల్ శంకరన్ నంబూద్రిపాద్ (ఇఎం ఎస్ నంబూద్రిపాద్) వంటి మేధావి నాయకత్వంలో కమ్యూనిస్టు పార్టీ క్షేత్రస్థాయిలో ప్రజలను సమీకరించింది. దీని ఫలితంగానే 1957లో జరిగిన తొలి శాసనసభ ఎన్నికల్లో కమ్యూనిస్టు పార్టీ 126 స్థానాల్లో 60 స్థానాలను కైవసం చేసుకుని, స్వతంత్ర అభ్యర్థుల మద్దతుతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. తద్వారా ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రపంచపు మొట్టమొదటి కమ్యూనిస్టు ప్రభుత్వంగా ఇది చరిత్ర పుటల్లోకెక్కింది.

ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నంబూద్రిపాద్ అద్భుతమైన సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. ప్రధానంగా భూసంస్కరణల చట్టం ద్వారా భూస్వాముల గుప్పిట్లో ఉన్న వేల ఎకరాల భూమిని సాగు చేసుకుంటున్న కౌలు రైతులకు, భూమి లేని పేదలకు పంపిణీ చేసేలా చర్యలు తీసుకున్నారు. ఇది గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో పెనుమార్పులకు దారితీసింది. అదేవిధంగా, విద్యా రంగంలో ప్రైవేట్ యాజమాన్యాల గుత్తాధిపత్యాన్ని తగ్గించి, ప్రభుత్వ నియంత్రణను పెంచుతూ విద్యా సంస్కరణల బిల్లును ప్రవేశపెట్టారు. అయితే, ఈ విప్లవాత్మక మార్పులు సమాజంలోని పెత్తందారీ వర్గాలను, మతపరమైన సంస్థలను కలవరపెట్టాయి. చర్చిలు, నాయర్ సర్వీస్ సొసైటీ వంటి సంస్థలు ఏకమై ప్రభుత్వంపై 'విమోచన సమరం' (Liberation Struggle) పేరుతో ఆందోళనలు చేపట్టాయి. ఈ అశాంతిని సాకుగా చూపుతూ 1959లో అప్పటి కేంద్ర ప్రభుత్వం వివాదాస్పదమైన ఆర్టికల్ 356ను ప్రయోగించి, నంబూద్రిపాద్ ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేసింది. ఇది భారత ఫెడరల్ వ్యవస్థలో ఒక చేదు జ్ఞాపకంగా మిగిలిపోయిన ప్పటికీ, ఆ ప్రభుత్వం వేసిన అభివృద్ధి పునాదులు మాత్రం చెక్కుచెదర లేదు. 1960వ దశకంలో కమ్యూనిస్టు పార్టీలో సంభవించిన చీలిక ఫలితంగా భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్ట్) ఆవిర్భవించింది. ఆ తర్వాతి కాలంలో కేరళ రాజకీయాలు రెండు ప్రధాన ధ్రువాల చుట్టూ తిరగడం ప్రారంభమైంది. ఒకటి సిపిఐ(ఎం) నాయకత్వంలోని లెఫ్ట్ డెమోక్రాటిక్ ఫ్రంట్ (ఎల్‌డిఎఫ్), రెండోది కాంగ్రెస్ నాయకత్వం లోని యునైటెడ్ డెమోక్రాటిక్ ఫ్రంట్ (యుడిఎఫ్). ఈ రెండు కూట ముల మధ్య జరిగిన పోరు కేరళ ఓటర్లలో అద్భుతమైన చైతన్యాన్ని నింపింది. 1980 నుండి 2016 వరకు కేరళ ఓటర్లు ఒక విలక్షణ మైన తీర్పును ఇస్తూ వచ్చారు. ప్రతి ఐదేళ్లకు ఒకసారి ప్రభుత్వాన్ని మార్చడం అక్కడ ఒక అనవాయితీగా మారింది. ఒకసారి ఎల్.డి.ఎఫ్ గెలిస్తే, మరుసటి ఎన్నికల్లో యుడిఎఫ్ గెలవడం ద్వారా ఏ పార్టీ కూడా అధికార మదంతో విర్రవీగకుండా ప్రజలు అదుపు చేస్తూ వచ్చారు. ఈ మార్పు కేవలం రాజకీయ మార్పు మాత్రమే కాదు, పాలనలో జవాబుదారీతనం కోరే ప్రజల ఆకాంక్షకు ప్రతీక.

ఈ సంప్రదాయాన్ని 2021 ఎన్నికలు సమూలంగా మార్చివేశాయి. 2016లో అధికారంలోకి వచ్చిన పినరయి విజయన్ ప్రభుత్వం, తన ఐదేళ్ల పాలనలో ఎదుర్కొన్న సవాళ్లను సమర్థవం తంగా తిప్పికొట్టింది. వరుసగా సంభవించిన ప్రళయకాల వరదలు, నిపా వైరస్ విజృంభణ, ఆపై కోవిడ్-19 మహమ్మారి వంటి విపత్కర పరిస్థితుల్లో ప్రభుత్వం ప్రదర్శించిన చొరవ ప్రజల మనసు గెలుచుకుంది. ముఖ్యంగా 'కేరళ మోడల్' అభివృద్ధిలో భాగంగా ప్రజారోగ్య వ్యవస్థను బలోపేతం చేయడం, సంక్షేమ పింఛన్లను ఇంటికే చేరవేయడం, ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్థాయిలో ఆధునీకరించడం వంటి చర్యలు పినరయి విజయన్ కు భారీ ప్రజాదరణను తెచ్చిపెట్టాయి. ఫలితంగా 2021 ఎన్నికల్లో 140 స్థానాలకు గాను 99 స్థానాలు గెలుచుకుని, నాలుగు దశాబ్దాల 'ప్రత్యామ్నాయ పాలన' రికార్డును తిరగరాస్తూ వరుసగా రెండోసారి వాణిజ్యీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది.

ప్రస్తుత కేరళ రాజకీయాల్లో ఎల్‌డిఎఫ్, యుడిఎఫ్‌ల మధ్య ప్రధాన పోటీ కొనసాగుతున్నప్పటికీ, భారతీయ జనతా పార్టీ (బీజేపీ) తన ఉనికిని చాటుకోవడానికి తీవ్రంగా శ్రమిస్తోంది. శబరిమల వివాదంవంటి అంశాలను ఆధారం చేసుకుని హిందూ ఓటు బ్యాం కును ఆకట్టుకోవాలని చూస్తున్నప్పటికీ, కేరళలో ఉన్న బలమైన లౌకిక వాదం మరియు సామాజిక చైతన్యం వల్ల బీజేపీ ఇప్పటికీ అక్కడ మూడవ స్థానానికే పరిమితమవుతోంది. అయితే ఆ పార్టీ ఓట్ల శాతం క్రమంగా పెరుగుతుండటం భవిష్యత్తులో త్రిముఖ పోటీకి దారితీసే సూచనలు



కనిపిస్తున్నాయి.

కేరళ సాధించిన విజయాల వెనుక 'అధికార వికేంద్రీకరణ' అతిముఖ్యమైన పాత్ర పోషించింది. 1996లో ప్రవేశపెట్టిన 'పీపుల్స్ ప్లానింగ్ క్యాంపెయిన్' ద్వారా అభివృద్ధి నిధులను నేరుగా స్థానిక సంస్థలకు (పంచాయితీలకు) బదిలీ చేయడం వల్ల గ్రామీణ స్థాయిలోనే సమస్యలు పరిష్కారమయ్యే సంస్కృతి ఏర్పడింది. నేడు కేరళ మానవాభివృద్ధి సూచికలో (హెడిఐ) నార్వే, స్వీడన్ వంటి అభివృద్ధి చెందిన దేశాలతో పోటీ పడుతోంది. నూటికి నూరు శాతం అక్షరాస్యత, తక్కువ శిశు మరణాల రేటు, మెరుగైన లింగ నిష్పత్తి కేరళను దేశానికే మార్గదర్శిగా నిలిపాయి. అయితే, ఈ ప్రగతి పథంలో సవాళ్లు కూడా లేకపోలేదు. కేరళ ఆర్థిక వ్యవస్థ ప్రధానంగా విదేశీ వలసదారుల (ముఖ్యంగా గల్ఫ్ దేశాల నుండి) ఆదాయంపై ఆధారపడి ఉంది. మారుతున్న అంతర్జాతీయ పరిస్థితుల దృష్ట్యా వలసలు తగ్గితే తలెత్తే ఆర్థిక ఇబ్బందులు, పెరుగుతున్న నిరుద్యోగిత, మరియు రాష్ట్రం ఎదుర్కొంటున్న భారీ అప్పుల భారం ఆందోళన కలిగిస్తున్నాయి. పారిశ్రామికీకరణ ఆశించిన స్థాయిలో లేకపోవడం వల్ల విద్యావంతులైన యువత ఉపాధి కోసం ఇతర రాష్ట్రాలకు లేదా దేశాలకు వలస పోవాల్సి వస్తోంది. అలాగే పర్యావరణపరంగా సున్నితమైన పశ్చిమ కనుమల రక్షణ మరియు తరచూ సంభవిస్తున్న ప్రకృతి వైపరీత్యాలు పాలనలో పెను సవాళ్లుగా మారాయి.

ముగింపుగా చెప్పాలంటే, 1957లో నంబూద్రిపాద్ వేసిన సామాజిక న్యాయ బీజం నేడు మహావృక్షమై కేరళకు రక్షణ కవచంలా నిలిచింది. కమ్యూనిస్టు భావజాలం మరియు ప్రజాస్వామ్య విలువలు సమ్మిళితమై సామాన్య మానవుడి జీవితంలో మార్పును ఎలా తీసుకురావచ్చో కేరళ నిరూపించింది. రాజకీయం అంటే కేవలం అధికార మార్పిడి మాత్రమే కాదు, అది సామాజిక పరివర్తనకు ఒక సాధనం అని కేరళ చరిత్ర చాటి చెబుతోంది. భవిష్యత్తులో ఎదురయ్యే ఆర్థిక, ఉపాధి సవాళ్లను ఈ రాష్ట్రం ఎలా అధిగమి స్తుందో చూడాలి గానీ, భారత ప్రజాస్వామ్య ప్రయోగశాలలో కేరళ ఎప్పటికీ ఒక ప్రకాశవంతమైన నక్షత్రంలానే ఉంటుంది. ప్రజల అవసరాలకు అనుగుణంగా స్పందించే పాలన, పౌర చైతన్యం ఉన్నంత కాలం కేరళ తన విశిష్టతను కాపాడుకుంటూనే ఉంటుంది.

వ్యాసకర్త : సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్

# విశ్వాసానికి ప్రతీక ఈస్టర్ పండుగ



ఆళవందార్ వేణు మాధవ్

ఈస్టర్ పండుగ క్రైస్తవ మతంలో అత్యంత ప్రాముఖ్యత కలిగిన పవిత్ర పండుగ. ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది క్రైస్తవులు ఈ పండు గను భక్తి శ్రద్ధలతో, ఆనందంతో జరుపు కుంటారు. యేసు క్రీస్తు సిలువవేయబడి మరణించిన మూడు రోజుల తరు వాత తిరిగి పునరుత్థానం చెందిన రోజును ఈస్టర్‌గా జరుపు కుంటారు. ఈ పండుగ జీవితం,ఆశ, ప్రేమ, క్షమ, మరి యు నూతన ఆరంభానికి ప్రతీకగా భావించబడుతుంది. ఈస్టర్ పండు గకు ముందు జరిగే సంఘటనలు కూడా ఎంతో ముఖ్యమైనవి. ఈస్టర్‌కు ముందు వచ్చే 40 రోజుల కాలాన్ని "లెంట్" అంటారు. ఈ కాలంలో క్రైస్తవులు ఉపవాసం పాటిస్తూ, ప్రార్థనలు చేస్తూ, తమ పాపాలకు పశ్చాత్తాపం వ్యక్తం చేస్తారు. ఇది ఆత్మపరిశీలనకు, ఆధ్యాత్మిక శుద్ధికి సమయం. లెంట్ అనంతరం వచ్చే ముఖ్యమైన రోజు "పామ్ సండే"(మట్టల పండుగ) ఈ రోజున యేసు క్రీస్తు యెరూష లేములో ప్రవేశించిన సందర్భాన్ని స్మరించుకుంటారు. ప్రజలు తాటి ఆకులతో ఆయనను స్వాగతించారు. ఆ తరువాత "మాండీ థర్స్" రోజు యేసు తన శిష్యులతో చివరి విందు(లాస్ట్ సప్పర్) చేసిన రోజుగా భావిస్తారు. ఈ సందర్భంలో ఆయన తన శిష్యులకు ప్రేమ,సేవ అనే విలువలను బోధించాడు. తరువాత వచ్చే "గుడ్ ఫ్రైడే" ఎంతో విషాదకరమైన రోజు. ఈ రోజున యేసు క్రీస్తును సిలువపై వేయడం జరిగింది. ఆయన మానవుల పాపాలను క్షమించేందుకు తన ప్రాణాలను త్యాగం చేశాడని క్రైస్తవులు నమ్ముతారు. ఈ రోజు చర్చిల్లో ప్రార్థనలు,ఉపన్యాసాలు నిర్వహిస్తూ ఆయన త్యాగాన్ని స్మరించుకుంటారు. గుడ్ ఫ్రైడే తరువాత వచ్చే ఆదివారం రోజునే ఈస్టర్ పండుగ జరుపుకుంటారు. ఈ రోజున యేసు తిరిగి జీవించాడనే విశ్వాసంతో భక్తులు ఆనందంగా పండుగను జరుపుకుంటారు. చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు,గీతాలు,బైబిల్ వచనాల పఠనం జరుగుతుంది. భక్తులు తెల్లవారుజామునే చర్చికి వెళ్లి యేసు పునరుత్థానాన్ని స్మరించుకుంటారు. ఈస్టర్ పండుగలో "ఈస్టర్ గుడ్లు"కి ప్రత్యేక ప్రాముఖ్యత ఉంది. గుడ్లు కొత్త జీవానికి ప్రతీక. అందుకే రంగురంగుల గుడ్లను అలంకరించడం,పిల్లలు వాటిని వెతికే ఆటలు



ఆడడం వంటి సంప్రదాయాలు ఉన్నాయి. అలాగే "ఈస్టర్ బన్నీ"అనే సంకేతం కూడా కొన్ని దేశాల్లో ప్రసిద్ధి చెందింది. ఇది ఆనందం, సమృద్ధికి సూచికగా భావిస్తారు. ఈస్టర్ పండుగ మనకు గొప్ప జీవన పాఠా లను నేర్పుతుంది. కష్టాలు వచ్చినప్పుడు నిరుత్సాహ పడకుండా, విశ్వాసంతో ముందుకు సాగాలని ఇది సూచిస్తుంది. యేసు తన జీవితంలో చూపిన ప్రేమ, క్షమ, దయ,సేవ వంటి విలువలను మన జీవితంలో పాటించాలని మనకు గుర్తుచేస్తుంది. ఇతరుల పట్ల సహానుభూతి, సహకారం చూపించడం ఈ పండుగ ముఖ్య సందేశం. భారతదేశంలో కూడా ఈస్టర్ పండుగను ఎంతో ఘనంగా జరుపుకుంటారు. గోవా, కేరళ, తమిళనాడు,ఆంధ్రప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో చర్చిల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తారు. కుటుంబ సభ్యులు,బంధువులు కలిసి ప్రార్థనలు చేసిప్రత్యేక వంటకాలు తయారు చేసుకొని పండుగను ఆనందంగా జరుపుకుంటారు. ఈస్టర్ పండుగ అనేది కేవలం ఒక మతపరమైన పండుగ మాత్రమే కాదు, అది మనుషుల జీవితానికి ఆశను,ధైర్యాన్ని,ప్రేమను అందించే ఒక గొప్ప సందేశం. జీవితంలో ఎంతటి కష్టాలు వచ్చినా,వాటిని జయించి మళ్లీ కొత్తగా ప్రారంభించవచ్చని ఈస్టర్ మనకు ప్రేరణ ఇస్తుంది. అందుకే ఈ పండుగను ప్రపంచవ్యాప్తంగా ఎంతో గౌరవం గా, ఆనందంగా జరుపుకుంటారు.

(ఏప్రిల్ 5న ఈస్టర్ పండుగ సందర్భంగా)

# ఆందోళన కలిగిస్తున్న గ్యాస్ కొరత

**- సంక్షోభంతో హోటల్ పరిశ్రమ కుదేలు**
**- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)





పల్నాడు, ఏప్రిల్ 4 : దేశవ్యాప్తంగా గ్యాస్, ఆయిల్ రంగాలలో ఏర్పడిన సంక్షోభం సాధారణ ప్రజలపై భారంగా మారిందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు పేర్కొన్నారు. గ్యాస్ ధరలు విపరీతంగా పెరిగి, రాష్ట్రంలో బ్లాక్ మార్కెటింగ్ విస్తరించిం దని, చిన్న హోటళ్లు, టిఫిన్ సెంటర్లు, వీధి వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని విమర్శించారు. పల్నాడు జిల్లా కేంద్ర మైన నరసరావుపేట లోని సీపీఎం జిల్లా కార్యాలయంలో నిర్వహిం చిన విలేకరుల సమావేశంలో శ్రీనివాసరావు గ్యాస్ సంక్షోభంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. జీవనోపాధి కోల్పో యిన యువకులు, కార్మికులు రోడ్డున పడే పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. అధికారులు మార్కెట్లో గ్యాస్ అందుబాటులో ఉందని చెబుతున్నా, వాస్తవానికి అది సామాన్య ప్రజలకు అందడం లేదని విమర్శిం చారు. కృష్ణా-గోదావరి బేసిన్‌లో పుష్కలంగా గ్యాస్ వనరులు ఉన్నప్పటికీ, ప్రైవేట్ కంపెనీలు రోజుకు సుమారు 21 వేల టన్నుల గ్యాస్‌ను తవ్వి ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నాయని, రాష్ట్రానికి మాత్రం సరిపడా సరఫరా జరగడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర అవసరం రోజుకు కేవలం 4 వేల టన్నులే అయినప్పటికీ, ఆ అవసరాన్ని కూడా తీర్చకపోవడం అన్యాయమని అన్నారు. దీనివల్ల విదేశాల నుంచి అధిక ధరలకు గ్యాస్ దిగుమతి చేసుకో వాల్సి వస్తోందని, ఆ భారాన్ని వినియోగదారులపై మోపుతున్నారని పేర్కొన్నారు. కృష్ణా-గోదావరి బేసిన్ గ్యాస్‌ను స్థానికంగా పైప్‌లైన్‌ల ద్వారా పీఎన్‌జీగా సరఫరా చేస్తే, గృహాలకు తక్కువ ధరకే గ్యాస్ అందుబాటులోకి వస్తుందని, ఇది సామాన్య ప్రజలకు, చిన్న వ్యాపారులకు పెద్ద ఊరట కలిగిస్తుందని వివరించారు. నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని అసెంబ్లీలో తీర్మానం ఆమోదించి, రాష్ట్రానికి న్యాయమైన గ్యాస్ వాటాను సాధించేందుకు కేంద్రంపై ఒత్తిడి తేవాలని డిమాండ్ చేశారు. మా గ్యాస్-మా హక్కు' నినాదంతో వామపక్ష పార్టీలు, ప్రజా సంఘాలతో కలిసి రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని ప్రారంభించనున్నట్లు ప్రకటించారు. మొదటిగా రాజమండ్రిలో భారీ ప్రజాసభ నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం స్పందించకపోతే ప్రజా మద్దతుతో ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

# పారదర్శకంగా లబ్ధిదారులను ఎంపిక చేయాలి

## - అర్హులైన దళితులకు సబ్సిడీ రుణాలు అందించాలి
## - జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కరీంనగర్, ఏప్రిల్ 04 : నిరుద్యోగ దళితులకు సబ్సిడీ రుణాలను పారదర్శకంగా అందించాలనీ, పకడ్బందీగా లబ్ధిదారులను ఎంపిక చేయాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు. శనివారం సాయంత్రం కలెక్టర్ ఛాంబర్ లో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన 2025-26 ఆర్థిక సంవత్సరం ఎస్సీ యాక్షన్ ప్లాన్ అమలుకు జిల్లా స్థాయి కమిటీ ఆమోదం తెలిపింది. సబ్సిడీ రుణాల పంపిణీ లబ్ధిదారుల ఎంపిక అంశాలపై అధికారులతో కలెక్టర్ చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా మాట్లాడుతూ అధికారులు సబ్సిడీ రుణాలను అర్హులైన దళితులకు పారదర్శకంగా అందించాలన్నారు. ఇవి 90 శాతం సబ్సిడీ తో 169 టూ వీలర్స్ వాహనాలు, 70 శాతం సబ్సిడీతో 83 త్రీ వీలర్స్ వాహనాలు, 100 శాతం సబ్సిడీతో 18 సోలార్ పంపు కంట్రోల్ యూనిట్స్ జిల్లాకు కేటాయించారని పేర్కొన్నారు. ఈనెల 8వ తేదీలోపు నిరుద్యోగ దళితులు ఆన్ లైన్ లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసుకున్న ధ్రువపత్రాలను ఎంపీడీవో కార్యాలయాలు, మున్సిపల్ కార్యాలయాల్లో అందించాలని పేర్కొన్నారు. దళితుల ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వం సబ్సిడీ రుణాలను అందిస్తున్నదనీ, ఈ అవకాశాన్ని దళితులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. అన్ని విధాలుగా అర్హులైన లబ్ధిదారులను పారదర్శకంగా ఎంపిక చేయాలని, పకడ్బందీగా సబ్సిడీ రుణాలను అందించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఎస్సీ కార్పొరేషన్ ఇంచార్జి ఈడీ తిరుపతిరావు, పరిశ్రమల శాఖ జిఎం సాల్మన్ రాజు, డిటిఓ శ్రీకాంత్ చక్రవర్తి, లీడ్ బ్యాంకు మేనేజర్ రవీందర్, పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ వినోద్, టీజీ రెడ్కో, వ్యవసాయ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియను సమర్థవంతంగా, పారదర్శకంగా నిర్వహించాలి

## - రాష్ట్ర ఎలక్టోరల్ అధికారి సీ. సుదర్శన్ రెడ్డి
## - వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మహబూబాబాద్ టౌన్, ఏప్రిల్ 04 : తెలంగాణలో ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై రాష్ట్ర ఎలక్టోరల్ అధికారి సీ. సుదర్శన్ రెడ్డి ఇతర ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ సమావేశం ద్వారా శనివారం సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ ఈ సమావేశానికి హాజరయ్యారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ఎలక్టోరల్ అధికారి మాట్లాడుతూ.. ఎస్ఐఆర్ ప్రక్రియను సమర్థవంతంగా, పారదర్శకంగా నిర్వహించాలన్నారు. రాజకీయ పార్టీల ద్వారా పోలింగ్ బూత్ స్థాయి ఏజెంట్లను ఖచ్చితంగా నియమించుకోవాలని అదేశించారు. బీఎల్ఏలకు కూడా అవసరమైన శిక్షణ ఇవ్వాలన్నారు. అలాగే సూపర్వైజర్ లకు కూడా వారి పరిధిలో స్థానికంగా తెలిసి ఉండాలని, ఈ ఎస్ఐఆర్ పై అవగాహన కలిగి ఉండాలని, బీఎల్ఓలకు ఏ సందేహం ఉన్నా కూడా నివృత్తి చేయాలని సూచించారు. బీఎల్ఓలు స్థానిక నివాసి అయి ఉండాలన్నారు. ఆ ఏరియా పట్ల పూర్తి అవగాహనతో ఉండాలని, అప్పుడే సులభంగా ఓటర్ల ఇళ్లను గుర్తించి సమాచారాన్ని సేకరించవచ్చన్నారు.



డేటా సురక్షతపై ప్రత్యేక దృష్టి సారించాలని, బీఎల్ఓలు యాప్ వినియోగంలో జాగ్రత్తలు పాటించాలని, యాప్ ఉపయోగం గురించి తెలిసి ఉండాలని, పాస్వర్డ్ ఎవరితోనూ పంచుకోకూడదన్నారు. పోలింగ్ కేంద్రాల మ్యాపింగ్ పనులను వేగంగా పూర్తి చేయాలని సూచించారు. ప్రతి రోజు పురోగతి నివేదికను తప్పనిసరిగా సమర్పించాలని ఆదేశించారు. ప్రధానంగా ఫీల్డ్ స్థాయిలో ఎదురయ్యే సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు ఏఈఆర్ఓ, ఈఆర్ఓ స్థాయిలో ఐటీ హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయాలని తెలిపారు. రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమన్వయం చేస్తూ అవసరమైన సమాచారాన్ని (ఎస్ఐఆర్-మెటీరియల్) అందించి, అందులోని అంశాలను వారికి తెలియజేయాలని సూచించారు. వీసీ అనంతరం సంబంధిత అధికారులకు జిల్లా స్నేహ శబరీష్ పలు సూచనలు చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ సమావేశంలో మహబూబాబాద్, తొర్రూరు, రెవెన్యూ డివిజనల్ అధికారులు, క్రిష్ణవేణి, గణేష్, సంబంధిత తహసిల్దార్లు, కలెక్టరేట్ పరిపాలన అధికారి పవన్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# యునైటెడ్ క్రిస్టియన్ ఫోరం ఆధ్వర్యంలో ఘనంగా రన్ ఫర్ జీసస్...




(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

సంగారెడ్డి, ఏప్రిల్ 04 : సంగారెడ్డి జిల్లా కేంద్రంలో యునైటెడ్ క్రిస్టియన్ మరియు యూత్ ఫోరం ఆధ్వర్యంలో పాత బస్టాండ్ అంబేద్కర్ విగ్రహం నుండి కొత్త బస్టాండ్ నుండి పోతిరెడ్డిపల్లి చౌరస్తా మీదుగా సీఎస్ఐ చర్చి వరకు యువకుల ఆటపాటలతో మహిళల నృత్యాలతో ఉత్సాహంగా నిర్వహించారు.. రన్ ఫర్ జీసస్ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా టిజిఐఐసి చైర్మన్ నిర్మలజగ్గారెడ్డి టిపిసిసి జనరల్ సెక్రటరీతో పాజి అనంతకిషన్ మున్సిపల్ చైర్మన్ కూన వనితసంతోష్ పాల్గొన్నారు..

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముందుగా అందరికి ఈస్టర్ పర్వదిన శుభాకాంక్షలు తెలుపుతూ.. రెండు వేల సంవత్సరాల క్రితం మానవుల యొక్క పాప పరిహార్థ బలిగా కలువరి సిలువలో మరణించిన యేసు ప్రభువుల వారు తిరిగి మూడు దినముల తర్వాత ఆయన తిరిగి లేచిన పండుగను ఈస్టర్ పండుగగా క్రైస్తవులు ఆ చ రి స్తా ర ని తెలిపారు. ఘనంగా జరిగిన రన్ ఫర్ జీసస్ కార్యక్రమంలో

యుసిఎఫ్-యుసివైఎఫ్ అధ్యక్షులు రూబీన్ రెడ్డి, ప్రవీణ్ కుమార్, ఉపాధ్యక్షులు మధు, వినయ్ రాజ్ ప్రధాన కార్యదర్శులు సునీల్ జయకుమార్, సాలొమోన్, సునీల్ నిర్మల్, అబ్రహం సభ్యులు శశికాంత్, రాజు, ప్రభాకర్, శివకుమార్, రవి, వినయ్, ప్రకాష్ రెడ్డి, ఫణిందర్ మరియు నియోజకవర్గ అన్ని చర్చిల ఫాస్టర్లు పట్టణ ప్రముఖులు క్రైస్తవ సోదరులు మహిళలు యువకులు చిన్నారులు పాల్గొన్నారు...


# గంజాయి సాగు చేస్తే రైతు పథకాలు అన్ని రద్దు

## - డ్రగ్స్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలి
## - విద్యాసంస్థలలో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలి
## - మాదక ద్రవ్యాల నియంత్రణకు సమన్వయంతో పనిచేయాలి
## - జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మహబూబాబాద్ టౌన్, ఏప్రిల్ 04 : మాదక ద్రవ్యాల నియంత్రణకు క్షేత్రస్థాయిలో అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని, కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు.

శనివారం కలెక్టరేట్లో సంబంధిత అధికారుల తో కలిసి జిల్లాస్థాయి నార్కో సమన్వయ సమావేశం నిర్వహించారు. జిల్లాలో నమోదవుతున్న ఎన్డీపీఎస్ కేసులు, గంజాయి సాగు నివారణ చర్య లు, మాదకద్రవ్యాల వాడకం నియంత్రణ చర్యలు, మాదకద్రవ్యాల నివారణ కోసం శాఖల వారీగా చేపట్టాల్సిన పనులు, డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే నష్టాలు చేయాల్సిన కార్యక్రమాలపై చర్చించారు. మాదక ద్రవ్యాల నిర్మూలన వాల్పోస్టర్లు, హ్యాండ్బుక్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎక్కడైనా గంజాయి సాగు జరుగుతుందో పరిశీలించి చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాలలు ముగిసిన సందర్భంలో పరిసరాల్లో ఉన్న పాన్షాప్ వంటి వాటిపై నిఘా పెట్టాలని అన్నారు. జిల్లాలో ఎక్కడా బహిరంగంగా మద్యం సేవించకుండా చూడాలన్నారు. ప్రతి మండలంలో తహసీల్దార్, ఎంపీడీవో, పోలీస్, మండల వ్యవసాయ అధికారి, వైద్యాధికారులు పంచాయతీ కార్యదర్శు లతో సమావేశం నిర్వహించి డ్రగ్స్ నియంత్రణ ప్రణాళిక రూపొందించాలన్నారు. జిల్లాలో ఉన్న సినిమా థియేటర్ల పరిసరాలను రాత్రి సమ యాల్లో తనిఖీలు చేయాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలో ఉన్న బార్ లు, వైన్షాప్లు, ప్రభుత్వ నిర్దేశిత సమయపాలన పాటించేలా చూడా లన్నారు. బార్ నిర్వహాకులతో వాట్సాప్ గ్రూప్ తయారుచేసి ప్రతిరోజు ఎప్పుడు మూసివేస్తున్నారో సమాచారం అందించాలన్నారు. డ్రగ్స్ ని యంత్రణపై విస్తృతంగా ప్రచారం కల్పించాలని డ్రగ్స్, గంజాయి వల్ల కలిగే నష్టాలను వివరించే వీడియోలు, పోస్టర్లు ప్రదర్శించాలని, అవగాహన కల్పించాలన్నారు. డ్రగ్స్ పరీక్షల నిర్వహణకు అవసరమైన యూరిన్ కిట్లను పోలీస్లు, ఎక్సైజ్ శాఖ అధికారుల వద్ద అందుబా టులో ఉంచాలని డీఎంహెచ్వోకు సూచించారు. రైస్మిల్లులు, ఇటుక బట్టీల వద్ద కార్మిక అధికారి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. జిల్లావ్యాప్తంగా ఉన్న ఎస్సీ , ఎస్టి బీసీ మైనార్టీ, సంక్షేమ వసతి గృహాలు పాఠశాలలలో ప్రత్యేక నిఘా పెట్టి అవగాహన ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని, జూనియర్ కళాశాలలో విద్యార్థుల యొక్క మానసిక ఆరోగ్య స్థితిగతులను గమనిస్తూ ఉండాలని, జిల్లాలోని రైతులు రహస్యంగా ఏమైనా గంజాయిని సాగు చేస్తే వారికి లభించే రైతు భరోసా, రైతుబంధు, రైతు బీమా తదితర పథకాలను రద్దు చేస్తామని హెచ్చరించారు. మాదకద్రవ్యాల నిరోధక విభాగం జిల్లాలో పూర్తిస్థాయిలో పనిచేయాలని అందుకు సంబంధిత శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. డిఅడిక్షన్ సెంటర్ ఏర్పాటు కోసం స్థలం పరిశీలన సేకరణ చేయాలని సూచించారు. జిల్లాలోని అన్ని మండలాలు గ్రామాలలో ఉన్నటువంటి మెడికల్ షాపులలో తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో రెవెన్యూ డివిజన్ అధికారులు మహబూబాబాద్, తొర్రూరు కృష్ణవేణి, జడ్పీ సీఈవో పురుషోత్తం, గణేష్, డీఎస్పీ తిరుపతిరావు, ఎక్సైస్ సూపరింటెంట్ కిరణ్ కుమార్, డ్రగ్ ఇన్స్పెక్టర్ ఉమారాణి, వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రవి రాథోడ్, విద్యాశాఖ అధికారి రాజేశ్వర్, ఇంటర్మీడియట్ అధికారి మదర్, ట్రైబల్, ఎస్సీ, ఎస్టి బీసీ, మైనార్టీ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అధికారులు దేశీ రామ్ నాయక్, శ్రీనివాస్, శ్రీనివాస్ రావు, తదితరులు పాల్గొన్నారు.



# పాఠశాలలో విద్యా ప్రమాణాల పెంపుపై ప్రత్యేక దృష్టి

## - పదవ తరగతి విద్యార్థులు పునశ్చరణకు ప్రాధాన్యత ఇవ్వాలి
## - విద్యార్థులకు కలెక్టర్ విద్యా బోధన
## - జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జనగామ, ఏప్రిల్ 04 : పాఠశాలలో విద్యా ప్రమాణాల పెంపుపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. శనివారం, జిల్లాలోని లింగాల ఘనపురం మండలంలోని బండ్లగూడెం గ్రామ పంచాయతీ పరిధిలో గల కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సందర్శించి, ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో అందిస్తోన్న మౌలిక వసతులు, బోధన విధానం, ఉపాధ్యాయుల హాజరు, తదితర అంశాలపై సమగ్రంగా పరిశీలించారు. మధ్యాహ్న భోజన పథకం సక్రమంగా అమలు అవుతుందో.. లేదో.. పర్యవేక్షించారు. మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా? అని ఎస్ఓను అడిగి తెలుసుకున్నారు. అలాగే భోజన శాలను పరిశీలించి, ఆహారం నాణ్యత, వంటశాల పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. ప్రధానంగా గుడ్ల నాణ్యతను పరీక్షించి, వంట సామాగ్రి, సరుకులు, బియ్యం తదితరాలను తనిఖీ చేసి, గడువు తేదీలను సరిచూసుకోవాలన్నారు. పాఠశాల పరిసరాలు, తాగునీరు, మరుగుదొడ్లు, మూత్రశాలలు ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలన్నారు. అదే విధంగా ప్రతి తరగతి గదిని సందర్శించి, విద్యార్థులకు బోధన చేశారు. గణితంపై నిశితంగా విద్యార్థులకు అర్థమయ్యే విధంగా సులభ విధానాల ద్వారా కలెక్టర్ బోధించారు. అలాగే విద్యార్థులలో పాఠ్యాంశాలపై అవగాహన పెంచే విధంగా ఉపాధ్యాయులు బోధన చేయాలని సూచించారు. ముఖ్యంగా గణితం వంటి విషయాల్లో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, బోర్డు మీద ఉదాహరణలతో బోధించాలన్నారు. విద్యార్థులతో ప్రత్యక్షంగా కలెక్టర్ మాట్లాడి, పాఠ్యాంశాలను చదివించి, అందులోని ప్రశ్నలు అడుగుతూ, వారి బోధన సామర్థ్యాలను పరీక్షించారు. ఈ మేరకు చదువుపై ఆసక్తి పెంచుకునేలా ప్రోత్సహించారు. అంతేకాకుండా పదవ తరగతి విద్యార్థులతో మాట్లాడి, రాబోయే పరీక్షలపై ఇప్పటివరకు చదివిన పాఠాలను మళ్లీ మళ్లీ పునశ్చరణ చేయాలని సూచించారు. పరీక్షల సమయంలో సరైన ఆహారం తీసుకోవాలని, కంటినిండా నిద్ర పోవాలని, ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. పట్టుదలతో కష్టపడి చదివి ఉత్తమ మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించారు. ఈ పరిశీలనలో ఎస్ఓ అన్నపూర్ణ, ఉపాధ్యాయులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థిని వేధిస్తున్న ఉపాధ్యాయులు

## పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



ఆసిఫాబాద్, ఏప్రిల్ 4 : ఏదో ఒక వంకతో తమ కుమారుడిని వేధిస్తున్నారని కుటుంబ సభ్యులు శనివారం స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసిన సంఘటన చోటు చేసుకుంది. ఆసిఫాబాద్ మండలంలోని గోడవెల్లి శివారులో ఉన్న మహాత్మా జ్యోతిబాపూలే పాఠశాలలో ఆరవ తరగతి చదువుతున్న వాగ్మారే మోహిత్ను పాఠశాల ప్రిన్సిపాల్, పాఠ శాలలో పనిచేసే ఇద్దరు వ్యక్తులు అకారణంగా వేధిస్తున్నారని విద్యార్థి తండ్రి వాగ్మారే పుండలిక్ ఆరోపించారు. తాము ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవా లక్ష్మి సిఫారసుతో ఇందులో తమకు సీటు ఇచ్చారని, అప్పటినుండి తన బాబుపై కక్ష కట్టి, చదవడం లేదని ఇతరత్ర కారణాలను చూపిస్తూ మానసికంగా వేధింపులకు పాల్పడుతున్నారని ఆయన అన్నారు. సదరు పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయుల ప్రవర్తనతో తన బాబు భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారేలా ఉందని మానసికంగా వేధిస్తున్న సదరు సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

# ప్రజలకు మౌలిక వసతులతో కూడిన ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించడమే లక్ష్యం

## - బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్,

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



మేడ్చల్ మల్కాజిగిరి, ఏప్రిల్ 4 : జిహెచ్ఎంసి నిజాంపేట్ సర్కిల్ పరిధిలోని కాలనీలలో జరుగుతున్న అభివృద్ధి పనులపై మధురానగర్లో బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ కాలనీలో పాదయాత్ర నిర్వహించి స్థానిక సమస్యలు తెలుసుకొని సమస్యల పరిష్కారానికి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రోడ్ల నిర్మాణం - మరమ్మత్తులు, పారిశుద్ధ నిర్వాహణ, దోమల బెడద, వీధి దీపాల మరమ్మతులు, మంజీరా నీటి ప్రెజర్, స్మశాన వాటికల అభివృద్ధి, సీనియర్ సిటిజన్స్ డే కేర్ సెంటర్ల నిర్వహణ, వెజ్ ,నాన్ వెజ్ మార్కెట్ల ఏర్పాటు, చెరువుల సుందరీకరణ వంటి మౌలిక వసతుల కల్పనపై సమీప కాలనీల వాసులు వారి సమస్యలను విన్నవించారు. అనంతరం బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ మాట్లాడుతూ, ప్రజలకు మౌలిక వసతుల కల్పనతో పాటు ఆహ్లాదకరమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నాం. గత 12 ఏళ్ల కాలంలో కోట్లాది రూపాయల నిధులతో కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాలను అభివృద్ధి పరచామని, రానున్న రోజుల్లో కూడా మరింత అభివృద్ధి పరుస్తామన్నారు. గ్రామ పంచాయతీ నుంచి కార్పొరేషన్, నేడు జిహెచ్ఎంసి విలీనం వరకు నిజాంపేట్ కార్పొరేషన్ ఎంతో అభివృద్ధి చెందిందని పెరుగుతున్న జనాభా, పట్టణీకరణకు అనుగుణంగా మౌలిక వసతులను అభివృద్ధిపరిచి ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలవకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సర్కిల్ ఉప కమిషనర్ సాబేర్ అలీ, ఇంజనీరింగ్ ఏఈ ప్రవీణ్ కుమార్, ఎస్.డబ్ల్యూ.ఎం శరన్ తేజ, నిజాంపేట్ సర్కిల్ కు చెందిన వివిధ విభాగాల అధికారులు మరియు స్థానిక కాలనీల సంక్షేమ సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ నేతల ముందస్తు అరెస్ట్

## బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు భక్తుల వీరప్ప

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



టేక్మాల్ ఏప్రిల్ 04 : బిఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డిని సీఐడీ విచారణకు పిలిచిన నేపథ్యంలో, బీఆర్ఎస్ నేతలు రాష్ట్రవ్యాప్తంగా నిరసనలకు చేపట్టారు. ఈ క్రమంలో టేక్మాల్ మండలంలో పోలీసులు ముందస్తు అప్రమత్తమై బీఆర్ఎస్ నాయకులను శనివారం ఉదయం ముందస్తు అరెస్టులు చేయడం జరిగింది. హైదరాబాద్లోని సీఐడీ ఆఫీసు ముట్టడికి వెళ్లకుండా, అలాగే మండల కేంద్రంలో ధర్నాలు నిర్వహించకుండా పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. టేక్మాల్ పోలీసులు తెల్లవారుజామునే రంగంలోకి దిగి బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు భక్తుల వీరప్ప, బిఆర్ఎస్ జిల్లా యువత కార్యదర్శి నాయికోటి భాస్కర్ లను అదుపులోకి తీసుకున్నారు.

# ఈనెల 30 వరకు రేషన్ బియ్యం పంపిణీ

## జిల్లా సివిల్ సప్లై అధికారి నిత్యానంద్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



మెదక్, ఏప్రిల్ 04 : ఈనెల 30వ తేదీ వరకు ఏప్రిల్, మే, జూన్ నెలలకు సంబంధించిన రేషన్ బియ్యం పంపిణీ చేయాలని జిల్లా సివిల్ సప్లై అధికారి నిత్యానంద స్పష్టం చేశారు. మెదక్ జిల్లాలో మొత్తం 520 రేషన్ దుకాణాలు సమర్థవంతంగా పనిచేస్తున్నాయన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం అర్హులైన లబ్ధిదారులకు అవసరమైన (03) నెలల సన్న బియ్యం నిల్వలు రేషన్ సమృద్ధిగా ఉంచబడి, నిరంతరంగా సరఫరా చేయబడుతున్నాయనీ, ప్రతి లబ్ధిదారుడు ఎలాంటి తొందరపాటు లేకుండా సమీపంలోని రేషన్ దుకాణానికి వెళ్లి సరుకులు తీసుకోవాలని సూచించారు. సరుకుల కొరత లేదా పంపిణీ నిలిచిపోవడం వంటి ఎలాంటి సమస్యలులేన్నారు. జిల్లా పరిపాలన తరఫున సరఫరా వ్యవస్థను నిరంతరం పర్యవేక్షిస్తూ, ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామనీ, సంబంధిత అధికారులు సిబ్బంది అందరూ అప్రమత్తంగా పనిచేస్తూ, పారదర్శకంగా సకాలంలో సన్న బియ్యం సరఫరా జరిగేలా కృషి చేయాలని తెలిపారు. ప్రజలు ఎలాంటి వదంతులను నమ్మకుండా, గందరగోళానికి లోనుకాకుండా, ప్రశాంతంగా తమకు లభ్యమయ్యే (03) రేషన్ సరుకులను ఈ నెల 30వ తేది వరకు పొందాలని విజ్ఞప్తి చేశారు. ఏవైనా సమస్యలు ఎదురైన పక్షంలో సమీప తహసీల్దార్ కార్యాలయం లేదా సంబంధిత సివిల్ సప్లై అధికారులను సంప్రదించాలని వెల్లడించారు.



# సియస్పి లో నూతన వాటర్ ట్యాంకర్ ప్రారంభం

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

గోదావరిఖని టౌన్, ఏప్రిల్ 04 : సింగరేణి ఆర్జీ-1 జీడీకే సి.యస్.పి నుంచి ఓసి-5 బొగ్గు రవాణా మార్గంలో ధూళి సమస్యను అరికట్టేందుకు నూతనంగా కొనుగోలు చేసిన 12 కేఎల్డీ సామర్థ్యం కలిగిన వాటర్ ట్యాంకర్ను జీడీకే-1 గ్రూప్ ఏజెంట్ యల్.రమేష్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనాల రద్దీ ఎక్కువగా ఉండే ఈ ప్రాంతంలో రోజుకు మూడు షిఫ్ట్లలో నీటిని స్ప్రే చేయడం ద్వారా ధూళి కాలుష్యాన్ని తగ్గించనున్నట్లు తెలిపారు. దీనివల్ల కార్మికులకు ఆరోగ్య పరిరక్షణతో పాటు పర్యావరణానికి మేలు జరుగుతుందని, పని ప్రదేశం పరిశుభ్రంగా ఉంటుందని పేర్కొన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో ఏరియా ఇంజనీర్ రామమోహనరావు, జీడీకే 1 అండ్ 3 గని మేనేజర్ జక్కుల్వార్ సుధీర్, పర్యావరణ అధికారి వేణు, సియస్పి ఇంజనీర్ శ్రీనివాస్, ఫిట్ సెక్రటరీ బండి మల్లేశం తదితరులు పాల్గొన్నారు

# విద్యుత్ పనుల్లో భద్రతా పరికరాలు తప్పనిసరి

## - ఎన్పీడీసీఎల్ సిఈ (ఆపరేషన్) అశోక్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 4 : విద్యుత్ రంగంలో పనిచేసే ప్రతి ఉద్యోగి భద్రతకు అత్యున్నత ప్రాధాన్యత ఇవ్వాలని, భద్రతా పరికరాలు వినియోగించడం కచ్చితంగా పాటించాల్సిన నియమమని ఎన్పీడీసీఎల్ సి.ఈ (ఆపరేషన్) శ్రీ అశోక్ స్పష్టంగా పేర్కొన్నారు. సిరిసిల్ల సర్కిల్ పరిధిలో శనివారం నిర్వహించిన పలు కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయన, విద్యుత్ భద్రత, వినియోగదారుల సేవలు, వ్యవస్థ మెరుగుదలపై అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా విద్యుత్ ఉద్యోగులు, ఓ అండ్ ఎం (ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్) సిబ్బందికి భద్రతపై అవగాహన కల్పించేందుకు "పెప్ టాక్" కార్యక్రమం నిర్వహించబడింది. డివిజనల్ ఇంజనీర్ అంజయ్య ఆధ్వర్యంలో 33/11 కెవి శివనగర్ సబ్‌స్టేషన్‌లో ఈ కార్యక్రమం జరిగింది. క్షేత్రస్థాయిలో పనిచేసే సిబ్బంది హెల్మెట్, హ్యాండ్ గ్లౌజ్, ఎర్త్ రాడ్ వంటి భద్రతా పరికరాలు తప్పనిసరిగా ధరించాలని, వాటిని లేకుండా ఎట్టి పరిస్థితుల్లోనూ పనులు చేయరాదని ఆయన గట్టిగా హెచ్చరించారు. "ప్రాణం అమూల్యమైనది- ఉద్యోగుల భద్రత మా అగ్రప్రాధాన్యత" అని సి.ఈ అశోక్ స్పష్టం చేశారు. ప్రతి రోజు ఉదయం సెక్షన్ కార్యాలయాల్లో "పెప్ టాక్" నిర్వహిస్తూ సిబ్బందికి భద్రతపై నిరంతర అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ప్రతి ఉద్యోగి జీవితం విలువైనదని, భద్రతా ప్రమాణాలు కచ్చితంగా పాటించాల్సిన బాధ్యత అందరిదని అన్నారు. వినియోగదారులకు నాణ్యమైన, నిరంతర విద్యుత్ సరఫరా అందించడంలో ఓ అండ్ ఎం విభాగం కీలక పాత్ర పోషిస్తుందని ఆయన పేర్కొన్నారు. వినియోగదారులతో సత్సంబంధాలు కొనసాగిస్తూ, వారి సంతృప్తే ప్రధాన లక్ష్యంగా సేవలు అందించాలని సూచించారు. విద్యుత్ సేవల్లో సమూల మార్పులు తీసుకువచ్చే దిశగా సంస్థ కట్టుబడి ఉందని తెలిపారు.

**"పొలం బాట-ప్రజా బాట" కార్యక్రమంతో రైతులకు చేరువ**

సిరిసిల్ల పరిధిలో రైతుల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని పరిష్కరించేందుకు "పొలం బాట-ప్రజా బాట" కార్యక్రమాన్ని ఎస్.ఈ బిక్షపతి నాయకత్వంలో విస్తృతంగా నిర్వహిస్తున్నామని సి.ఈ అశోక్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో రైతులు,




వినియోగదారులు పాల్గొని తమ సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ముస్తాబాద్ మండలంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో రైతులతో నేరుగా మాట్లాడిన అధికారులు, సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. క్షేత్రస్థాయిలో ప్రమాదకరంగా ఉన్న లూజ్ లైన్లు, వంగిన స్థంబాలు, తక్కువ ఎత్తులో ఉన్న ట్రాన్స్ఫార్మర్లు వంటి సమస్యలను ప్రాధాన్యంగా గుర్తించి తక్షణమే సరిచేస్తామని హామీ ఇచ్చారు. వినియోగదారులు ఎట్టి పరిస్థితుల్లోనూ స్వయంగా విద్యుత్ పనులు చేయకూడదని, ఏ సమస్య ఉన్నా వెంటనే విద్యుత్ సిబ్బందిని సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు. బోయినపల్లి సెక్షన్ కొత్తపేట, సిరిసిల్ల టౌన్-1 బోనాల, టౌన్-2 మారుపాక, వల్లంపట్ల, వేములవాడ వల్మిడి, వీర్నపల్లి గ్రామాల్లో ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించి, రైతులకు విద్యుత్ భద్రత, వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాన్ని నిరంతరంగా కొనసాగిస్తూ వినియోగదారులకు మరింత మెరుగైన సేవలు అందించడం తమ ప్రధాన కర్తవ్యమని పేర్కొన్నారు.

**ముస్తాబాద్ సబ్‌స్టేషన్ తనిఖీ -- సాంకేతిక మెరుగుదలపై దృష్టి**

ముస్తాబాద్ 33/11 కెవి సబ్‌స్టేషన్‌ను సి.ఈ అశోక్ స్వయంగా తనిఖీ చేశారు. ట్రాన్స్ఫార్మర్లు, స్విచ్ యార్డ్, నిర్వహణ విధానాలు, భద్రతా చర్యలు, విద్యుత్ సరఫరా నాణ్యత, సాంకేతిక పనితీరును సమగ్రంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఓవర్‌లోడ్ ఫీడర్లు ఉన్నచో వెంటనే లోడ్ బదలాయింపు చేపట్టాలని, అవసరమైన చోట కొత్త బ్రేకర్లు ఏర్పాటు చేయాలని, విద్యుత్ సరఫరా నాణ్యతను మెరుగుపరచేందుకు సాంకేతిక చర్యలు తీసుకోవాలని, అవసరాన్ని బట్టి పవర్ ట్రాన్స్ఫార్మర్ల సామర్థ్యాన్ని పెంచాలని అధికారులకు సూచించారు. విద్యుత్ వ్యవస్థను మరింత సమర్థవంతంగా, సురక్షితంగా, వినియోగదారులకు అనుకూలంగా తీర్చిదిద్దే దిశగా ఎన్పీడీసీఎల్ కట్టుబడి ఉందని సి.ఈ అశోక్ తెలిపారు.



# కొనుగోలు కేంద్రాల్లో అన్ని వసతులు కల్పించాలి

## - అదనపు కలెక్టర్ గడ్డం నగేష్
## - ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల బాధ్యులతో ఐడీఓసీలో సమావేశం

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 04 : ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో వసతులను కల్పించాలని అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ ఆదేశించారు. యాసంగి సీజన్ సందర్భంగా జిల్లా లోని 22 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ఆధ్వర్యంలో 93 వద్ద కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనుండగా, సంఘాల కార్యదర్శులు, సెంటర్ల ఇంచార్జిలు, ట్యాబ్ ఆపరేటర్లతో కొనుగోలుపై జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో శనివారం అదనపు కలెక్టర్ శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ మాట్లాడుతూ.. ధాన్యం కొనుగోలు కేంద్రాలలో అన్నీ రకాల మౌళిక సదుపాయాలను కల్పించాలని, కొనుగోలు కు సంబంధించిన పరికరాలను సమకూర్చుకోవాలని, నిబంధనల ప్రకారం దాన్యం కొనుగోలు చేయాలని సూచించారు. ఈ నెల మొదటి వారంలో కేంద్రాలు ప్రారంభించాలని, అవసరమైన గన్ని బ్యాగ్స్ సమకూర్చాలని, కేటాయించిన రైస్ మిల్లులకు ధాన్యం తరలించేందుకు ఏర్పాట్లు చేసుకోవాలని ఆదేశించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోళ్లు చేయాలని సూచించారు. శిక్షణలో జిల్లా సహకార అధికారి రామకృష్ణ, జిల్లా పౌర సరఫరాల అధికారి బుచ్చిబాబు, జిల్లా మేనేజర్ నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# హెల్త్ వీక్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

## - ఈట్ రైట్, ఎయిడ్స్‌పై అవగాహన, యోగ, సేవ్ మదర్స్‌డే లాంటి కార్యక్రమాలను పెద్ద ఎత్తున నిర్వహించాలి
## - ఏప్రిల్ 4 నుండి 11 వరకు వారం రోజులపాటు హెల్త్ వీక్ కార్యక్రమం
## - జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మెదక్, ఏప్రిల్ 04 : హెల్త్ వీక్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ.. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ఏప్రిల్ 06 నుండి 11 వరకు వారం రోజులపాటు హెల్త్ వీక్ కార్యక్రమాన్ని అన్ని శాఖల సమన్వయంతో విజయవంతం చేయాలని అధికారులకు పిలుపునిచ్చారు. హెల్త్ వీక్ కార్యక్రమంలో భాగంగా జిల్లా, గ్రామీణ స్థాయిలో ప్రజలందరి భాగస్వామ్యం చేయాలని పిలుపునిచ్చారు. ఆరోగ్యమే మహాభాగ్యం అని, ఆరోగ్యంగా ఉన్నప్పుడే అన్ని సాధించవచ్చు అని, మహిళలు చిన్న పిల్లల అనారోగ్య సమస్యలపై యాక్షన్ ప్లాన్ తయారు చేయాలన్నారు. వివిధ వ్యాధుల పట్ల నిర్లక్ష్యం చేసినవారిని తిరిగి చికిత్సను అందించాలన్నారు. ఎయిడ్స్, క్యాన్సర్, హైరిస్క్ ప్రెగ్నెన్సీ, సి సెక్షన్, ఎనీమియా, మత్తు పదార్థాల నిర్మూలన,లాంటి అనేక వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ ఆరు రోజుల హెల్త్ వి కార్యక్రమాలకు నోడల్ ఆఫీసర్లను నియమించాలన్నారు. ఈట్ రైట్, ఎయిడ్స్ పై అవగాహన, యోగ సేవ్ మదర్స్ డే,లాంటి కార్యక్రమాలపై వ్యాసరచన పోటీలు నిర్వహించాలన్నారు. ఈ ఆరు రోజుల కార్యక్రమంలో అధికారులు, మహిళలు, ప్రజలు,



విద్యార్థులు, వ్యాపారస్తులు, అందరిని భాగస్వామ్యం చేసేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఆరవ తారీకు సోమవారం రోజున ఈట్ రైట్ వాక్ ను పెద్ద ఎత్తున కార్యక్రమాన్ని నిర్వహించాలని సూచించారు. ఈ వాక్ మున్సిపల్ కార్యాలయం నుంచి రాందాస్ చౌరస్తా వరకు కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, జిల్లా వైద్యాధికారి శ్రీరామ్, డిసిహెచ్ శివదయాల్, జిల్లా విద్యాధికారి విజయ, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శ్రీనివాసరావు, డీఎస్పీ ప్రసన్నకుమార్, డ్రగ్స్ నియంత్రణ అధికారి చంద్రకళ, తదితరులు పాల్గొన్నారు.

# అర్ధరాత్రి ఘోర ప్రమాదం...!

## - ప్రమాదంలో యువ సింగరేణి ఉద్యోగి మృతి
## - విషాదంలోనూ నేత్రదానం
## - ఇద్దరికీ చూపునిచ్చే మహోన్నత నిర్ణయం

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



గోదావరిఖని, ఏప్రిల్ 04 : గోదావరిఖని పట్టణంలో శుక్రవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదం విషాదాన్ని మిగిల్చింది. యువ సింగరేణి ఉద్యోగి ప్రాణాలు కోల్పోగా, మరో ముగ్గురు గాయాలపాలయ్యారు. అయితే ఆ దుఃఖంలోనూ మృతుని కుటుంబం తీసుకున్న నేత్రదానం నిర్ణయం మానవత్వానికి నిలువెత్తు నిదర్శనంగా నిలిచింది. స్థానిక మార్కండేయ కాలనీకి చెందిన ఏల్పుల శ్రీధర్ అనే సింగరేణి యువ ఉద్యోగి, తన స్నేహితులతో కలిసి ఓ కార్యక్రమానికి హాజరై తిరుగు ప్రయాణంలో ఉన్నారు. శుక్రవారం అర్ధరాత్రి రాజేష్ టాకీస్ వైపు నుంచి గోదావరిఖని మున్సిపాలిటీ కార్యాలయం దిశగా కారులో వెళ్తుండగా, వాహనం అదుపు తప్పి ప్రమాదానికి గురైంది. ఈ ఘటనలో శ్రీధర్ తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. కారులో ఉన్న మిగతా ముగ్గురు స్నేహితులు తీవ్ర గాయాలతో బయటపడ్డారు. ఇదిలా ఉండగా, శ్రీధర్ మృతితో శోకసంద్రంలో మునిగిపోయిన కుటుంబ సభ్యులు గొప్ప మనసు చాటుకున్నారు. సదాశయ ఫౌండేషన్ ప్రచార కార్యదర్శి కే.ఎస్. వాసు సూచనతో పాటు గోదావరిఖని ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి గడ్డం శ్యామ్ కుమార్ అవగాహన కల్పించడంతో, మృతుని నేత్రాలను దానం చేయడానికి కుటుంబ సభ్యులు ముందుకు వచ్చారు. దీంతో జీజీహెచ్ ఆసుపత్రి మార్చురీలో శ్రీధర్ కార్నియాలను ఎల్వీ ప్రసాద్ ఐ బ్యాంక్ టెక్నీషియన్ ప్రదీప్ నాయక్ సేకరించి హైదరాబాద్‌కు తరలించారు. ఈ నేత్రదానం ద్వారా ఇద్దరికీ చూపు లభించే అవకాశం ఉందని వైద్యులు తెలిపారు. ఈ సందర్భంగా మృతుని కుటుంబ సభ్యుల మానవత్వాన్ని సదాశయ ఫౌండేషన్ ప్రతినిధులు, ప్రెస్ క్లబ్ సభ్యులు, రామగుండం లయన్స్ క్లబ్ ప్రతినిధులు అభినందించారు. మృతుని కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.

# సిబిఎస్ఇ త్రిభాషా విధానంపై ఆగ్రహం

## - ఇది హిందీని రుద్దే కార్యక్రమంగా ఉంది - తమిళనాడు సిఎం స్టాలిన్ అభ్యంతరం

(ప్రజాలక్ష్యం న్యూస్ బ్యూరో)

చెన్నై, ఏప్రిల్ 4 : 2026-27 విద్యా సంవత్సరంలో 6వ తరగతి నుండి త్రిభాషా విధానాన్ని ప్రవేశపెట్టనున్నట్లు సిబిఎస్ఇ తాజాగా ప్రకటించింది. త్రిభాషా విధానంపై తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె స్టాలిన్ శనివారం అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇది ప్రాంతీయ భాషల కంటే హిందీకి ఎక్కువ ప్రాధాన్యత నివ్వడానికి, ఆ భాషను బలవంతంగా రుద్దడానికి చేసే ప్రయత్నమేనని ఆయన మండిపడ్డారు. ఈ విధానం సమాఖ్యవాదాన్ని దెబ్బతీస్తుందని, హిందీ మాట్లాడని రాష్ట్రాలను అణచివేస్తుంది. పైగా విద్యార్థులు, ఉపాధ్యాయులపై అనవసర భారాన్ని మోపుతుందని స్టాలిన్ ఆరోపించారు. భారతదేశ భాషా వైవిధ్యాన్ని గౌరవించాలని, రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థుల హక్కులను పరిరక్షించాలని కేంద్ర ప్రభుత్వాన్ని స్టాలిన్ కోరారు. ఈ మేరకు ఆయన సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్టు చేశారు. కాగా, 'జాతీయ విద్యా విధానం 2020కి అనుగుణంగా సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సిబిఎస్ఇ) విద్యార్థులు మూడు భాషల్ని చదవాలని తెచ్చిన కొత్త పాఠ్యప్రణాళిక విధానం నిష్కపటమైన విద్యా సంస్కరణ కాదు. ఇది హిందీని బలవంతంగా రుద్దాలని ఉద్దేశపూర్వకంగా చేసే ప్రయత్నం. ఇది బిజెపి హిందీని మాపై బలవంతంగా రుద్దుతుంది అన్న ఆందోళనల్ని నిజం చేస్తుంది. భారతీయ భాషలను ప్రోత్సహించే ముసుగులో బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం భారతదేశపు గొప్ప, వైవిధ్యభరితమైన భాషా వారసత్వాన్ని క్రమపద్ధతిలో అణచివేస్తూ, హిందీని ప్రాధాన్యతనిచ్చే కేంద్రీకరణ ఎజెండాను దూకుడుగా ముందుకు తీసుకెళ్తోంది. మూడు భాషల సూత్రం అని పిలిచేది వాస్తవానికి హిందీ మాట్లాడని ప్రాంతాలలోకి హిందీని విస్తరించడానికి ఉద్దేశించిన ఒక రహస్య యంత్రాంగం. కేంద్ర ప్రభుత్వ పాఠ్య ప్రణాళిక విధానం హిందీ మాట్లాడే విద్యార్థులకు నిర్మాణాత్మకంగా ప్రాధాన్యతనిస్తుంది. నిష్పక్షపాతాన్ని, సమాఖ్యవాదాన్ని, ప్రాంతీయ సమానత్వాన్ని దెబ్బతీస్తుంది' అని స్టాలిన్ ఎక్స్ పోస్టులో విమర్శించారు. ఇలాంటి విధానాలు భారతదేశ భాషా వైవిధ్యానికి ముప్పు కలిగిస్తాయని



స్టాలిన్ హెచ్చరించారు. విద్యార్థుల హక్కులు, ప్రాంతీయ గుర్తింపు కోసం నిలబడాలని తమిళనాడులోని ఏఐఎడిఎంకె, దాని ఎన్‌డిఎ మిత్రపక్షాలకు ఆయన పిలుపునిచ్చారు. త్రిభాషా విధానం వల్ల దక్షిణాది రాష్ట్రాల విద్యార్థులను హిందీని నేర్చుకోవడం తప్పనిసరి చేస్తుంది. మరి హిందీ మాట్లాడే రాష్ట్రాల విద్యార్థులు తమిళం, తెలుగు, కన్నడ, మలయాళం, లేదా బెంగాలీ, మరాఠీ వంటి భాషలను కూడా తప్పనిసరిగా నేర్చుకుంటారా? దక్షిణాది రాష్ట్రాల విద్యార్థులకు, ఉత్తరాది రాష్ట్రాల విద్యార్థులకు మధ్య నేర్చుకునే విధానంలో స్పష్టత లేదు. ఈ విధానం ఏకపక్షంగా హిందీని రుద్దడమనే వివక్షాపూరిత స్వభావాన్ని బయటపెడుతుంది. ఈ వైరుధ్యం ఆమోదయోగ్యం కాదు. కేంద్ర ప్రభుత్వం కేంద్రీయ విద్యాలయ సంఘటన్ పాఠశాలల్లో తమిళాన్ని తప్పనిసరి భాషగా చేయడంలో విఫలమైంది. తమిళ భాషను బోధించడానికి తమిళ ఉపాధ్యాయులను నియమించడంలో విఫలమైంది. మరి ఇప్పుడు అదే కేంద్ర ప్రభుత్వం భారతీయ భాషలను ప్రోత్సహించడంపై రాష్ట్రాలకు ఉపన్యాసాలు ఇవ్వాలని చూస్తోందని స్టాలిన్ ఎద్దేవా చేశారు. ఇది భాషల పట్ల కేంద్రం చూపే వైఖరి నిబద్ధత కాదు.. పచ్చి కపటత్వం అని స్టాలిన్ ఎక్స్ పోస్టులో ధ్వజమెత్తారు. మిళనాడు అనేక ఇతర రాష్ట్రాలు లేవనెత్తి చట్టబద్ధమైన, స్థిరమైన ప్రజాస్వామ్యయుతమైన ఆందోళనలను పక్కనపెట్టి, హిందీని రుద్దడానికి కేంద్ర ప్రభుత్వం నిశ్చయించుకున్నట్లు కనిపిస్తోంది. ఈ విధానం సహకార సమాఖ్యవాద సూత్రాలకు విరుద్ధం. లక్షలాది మంది భారతీయుల భాషా గుర్తింపు అవమానించడమే అని స్టాలిన్ అన్నారు. ఈ నేపథ్యంలో తమిళనాడులోని తిరు పళనిస్వామి నేతృత్వంలోని ఏఐఏడిఎంకె, దాని ఎన్‌డిఎ మిత్రపక్షాలు ఈ రుద్దకాన్ని అంగీకరిస్తాయా? లేక ఒక్కసారైనా మన విద్యార్థుల హక్కులు, గుర్తింపు, భవిష్యత్తు కోసం నిలబడతాయా? అని స్టాలిన్ ఎక్స్ పోస్టులో ప్రశ్నించారు.

# బైక్ ప్రమాదంలో ఇద్దరి మృతి

## కుటుంబాల్లో తీరని విషాదం

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జగిత్యాల, ఏప్రిల్ 4 : ఒక్కగానొక్క కొడుకులు అల్లారు ముద్దుగా పెంచారు. బైక్ కావాలంటే కొనిచ్చారు. కానీ ఆ బైకే వారి ప్రాణాలు తీస్తుందని ఆ తల్లిదండ్రులు ఊహించలేదు. జగిత్యాల జిల్లాలో జరిగిన బైక్ ప్రమాదంలో ఇద్దరు చనిపోవడం తీవ్ర విషాదం మిగిల్చింది. వివరాల్లోకి వెళ్తే.. జగిత్యాల జిల్లా మేడిపల్లి మండల శివారులో జరిగింది ఈ ప్రమాదం. రోడ్డుపై ఆగి ఉన్న లారీని బైక్ వెనుక నుంచి ఢీకొటడంతో ఆదిత్య అనే యువకుడు అక్కడిక్కడే మృతి చెందాడు. మరో యువకుడు విగ్నేష్ తీవ్రంగా గాయపడ్డాడు. జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించే లోపే మార్గమధ్యలోనే మృతి చెందాడు. పెగడపల్లి నుండి కోరుట్ల సమీపంలో ఫంక్షన్‌కు వెళ్లి తిరుగు ప్రయాణంలో ప్రమాదం జరిగింది. మృతులు ఇద్దరూ తమ కుటుంబాలకు ఒక్కగానొక్క కొడుకులు. కుమారుల మృతితో కన్నతల్లుల రోదనలు హృదయ విదారకంగా మారాయి.

# పాత కక్షలతో హత్య

## ప్రమాదంగా చిత్రీకరించే యత్నం

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

నాగర్ కర్నూల్, ఏప్రిల్ 4 : పాత కక్షలు ఓ వ్యక్తి ప్రాణాలు తీశాయి. కారులో ప్రయాణిస్తున్న వ్యక్తిని ప్రత్యర్థులు టిప్పర్‌తో ఢీకొట్టి హతమార్చారు. ఈ ఘటన నాగర్ కర్నూల్ జిల్లా వెల్దండ మండల కేంద్రంలో చోటుచేసుకుంది. భూతగాదాల విషయంలో పాత లక్షలుండటంతో మహేష్ అనే వ్యక్తిని కారులో ప్రయాణిస్తుండగా.. ప్రత్యర్థులు టిప్పర్ ఢీ కొట్టారు. అనంతరం ఈ ఘటనను రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించేందుకు యత్నించారు. భూ తగాదాలకు సంబంధించి అడ్డు వస్తున్నాడని మహేశ్‌ను ప్రత్యర్థులు దాడి చేసి చంపినట్లు కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# కెసిర్ క్యాంప్ కార్యాలయంపై దాడి

## - క్షీణిస్తున్న శాంతిభద్రతలకు నిదర్శనం - మండిపడ్డ బిఆర్ఎస్ నేతలు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, ఏప్రిల్ 4 : ప్రతిపక్ష నేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, కేసీఆర్ క్యాంపు కార్యాలయంపై జరిగిన దాడిని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి , ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ తీవ్రంగా ఖండించారు. ఈ ఘటన రాష్ట్రంలో క్షీణిస్తున్న శాంతిభద్రతలకు నిదర్శనమని వారు అన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన మహనీయుడు కేసీఆర్ కార్యాలయంపై దాడి చేయడం అంటే తెలంగాణ ప్రజల గౌరవంపై దాడి చేసినట్టేనని మండిపడ్డారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే చర్యలను ప్రజలు ఎప్పటికీ సహించరని హెచ్చరించారు. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్ష నేత కార్యాలయంపై దాడి జరగడం అత్యంత ఆందోళనకరమని, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిపక్షాల గొంతు నొక్కే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. అధికార అహంకారంతో కాంగ్రెస్ నాయకులు హద్దులు దాటుతున్నారని మండిపడ్డారు. ప్రజల సమస్యలపై ప్రశ్నిస్తున్న ప్రతిపక్ష నాయకులను భయపెట్టేందుకు ఇలాంటి దాడులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో ప్రజా ప్రతినిధులకే రక్షణ లేకపోతే సాధారణ ప్రజల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. పోలీసు యంత్రాంగం తక్షణమే స్పందించి దాడికి పాల్పడిన వారిని గుర్తించి, అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకునే వారికి ప్రభుత్వం అండగా నిలిస్తే ప్రజాస్వామ్య వ్యవస్థ ప్రమాదంలో పడుతుందని హెచ్చరించారు. బీఆర్ఎస్ పార్టీపై ఎలాంటి అణచివేతలు చేసినా వెనక్కి తగ్గబోమని, ప్రజల తరఫున పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఇలాంటి దాడులు పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రతిపక్షాలపై దాడులు ఆపాలని, తెలంగాణ గౌరవాన్ని కాపాడాలని సూచించారు.

# మేడారం పూజారి కుమారుడికి పరామర్శ

## - ఘటనకు మంత్రులదే బాధ్యతన్న మధుసూధనాచారి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

వరంగల్, ఏప్రిల్ 4 : మేడారం గద్దెల వద్ద గతనెల 25న జరిగిన ప్రమాదానికి మంత్రులు సీతక్క, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కొండా సురేఖ బాధ్యత వహించి తమ పదవులకు రాజీనామా చేయాలని తెలంగాణ శాసనమండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి , ములుగు నియోజకవర్గ ఇన్‌చార్జి బడే నాగజ్యోతి డిమాండ్ చేశారు. హన్మకొండలో ప్రైవేటు హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న సమ్మక్క పూజారి కుమారుడు యువన్‌ను వారు పరామర్శించారు. బాలుడి కుటుంబ సభ్యులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా బాలుడికి తీవ్ర నష్టం జరిగిందని తెలిపారు. మంత్రి సీతక్క వచ్చి పరామర్శించి రూ. 10వేలు చేతిలో పెట్టి వెళ్లి ఇప్పటి వరకు పట్టించుకోలేదని ఆరోపించారు. మంత్రులు ఇప్పటివరకు బాలుడిని ఆదుకునేందుకు ముందుకు రాకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బాలుడికి అయ్యే వైద్య ఖర్చులన్నీ ప్రభుత్వమే భరించి, అతడి భవిష్యత్ కోసం కోటి రూపాయలు నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. బాధితుడి తల్లిదండ్రులకు ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని కోరారు. వీరివెంట ఎట్టి జగదీష్, మాజీ జడ్పీటీసీ రామాసహాయం శ్రీనివాస్ రెడ్డి, మాజీ సర్పంచ్, ఈసం రామ్మూర్తి, మాజీ మదరి రామయ్య, కేయూ బీఆర్ఎస్వీ నాయకులు కొనుకంటి ప్రశాంత్, తాడ్వాయి మండల యూత్ అధ్యక్షులు కోట సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్యం



## మన పూర్వీకుల్లా అదొక్కటి తింటే..

# ఒంట్లో యూరిక్ యాసిడ్ అంతా యామం

ప్రస్తుతం ప్రజల లైఫ్ స్టైయిల్ లో చాలామార్పులు వచ్చాయి. మారుతున్న ఆహారపు అలవాట్లు తరచుగా అనేక ఆరోగ్య సమస్యలకు కారణమవుతున్నాయి. అధిక యూరిక్ యాసిడ్ సమస్య వీటిలో ఒకటి. ఈ మధ్యకాలంలో చాలామంది యూరిక్ యాసిడ్ ప్రాబ్లమ్ తో బాధపడుతున్నారు. ఆహారం, డ్రింక్స్‌లో ఉండే ప్యూరిన్స్ అనే రసాయనాల్ని శరీరం విచ్ఛిన్నం చేసినప్పుడు యూరిక్ యాసిడ్ ఏర్పడుతుంది. బిజీ లైఫ్ స్టైల్, జంక్ ఫుడ్ ఎక్కువగా తినడం ఇవన్నీ రక్తంలో యూరిక్ యాసిడ్ స్థాయిని పెంచుతున్నాయి. శరీరంలో యూరిక్ యాసిడ్ లెవల్స్ పెరగడం వల్ల కీళ్ల నొప్పులతో పాటు అనేక వ్యాధులు రావచ్చు. యూరిక్ యాసిడ్ స్థాయి పెరిగితే తరుచుగా మూత్రవిసర్జనకు వెళ్లాల్సి వస్తుంది. అంతేకాకుండా యూరినరీ ట్రాక్ట్ ఇన్ఫెక్షన్ బారిన పడవచ్చు. దీంతో మూత్ర విసర్జన సమయంలో మంట వస్తుంది. నడుము కింద, పొట్ట దిగువ భాగం, గజ్జల్లో నొప్పి వస్తుంది. కాబట్టి సమయానికి యూరిస్ యాసిడ్ ని నియంత్రించడం చాలా ముఖ్యం. మెడిసిన్స్ ద్వారా మాత్రమే కూడా తీసుకునే ఆహారంలో చిన్న చిన్న మార్పులు చేయడం వల్ల కూడా పెరిగిన యూరిక్ యాసిడ్ నియంత్రించవచ్చు. యూరిస్ యాసిడ్ ని నేచురల్ గా కంట్రోల్ చేయడం ఎలా ఇది తినాలి మీరు అధిక యూరిక్ యాసిడ్ సమస్య ఉంటే గోధుమ రోటీ తినడం మానేసి దాని స్థానంలో మిల్లెట్ రోటీని తినండి. పోషకాలు అధికంగా ఉండే మిల్లెట్ రోటీ యూరిక్ యాసిడ్ ను నియంత్రించడంలో సహాయపడటమే కాకుండా అనేక ఇతర ఆరోగ్య ప్రయోజనాలను కూడా అందిస్తుంది. అధిక యూరిక్ యాసిడ్ని నియంత్రించడంలో మిల్లెట్ రోటీ ఎలా ఉపయోగపడుతుందో తెలుసుకుందాం. పోషకాలు అధికంగా ఉండే మిల్లెట్ మిల్లెట్ చాలా కాలంగా ప్రజల ఆహారంలో భాగమై ఉంది. కరోనా తర్వాత నుంచి చాలామంది ఆరోగ్యంపై ఎక్కువ శ్రద్ధ పెట్టారు..ఈ క్రమంలో మిల్లెట్స్ తో చేసే ఫుడ్స్ ని తీసుకోడానికి ఆశక్తి కనబరుస్తున్నారు. అయితే దాని ప్రయోజనాల గురించి తెలియని వ్యక్తులు కూడా దాని ప్రాముఖ్యతను తక్కువగా అంచనా వేస్తారు. వాస్తవానికి మిల్లెట్స్ లో ఫైబర్, మెగ్నీషియం, ఐరన్, యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. దీన్ని డైట్‌లో చేర్చుకోవడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయి. జీర్ణవ్యవస్థను బలోపేతం చేయడంతో పాటు శరీరంలో పేరుకుపోయిన మురికిని తొలగించడంలో సహాయపడుతుంది. అంతేకాకుండా ఇందులో ప్యూరిన్ పరిమాణం తక్కువగా ఉంటుంది, దీని కారణంగా ఇది యూరిక్ యాసిడ్‌ను నియంత్రించడంలో బాగా సహాయపడుతుంది. మిల్లెట్ మూత్రపిండాల పనితీరును మెరుగుపరుస్తుంది. ఇది శరీరం నుండి యూరిక్ యాసిడ్‌ను సులభంగా తొలగించడంలో సహాయపడుతుంది. డాక్టర్లు ఏం చెబుతున్నారు. మీరు యూరిక్ యాసిడ్ సమస్యతో బాధపడుతున్నట్లయితే మీ ఆహారంలో మిల్లెట్ రోటీని ఖచ్చితంగా చేర్చుకోవాలని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. దీన్ని రోజూ తినడం వల్ల యూరిక్ యాసిడ్ స్థాయి తగ్గుతుంది. అలాగే నీళ్లు ఎక్కువగా తాగడం, పచ్చి కూరగాయలు తినడం, వేయించిన ఆహారానికి వీలైనంత దూరంగా ఉండాలని డాక్టర్లు సూచిస్తున్నారు.

# తొక్కలో పచ్చడి ఎప్పుడైనా తిన్నారా

**సాధారణంగా వంట చేసేటప్పుడు కూరగాయల తొక్కలు తీసేసి కట్ చేసి వండుకుంటాం. అలాగే సొరకాయ వండేటప్పుడు కూడా తొక్క తీసి పడేస్తుంటాం. అయితే తోక్కే కదా అని పడేయకుండి. దాని వల్ల బోలెడు ప్రయోజనాలున్నాయి. సొరకాయ తొక్కతో సూపర్ టేస్ట్ పచ్చడి చేసుకోవచ్చు. దీని తయారీకి కావాల్సిన పదార్థాలు, తయారీ విధానం ఇక్కడ చూడండి.**

సొరకాయ తొక్క పచ్చడి తయారీకి కావాల్సిన పదార్థాలు -సొరకాయ తొక్కలు -సొరకాయ మధ్యలో భాగం -జీలకర్ర -శనగపప్పు -ఆవాలు -నూనె -చింతపండు -ఇంగువ -పసుపు

-ఉప్పు -పచ్చి మిరపకాయలు -వెల్లులి టమాటోలు -కొత్తిమీర -కరివేపాకు

తొక్క పచ్చడి తయారీ విధానం -ముందుగా ఓ పాన్ లో ఆయిల్ వేడి చేసుకోవాలి. -తర్వాత శనగపప్పు వేసి ఎర్రగా వేగాక జీలకర్ర వేయాలి. -ఇప్పుడు పచ్చిమిరపకాయలు వేసి మెత్తబడిన తర్వాత టమాటా ముక్కలు, చింతపండు వేసి కొద్దిసేపు ఉడికించి ఈ మిశ్రమాన్ని మిక్సీ లో వేసి మెత్తగా గ్రైండ్ చేసుకోవాలి. -ఇప్పుడు అదే పాన్ లో నూనె వేడి చేసి వెల్లుల్లి రెబ్బలు, సొరకాయ తొక్క, మధ్యలో ఉండే భాగం వేసి మెత్తగా మగ్గించుకోవాలి. -తర్వాత ఈ మిశ్రమాన్ని అదే మిక్సీ గిన్నెలో వేసి కొంచెం ఉప్పు వేసి కచ్చాపచ్చాగా



గ్రైండ్ చేసుకోవాలి. ఇప్పుడు తాళింపు వేయాలి. ఇందుకోసం స్టౌ ఆన్ చేసి ఆయిల్ వేడి చేసి ఎండు మిరపకాయ, కరివేపాకు, జీలకర్ర, ఆవాలు, శనగపప్పు, మినపప్పు, పసుపు, ఇంగువా వేసి వేయించుకోవాలి.




-తర్వాత గ్రైండ్ చేసుకున్న పచ్చడి మిశ్రమాన్ని ఇందులో వేసి బాగా కలపాలి. చివర్లో కొత్తిమీర తరుగు వేసి కలిపి దింపేయడమే. తొక్కలో పచ్చడి రెడీ.



# జామపండుతో అదిరిపోయే రోటి పచ్చడి..

మీరు మీ ఇంట్లో ఎన్నో రకాల చట్నీలు చేసుకొని ఉంటారు. బయట హెూటళ్లలో ఎన్నో రకాలైన చట్నీలను తిని ఉంటారు. కానీ మీరెప్పుడైనా జామ పండుతో చేసిన చట్నీని తిన్నారా? దాని రుచి ఎప్పుడైనా టేస్ట్ చూశారా? కానీ, జామ కాయతో చట్నీ ఏంటి అని ఆలోచిస్తున్నారా? అవును దీని రుచి అద్భుతంగా ఉంటుంది. రాజస్థాన్‌లో దీనిని ప్రత్యేకంగా చేసుకొని తింటారు. చేసుకోవడం కూడా చాలా సులభం. అసలు దీనిని ఎలా చేసుకోవాలి? దానికి కావాల్సిన పదార్థాలు ఏంటి? అనేది ఈ స్టోరీలో తెలుసుకుందాం.

రాజస్థాన్ స్టైల్ జామ చట్నీ తయారీకి కావాల్సిన పదార్థాలు లి కాశ్మీరీ మిరపకాయలు - 5 లి జీలకర్ర - 1, ఉప్పు - కొద్దిగా లి నీరు - కొద్దిగా లి కొత్తిమీర - కొద్దిగా లి జామ - 1 లి నేచురల్ షుగర్- 1/2 టేబుల్ స్పూన్

జామ చట్నీ తయారీ విధానం రాజస్థాన్ స్టైల్‌లో ఈ జామ కాయ చట్నీ చేసుకోవడం అత్యంత సులభమైన ప్రక్రియ. దీనిని తయారు చేసుకోవడానికి ముందుగా.. ఒక మిక్సీ జార్‌లో 5 నుంచి 6 కాశ్మీరీ మిరపకాయలు వేసుకోవాలి. దానితో పాటు ఒక టీస్పూన్ జీలకర్ర, రుచికి సరిపడా ఉప్పు, కొంచెం నీరు వేసుకొని, బాగా రుబ్బుకోవాలి. ఆ తరువాత దానికి కొద్దిగా కొత్తిమీర, ఒక తరిగిన జామపండు, కొన్ని దేశిమిర్చి వేసుకొని, మరోసారి బాగా గ్రైండ్ చేసుకోవాలి. జామపండు, మిర్చి మొత్తం సరిగ్గా నలిగే విధంగా మిక్సీ పట్టుకోవాలి. అంతే రాజస్థాన్ పద్ధతిలో ఎంతో రుచికరమైన జామపండు చట్నీ సిద్ధమైనట్లే. దీనిని వేడి వేడి అన్నంలో లేదా, ఇడ్లిలో కలుపుకొని తింటే అబ్బా ఆ రుచే వేరు అంతే.

# మీల్ మేకర్ ఎగ్ ఫ్రై..

**ఎగ్ తో అనేక రకాల వంటకాలను ట్రై చేసుకుంటారు. అలాగే మీల్ మేకర్ తో కూడా అనేక రకాల వంటకాలను ట్రై చేసి ఉంటారు. అయితే ఈ రెండు కలిపి వండితే ఎలా ఉంటదని ఎప్పుడైనా ఆలోచించారా? రుచి సూపర్ గా ఉంటుంది. మటన్ ని మించిన టేస్ట్ వస్తుందంటే ఆశ్చర్యపోనక్కర్లేదు. మీల్ మేకర్ ఎగ్ ఫ్రై ఇంట్లో చాలా సులభంగా తయారుచేసుకోవచ్చు. అద్భుతమైన రుచిని కలిగి ఉండే మీల్ మేకర్ ఎగ్ ఫ్రైని తయారు చేసుకోడానికి కావాల్సిన పదార్థాలు, తయారీ విధానం ఇక్కడ చూడండి.**

మీల్ మేకర్ ఎగ్ ఫ్రై తయారీకి కావాల్సిన పదార్థాలు -3 కోడిగుడ్డు -1 కప్పు మీల్ మేకర్ -కరివేపాకు -కొత్తిమీర -ఉప్పు -కారం -పసుపు -అల్లంవెల్లుల్లి పేస్ట్ -2 టమాటోలు -3 స్పూన్ల ఆయిల్ -2 ఉల్లిపాయలు -ధనియాల పొడి.

మిల్ మేకర్ ఎగ్ ఫ్రై తయారీ విధానం -ముందుగా ఓ బౌల్ లో 3 కోడిగుడ్లు కొట్టి బాగా కలపండి.

-తర్వాత స్టవ్ మీద ఒక కప్పు మీల్ మేకర్ ని ఉడికించండి. మిల్ మేకర్ నీళ్లలో వేసే ముందు అందులో కొంచెం ఉప్పు కూడా వేయండి. -మీల్ మేకర్ ఉడికిన తర్వాత స్టవ్ ఆఫ్ చేసేసి మీల్ మేకర్ ని పిండి ఓ ప్లేట్ లోకి తీసుకొని పక్కనపెట్టుకోండి. -ఇప్పుడు స్టవ్ మీద పాన్ పెట్టి ఆయిల్ వేసి ఒక స్పూన్ జీలకర్ర,ఉల్లిపాయలు,కరివేపాకు,కొంచెం పసుపు, కొద్దిగా ఉప్పు వేసి ఫ్రై చేసుకోండి. -ఉల్లిపాయలు కొంచెం మగ్గిన తర్వాత అందులో కొంచెం అల్లం వెలుల్లి పేస్ట్, కారం,తగినంత ఉప్పు వేసి అంతా బాగా మిక్స్ చేసుకోవాలి. -తర్వాత అందులో చిన్నగా కట్ చేసుకున్న రెండు టమాటో ముక్కలు వేసి కలిపి మూతపెట్టి మగ్గనివ్వండి. -టమాటో ముక్కలు మగ్గిన తర్వాత అందులో నీళ్లు పిండేసిన



మీల్ మేకర్ ముక్కలు వేసి కలిపి మూత పెట్టి మగ్గించుకోవాలి. -పగటకొట్టి పక్కన ఉంచుకున్న కోడిగుడ్ల మిశ్రమాన్ని ఇందులో వేసి మంటను లో ఫ్లేమ్ లో ఉంచి కలుపుతూ ఫ్రై చేసుకోవాలి. -తర్వాత కొంచెం ధనియాల పొడి చల్లుకొని రెండు నిమిషాలు ఫ్రై చేసుకొని కొంచెం కొత్తిమీర చల్లుకొని స్టవ్ ఆఫ్ చేసేయండి. అంతే మీల్ మేకర్ ఎగ్ ఫ్రై రెడీ.



# అరటిపండుతో టీ..

బనానా టీ వల్ల కలిగే ప్రయోజనాలు చాలా మంది ఒత్తిడి తగ్గడానికి, నిద్ర బాగా పట్టడానికి బనానా టీ తాగుతుంటారు. అయితే ఫలితం మాత్రం చాలా తక్కువగా వస్తుంది. అలాంటి వ్యక్తులు బనానా టీ తాగడం వల్ల మంచి ఫలితాలు పొందొచ్చు. బనానా టీలో పొటాషియం, మెగ్నీషియం అధికంగా ఉంటుంది. దీనివల్ల ఒత్తిడి తగ్గిపోతుంది. నిద్ర బాగా పడుతుంది. నాడీ వ్యవస్థ సడలిపోతుంది.

ఈ టీ తాగడం వల్ల శరీరానికి తక్షణ శక్తి లభిస్తుంది. నీరసంగా ఉన్నప్పుడు, బలం లేకుండా ఉన్నామనే ఆలోచన కలిగినప్పుడు ఈ టీ తాగడం వల్ల తక్షణ శక్తీ లభించడంతో పాటు.. మనసు ఉత్తేజంగా మారుతుంది. అలాగే ఉల్లాసంగా అనిపిస్తుంది. అలాగే బనానాలో పోషకాలు చాలా ఉంటాయి. ఇవి చాలా తొందరగా జీర్ణమైపోతాయి. దీని వల్ల శరీరానికి కావాల్సిన పోషకాలు వృథా కాకుండా సులభంగా శరీరానికి అందుతాయి. ఈ బనానా టీ తాగడం వల్ల హృదయానికి సంబంధించిన సమస్యలు అన్నీ దూరమైపోతాయి. గుండె జబ్బులు రాకుండా.. గుండెకు రక్తాన్ని సరఫరా చేసే నాళాలన్నీ ఆరోగ్యంగా శుభ్రంగా ఉంటాయి. దీంతో పాటు చర్మం ఆరోగ్యంగా ఉంటుంది. కాంతివంతంగా మెరిసిపోతుంది. అందంగా కనిపించడంతో పాటు చర్మం మృదుగా ఉంటుంది. అలాగే ఈ టీ తాగడం వల్ల బరువు కూడా తగ్గే అవకాశం ఉంది. అందుకే ఈ బనానా టీని తాగేందుకు చాలామంది ఇష్టపడుతుంటారు.

ఎలా చేసుకోవాలి? ఈ బనానా టీని చేసుకోవడం కూడా చాలా సులభం. కేవలం పది నిమిషాల్లోనే ఇది సిద్దయిపోతాయి. ముందుగా ఒక మూడు కప్పుల నీటిని తీసుకోవాలి. దానిని మరిగించాలి. నీరు మరుగుతున్నప్పుడు అందులో అరటి పండును ముక్కలుగా చేసి పెట్టుకోవాలి. అలాగే అందులో ఒకటి దాల్చిన చెక్క, ఒకటి లవంగం కూడా వేసుకొని మరిగించుకోవాలి. ఆ తరువాత వగట్టుకొని తాగితే రుచి అద్భుతంగా ఉంటుంది. అలాగే ఆరోగ్యానికి కూడా చాలా మేలు చేస్తుంది.

# సినిమా న్యూస్



## అంతర్జాతీయ వేదికపై మరోసారి.. అరుదైన ఘనత సాధించిన రష్మిక!




పేరుకే కన్నడ బ్యూటీ.. నేడు టాలీవుడ్ స్టార్ హీరోయిన్గా భారీ పాపులారిటీ సొంతం చేసుకున్న రష్మిక మందన్న గురించి పరిచయాలు ప్రత్యేకంగా అవసరం లేదు.. అందం అభినయంతో కాదు నటనతో ఊహించని ఇమేజ్ సొంతం చేసుకుంది ఈ చిన్నది.. నేడు పాన్ ఇండియా స్టార్ హీరోయిన్గా చలామణి అవుతున్న ఈమె.. గత మూడు సంవత్సరాలుగా వరుస చిత్రాలతో.. ఊహించని విజయాలతో.. బాక్సాఫీస్ కలెక్షన్స్ తో స్టార్ హీరోల రికార్డులను కూడా బ్రేక్ చేస్తోంది అనడంలో సందేహం లేదు. అంతర్జాతీయ వేదికపై రెండవసారి.. పుష్ప, పుష్ప 2, యానిమల్, ఛావా, సికందర్ , ది గర్ల్ ఫ్రెండ్, కుబేర ఇలా వరుస పెట్టి సినిమాలు చేస్తూ బాక్సాఫీస్ వద్ద భారీ కలెక్షన్స్ వసూలు చేస్తూ.. బాక్సాఫీస్ క్వీన్ గా పేరు సొంతం చేసుకుంది రష్మిక మందన్న . ఇదిలా ఉండగా అటు కెరియర్ పరంగా బిజీగా మారిన ఈమె.. ఇటు వ్యక్తిగతంగా తన ప్రాణ స్నేహితుడైన విజయ్ దేవరకొండ తో ఏడడుగులు కూడా వేసింది. ఇక ఇప్పుడు వివాహితగా మారిన తర్వాత తన భర్త విజయ్ దేవరకొండ తో కలిసి చేస్తున్న తొలి చిత్రం రణబాలి. ఇప్పటికే ఈ సినిమాలోని రాయలసీమ ప్రాంతానికి సంబంధించి షూటింగ్ షెడ్యూల్ ను పూర్తి చేసుకున్నారు. మరొకవైపు మైసా అనే సినిమాలో కూడా నటిస్తోంది రష్మిక . ఇలా కెరియర్ పరంగా వరుస చిత్రాలతో బిజీగా మారిన ఈమె తాజాగా మరోసారి అంతర్జాతీయ వేదికపై కనిపించనుంది. అంతేకాదు ఈ అరుదైన అవకాశాన్ని అందుకున్న మొట్టమొదటి భారతీయ సినీ నటిగా పేరు కూడా సొంతం చేసుకుంది రష్మిక. పూర్తి వివరాల్లోకి వెళితే.. జపాన్ లోని టోక్యోలో మే 23వ తేదీన జరగనున్న " క్రంచీరోల్ యానిమే అవార్డ్స్ 2026"లో రష్మిక ప్రజెంటర్ గా వ్యవహరించబోతోంది. ఈ ప్రతిష్టాత్మక వేదికపై ఈమె రెండవసారి కనిపించడం గమనార్హం.. 2024 లోనే ఈమె ఈ అవార్డ్స్ వేడుకల్లో ప్రజెంటర్ గా సందడి చేసిన విషయం తెలిసిందే. ఇప్పుడు మరొకసారి ఈ అవకాశం అందుకోవడంతో అభిమానులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. అంతేకాదు ఈ ప్రతిష్టాత్మక వేదికపై వరుసగా రెండుసార్లు అవార్డులు అందజేస్తున్న తొలి భారతీయ నటిగా రష్మిక చరిత్ర సృష్టించింది. పైగా పుష్ప సినిమాతో జపాన్ లో భారీ క్రేజ్ సంపాదించుకున్న ఈమెను క్రంచీరోల్ సంస్థ "ఇండియా స్వీట్ హార్ట్" గా అభివర్ణించింది. ఇకపోతే ఈ క్రెడిట్ మొత్తం పుష్ప సినిమాకే లభిస్తుందని అభిమానులు కూడా కామెంట్లు చేస్తున్నారు. ఎందుకంటే పుష్ప సినిమాలో శ్రీవల్లి పాత్రతో అందరినీ ఆకట్టుకుంది రష్మిక. జపాన్లో ఈ సినిమా విడుదల చేసినప్పుడు శ్రీవల్లి పాత్రకు అక్కడి జపాన్ ఆడియన్స్ ఫిదా అయిపోయారు. ఆమెకు విపరీతమైన ఫాలోయింగ్ కూడా వచ్చేసింది. ఈ నేపథ్యంలోనే అక్కడి సోషల్ మీడియా ఫాలోయింగ్ చూసి నిర్వాహకులు ఈమెను వరుసగా మళ్లీ ఆహ్వానించినట్లు తెలుస్తోంది . ఏది ఏమైనా భారతీయ నటీమణులు ఇలా గ్లోబల్ స్టార్లుగా ఎదుగుతున్నారు అనడానికి రష్మిక మరో ఉదాహరణగా నిలిచింది అని చెప్పవచ్చు. ఇప్పటికే ఆస్కార్ వేదికపై ప్రియాంక చోప్రా రెండవసారి కనిపించి సంచలనం సృష్టించింది.

## ఆస్కార్ చరిత్రలోనే ఫస్ట్ మూవీ.. మన శేష్ కు నచ్చలేదా?




ఆస్కార్ రేసులో రీసెంట్ గా సంచలనం సృష్టించిన సిన్నర్స్ సినిమాపై టాలీవుడ్ యంగ్ అండ్ టాలెంటెడ్ హీరో అడివి శేష్ చేసిన కామెంట్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్ గా మారాయి. భారీ అంచనాలతో, రికార్డు స్థాయిలో నామినేషన్లతో చర్చల్లో నిలిచిన ఆ సినిమా గురించి అడివి శేష్ చెప్పిన అభిప్రాయం చర్చనీయాంశమైంది. అసలేం జరిగిందంటే? ర్యాన్ కూగ్లర్ దర్శకత్వంలో తెరకెక్కిన సిన్నర్స్ చిత్రం ఆస్కార్ అవార్డ్స్ లో చరిత్ర సృష్టించిన సంగతి తెలిసిందే. ఉత్తమ చిత్రం, ఉత్తమ దర్శకుడు, ఉత్తమ నటుడు, ఉత్తమ ఎడిటింగ్, ప్రొడక్షన్ డిజైన్ వంటి ప్రధాన విభాగాలతో కలిపి మొత్తం 16 నామినేషన్లు దక్కించుకుని ప్రత్యేక గుర్తింపు పొందింది. ఇంతకుముందు 14 నామినేషన్లతో ఉన్న సినిమాల రికార్డును ఈ చిత్రం అధిగమించడం విశేషం. దీంతో ఆస్కార్ చరిత్రలో అత్యధిక నామినేషన్లు సాధించిన తొలి చిత్రంగా సిన్నర్స్ నిలిచింది. హారర్ థ్రిల్లర్ గా రూపొందిన ఆ సినిమాలో ప్రముఖ హాలీవుడ్ నటుడు మైఖేల్ బి జోర్డాన్ ప్రధాన పాత్ర పోషించారు. స్మోక్, స్టాక్ అనే కవల సోదరుల జీవితాల చుట్టూ తిరిగే కథలో థ్రిల్లింగ్ ట్విస్టులు, సస్పెన్స్ ఎలిమెంట్స్ ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకున్నాయి. ఆ కారణంగానే సినిమా అంతర్జాతీయంగా మంచి గుర్తింపు తెచ్చుకుంది. అయితే ఆ చిత్రంపై అడివి శేష్ భిన్నమైన అభిప్రాయం వ్యక్తం చేశారు. తన రాబోయే చిత్రం డెకాయిట్ ప్రమోషన్స్ లో భాగంగా మాట్లాడిన ఆయనకు సిన్నర్స్ అంతగా నచ్చలేదని స్పష్టం చేశారు. ఆ సినిమా ద్వారా దర్శకుడు ఏం చెప్పాలనుకున్నారో తనకు స్పష్టంగా అర్థం కాలేదని తెలిపారు. ఇది వాంపైర్ స్టోరీనా, లేక జాతి వివక్షపై కామెంటా, లేదా నల్లజాతిపై ఏదైనా సందేశమా అన్నది కన్ఫ్యూజ్ గా అనిపించిందని చెప్పారు.

## రక్షిత లేటెస్ట్ లుక్ వైరల్.. ఫ్యాన్స్‌కు బిగ్ సర్ప్రైజ్




రవితేజ 'ఇడియట్' సినిమా గుర్తుందా? అందులో రవితేజ వెంటపడే ఆ గ్రీకు సుందరి రక్షితను ఎవరూ మర్చిపోలేరు. మహేశ్‌బాబు, నాగార్జున, ఎన్టీఆర్ వంటి టాప్ హీరోలతో జోడీ కట్టి ఒకప్పుడు సౌత్ ఇండియాను ఊపేసిన ఈ స్టార్ హీరోయిన్, ఇప్పుడు ఎలా ఉందో తెలిస్తే మీరు ఆశ్చర్యపోతారు. చాలా కాలం తర్వాత లేటెస్ట్ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతుండటంతో అభిమానులు షాక్‌కు గురవుతున్నారు. వెండితెరకు దూరమైన రక్షిత ప్రస్తుత జీవితం, ఆమె లుక్ వెనుక ఉన్న అసలు కారణాలు ఇప్పుడు హాట్ టాపిక్ అయ్యాయి. ఆ వివరాలు చూద్దాం.. రక్షిత అసలు పేరు శ్వేత. సినిమాల్లోకి వచ్చాక రక్షితగా మారింది. తండ్రి కొరియోగ్రాఫర్, తల్లి నటి కావడంతో ఆమెకు ఇండస్ట్రీ ఎంట్రీ ఈజీగానే దొరికింది. పునీత్ రాజ్‌కుమార్ సరసన కన్నడలో 'అప్పు' సినిమాతో మొదలైన ఆమె ప్రయాణం, తెలుగులో 'ఇడియట్'తో బ్లాక్ బస్టర్ హిట్ అందుకుంది. ఆ తర్వాత నాగార్జునతో 'శివమణి', మహేశ్‌బాబుతో 'నిజం', ఎన్టీఆర్‌తో 'ఆంధ్రావాలా' వంటి వరుస సినిమాలతో స్టార్ హీరోయిన్‌గా వెలిగిపోయింది. ఇక తెలుగు, కన్నడ భాషల్లో సమానంగా క్రేజ్ సంపాదించుకున్న అతికొద్ది మంది హీరోయిన్లలో రక్షిత ఒకరు. కెరీర్ పీక్ స్టేజ్‌లో ఉన్నప్పుడే రక్షిత ఒక సంచలన నిర్ణయం తీసుకుంది. 2007లో కన్నడ దర్శకుడు ప్రేమ్‌ను ప్రేమించి పెళ్లి చేసుకుంది. పెళ్లయ్యాక ఇక సినిమాల్లో నటించకూడదని నిర్ణయించుకుని వెండితెరకు పూర్తిగా దూరమైపోయింది. అయితే ఇక సినిమా రంగంపై ఉన్న మక్కువతో నిర్మాతగా మారి 'జోగయ్య', 'డీకే' వంటి చిత్రాలను నిర్మించింది. నటిగా కాకుండా తెర వెనుక ఉండి తన భర్త సినిమాలకు అండగా నిలిచింది. గ్లామర్ ప్రపంచానికి దూరంగా తన కుటుంబంతో కలిసి ప్రశాంతమైన జీవితాన్ని గడుపుతోంది. తాజాగా రక్షిత బర్త్ డే వేడుకలకు సంబంధించిన ఫోటోలు, వీడియోలు బయటకు వచ్చాయి. ఇందులో ఆమెను చూసి అభిమానులు ముక్కున వేలేసుకుంటున్నారు. ఒకప్పుడు నాజూగ్గా ఉన్న రక్షిత, ఇప్పుడు చాలా బొద్దుగా మారిపోయారు. ఇక ఆమెలో వచ్చిన ఈ మార్పు చూసి సోషల్ మీడియాలో రకరకాల చర్చలు మొదలయ్యాయి. అయితే దీనిపై ఆమె గతంలోనే క్లారిటీ ఇచ్చారు. కొడుకు పుట్టిన తర్వాత థైరాయిడ్ సమస్య రావడంతోనే తాను ఇలా బరువెక్కానని, ఇప్పుడు తాను హీరోయిన్ కాదు కాబట్టి నాజూగ్గా ఉండాల్సిన అవసరం లేదని ఆమె కుండబద్దలు కొట్టినట్లు చెప్పారు. నటనకు దూరమైనా రక్షిత బుల్లితెరపై మాత్రం సందడి చేస్తూనే ఉన్నారు. పలు కన్నడ రియాలిటీ షోలకు ఆమె జడ్జిగా వ్యవహరిస్తున్నారు. ఆమె తాజా లుక్ చూసి కొందరు నెటిజన్లు ఆశ్చర్యపోతున్నా, మరికొందరు మాత్రం ఆమె ఆత్మవిశ్వాసాన్ని మెచ్చుకుంటున్నారు. "మనుషులు అన్నాక వయసుతో పాటు మార్పులు సహజం, ఆమె ఇప్పటికీ తన నవ్వుతో అలరిస్తున్నారు" అంటూ కామెంట్స్ చేస్తున్నారు. ఇక ఏదేమైనా 'ఇడియట్' బ్యూటీ తన ఫ్యాన్స్‌కు ఒక బిగ్ సర్ప్రైజ్ ఇచ్చిందనే చెప్పాలి. ఐతే రూపం మారినా అభిమానుల గుండెల్లో రక్షిత స్థానం అలాగే ఉంది.



## నెల రోజులు నాని ఒళ్లు నలిగిపోతుందా!

నేచురల్ స్టార్ నాని కథానాయకుడిగా శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో -ది ప్యారడైజ్- షూటింగ్ శరవేగంగా జరుగుతోన్న సంగతి తెలిసిందే. -దసరా- లాంటి మాస్ హిట్ తర్వాత మళ్లీ అదే కాంబినేషన్ లో సినిమా కావడంతో అంచనాలు ఆకాశాన్నంటుతున్నాయి. తాజాగా ఈ సినిమా కోసం నాని గతంలో ఎన్నడూ లేని విధంగా తన శరీరాన్ని కష్టపెడుతున్నట్లు తెలుస్తోంది. సినిమాలోని కీలకమైన యాక్షన్ షెడ్యూల్ కోసం ఏకధాటిగా నెల రోజుల పాటు షూటింగ్ ప్లాన్ చేశారు. ఈ సుదీర్ఘమైన షెడ్యూల్‌లో పూర్తిగా భారీ యాక్షన్ సన్నివేశాలనే చిత్రీకరించనున్నట్లు చిత్ర యూనిట్ వర్గాల సమాచారం. ముఖ్యంగా సినిమా విరామానికి ముందు వచ్చే హై-వోల్టేజ్ యాక్షన్ సీక్వెన్స్‌లను ప్రస్తుతం షూట్ చేస్తున్నారు. ఈ సీన్లు వెండితెరపై ప్రేక్షకులకు రోమాంచిత అనుభూతిని కలిగిస్తాయని, నాని కెరీర్‌లోనే అత్యంత కష్టతరమైన ఫైట్స్ అని టాక్ వినిపిస్తోంది. ఈ పోరాట దృశ్యాల కోసం నాని ప్రత్యేకంగా శిక్షణ కూడా తీసుకుని బరిలోకి దిగినట్లు తెలుస్తోంది. సాధారణంగా నాని సినిమాలు ఎమోషన్స్ , కథా బలంతో సాగుతాయి. కానీ ది ప్యారడైజ్‌లో మాత్రం యాక్షన్ డోస్ ఎక్కువగా ఉండబోతోంది. ఎలాంటి డూప్ సహాయం లేకుండా చాలా వరకు రిస్కీ షాట్స్ నాని స్వయంగా చేస్తున్నారుట. ఈ క్రమంలో నాని ఒళ్లు నలిగిపోయేలా శ్రమిస్తున్నారని సెట్స్ నుండి అందుతున్న సమాచారం. గతంలో -దసరా- సినిమాలో భారీ యాక్షన్ సన్నివేశాల్లో నటించిన అనుభవం ఉండటంతో ఈసారి పని సులభమవుతుంది. శ్రీకాంత్ వర్కింగ్ స్టైల్ కూడా అలవాటైంది కాబట్టి పర్వాలేదు. శ్రీకాంత్ ఓదెల ఈ చిత్రాన్ని అత్యంత రా అండ్ రస్టిక్ గా తెరకెక్కిస్తున్నారు. 1990ల కాలం నాటి నేపథ్యంలో సాగే ఈ కథలో యాక్షన్ సన్నివేశాలు చాలా సహజంగా, వయొలెంట్‌గా ఉంటాయని సమాచారం. నాని మేకోవర్ కూడా ఈ సినిమా కోసం పూర్తిగా మారిపోయింది. గడ్డం, జుట్టు పెంచి ఒక ఊర మాస్ లుక్‌లో ఆయన కనిపిస్తున్నారు. ఈ క్యారెక్టర్ కోసం ఆయన పడుతోన్న శ్రమ చూసి చిత్ర యూనిట్ ఆశ్చర్యపోతోంది. విరామ సన్నివేశాలు సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయని ఆ పదిహేను నిమిషాల యాక్షన్ ఎపిసోడ్ థియేటర్లలో పూనకాలు తెప్పిస్తుందని మేకర్స్ ధీమా వ్యక్తం చేస్తున్నారు. మరి నాని తన కంఫర్ట్ జోన్ నుండి బయటకు వచ్చి చేస్తోన్న ఈ ప్రయోగం ఆయన అభిమానులకు విజువల్ ఫీస్ట్‌లా ఉండబోతోంది. నెల రోజుల పాటు, సాగే ఈ కఠినమైన యాక్షన్ షెడ్యూల్ అనంతరం సినిమా తదుపరి దశ పనుల్లోకి వెళుతుంది. తనను తాను కొత్తగా ఆవిష్కరించుకోవడంలో ఎప్పుడూ ముందుండే నాని -ది ప్యారడైజ్- తో మరోసారి తన త్తా చాటాలని గట్టి పట్టుదలతో ఉన్నారు.

# స్వయం ఉపాధి ఆన్ లైన్ దరఖాస్తుల పొడిగింపు

## ఎస్సీ కార్పొరేషన్ కార్యనిర్వాహక సంచాలకులు కె.శ్రీనివాసరావు



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మహబూబాబాద్ టౌన్, ఏప్రిల్ 04 : జిల్లా షెడ్యూల్డ్ కులముల సేవా సహకార అభివృద్ధి సంఘం లిమిటెడ్, మహబూబాబాద్ జిల్లా ద్వారా 2025-26 సంవత్సరానికి స్వయం ఉపాధి పథకాలకై ఆన్ లైన్ ద్వారా దరఖాస్తు చేయుటకు గడువు ఈ నెల 8 వరకు పొడిగించనైనదని ఎస్సీ కార్పొరేషన్ కార్యనిర్వాహక సంచాలకులు కె. శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన షెడ్యూల్డ్ కులములకు చెందిన యువతీ, యువకులు స్వయం ఉపాధి పథకాలకు కుటుంబ వార్షిక ఆదాయం (గ్రామీణ వాసులు రూ. 1,50,000, పట్టణ వాసులకు రూ. 2,00,000లకు లోబడిన, నాన్ అగ్రికల్చర్ సెక్టార్ పథకాలకు 21-50 సంవత్సరాల మధ్య వారు అర్హులని, అగ్రికల్చర్ సెక్టార్ పథకాలకు 21-60 సంవత్సరాల మధ్య వారు అర్హులని తెలిపారు. స్కిల్ డెవలప్మెంట్ ట్రైనింగ్ పథకంలో భాగంగా స్వయం ఉపాధి 18-45 సంవత్సరాల మధ్య వారు అర్హులని పేర్కొన్నారు. దినసరి వేతనం పొందే వారికీ వయస్సు 18-35 సంవత్సరాలు ఉండవలెనని అన్నారు. గత 5 సంవత్సరాలలో ఎస్సీ కార్పొరేషన్ నుండి లబ్ది పొందిన కుటుంబాల వారు అనర్హులని తెలిపారు. ఇట్టి యాక్షన్ ప్లాన్ 2025-26 లో భాగంగా వివిధ రకాల యూనిట్స్ మంజూరు చేయబడునని, ఎలక్ట్రిక్ టూ వీలర్ యూనిట్ విలువ రూ.1.00 లక్ష, 90% సబ్సిడీ, 10% బ్యాంకు ఋణం, ఎలక్ట్రిక్ (త్రీ వీలర్ యూనిట్ విలువ రూ.3.00 లక్షలు, 70% సబ్సిడీ, 30% బ్యాంకు ఋణం, సోలార్ పంప్ సెట్ యూనిట్ విలువ 3.00 నుండి రూ.7.00 లక్షలు, 100% సబ్సిడీతో, పాడి పశువులు (02) లకు గాను యూనిట్ విలువ 2.40 లక్షలు, 70% సబ్సిడీ, 30% బ్యాంకు ఋణంతో కలవు. ఇట్టి యూనిట్లకు ధరఖాస్తు చేసుకోడానికి కుల, ఆదాయ, నివాస ధృవీకరణ ప(తాలు, ఆదార్ కార్డు, రేషన్ కార్డు, పాస్ పోర్ట్ సైజు పోటో, పట్టాదారు పాసు పుస్తకం (వ్యవసాయ సంబందిత యూనిట్లకు), (డ్రైవింగ్ లైసెన్సు (రవాణా రంగం యూనిట్లకు) మరియు పాడి పశువులు యూనిట్ కొరకు (0.10 గుంటల సాగు భూమి తప్పనిసరి) తదితర ధృవ ప(తాలతో 08-04-2026 వరకు ఆన్ లైన్ (www.tgobmms.cgg.gov.in) నందు దరఖాస్తు చేసుకొని, వెంటనే సదరు దరఖాస్తును సంబందిత ధృవ పత్రలతో (హార్డ్ కాపీ) (గామీణ (ప్రాంతం వారు సంబందిత వీూణా కార్యాలయము నందు, పట్టణ ప్రాంతం వారు సంబందిత మునిసిపాలిటి కార్యాలయము నందు సమర్పించవలసినదిగా తెలియపరచనైనది. ఈ అవకాశాన్ని అర్హులైన ఎస్సి నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోగలరని ఈ సందర్భంగా అధికారి కోరారు.

# మక్కలకు మద్దతు ధర ప్రకటించి చేతులు దులుపుకుంటున్న కేంద్రం

- రాష్ట్ర ప్రభుత్వం మద్దతు ధరకు కొని 10 వేల కోట్ల నష్టాల్లో ఉంది
- మొక్క జొన్న కొనుగోలు కేంద్రంను ప్రారంభించిన ఎమ్మెల్యే




(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జగిత్యాల, ఏప్రిల్ 04 : కేంద్ర ప్రభుత్వం మక్కలకు మద్దతు ధర ప్రకటించి చేతులు దులుపుకుంటుందని, రాష్ట్ర ప్రభుత్వం మార్క్ ఫెడ్ ద్వారా మద్దతు ధరకు కొని 10 వేల కోట్ల నష్టాల్లో ఉందని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు. శనివారం తెలంగాణ రాష్ట్ర మార్క్ ఫెడ్ కరీంనగర్ జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ లిమిటెడ్ ఆద్వర్యంలో జగిత్యాల వ్యవసాయ మార్కెట్ లో మొక్కజొన్న కొనుగోలు కేంద్రంను జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి కొంత ఇబ్బందిగా ఉన్నా.. అన్ని సంక్షేమ పథకాలను ప్రభుత్వం అమలు చేయడం జరుగుతుందన్నారు. జిల్లాలో 46 వేల ఎకరాల్లో, నియోజకవర్గం 14 వేల ఎకరాల్లో రైతులు మొక్క జొన్న పంట సాగు చేశారని, రైతులకు ఇబ్బంది లేకుండా వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కోరగానే, సానుకూలంగా స్పందించి మక్కల కొనుగోలు కేంద్రాలు మంజూరు చేయటం జరిగిందన్నారు. కేంద్రం మద్దతు ధర 2400 గా పెట్టినా కేంద్రం మక్కలు కొనుగోలు చేయటం లేదని, మొక్కజొన్న పంట కేంద్రం కొనుగోలు చేసి, మద్దతు ధర అందజేయాలన్నారు. తెలంగాణ మార్క్ ఫెడ్ 10 వేల కోట్ల నష్టాల్లో ఉందన్నారు. రైతు పక్షపాతి ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అని, రైతులు ఒకే రకమైన వరి లాంటి పంట కాకుండా ఇతర పంటల సాగుపై మొగ్గు చూపాలని కోరారు. ఆయిల్ ఫామ్ పంట సాగుతో లాభదాయకం అని, టన్నుకు 23 వేలతో రైతుకు లాభం కలుగుతుందని అన్నారు. అంతర్ పంటగా కోకో పిట్ కూడా వేసుకోవచ్చని, ఫామ్ ఆయిల్ పంట సాగుతో ఫామ్ ఆయిల్ ధర నేడు బంగారంలా ఉందని, ప్రపంచ మార్కెట్ లో రూపాయి విలువ తగ్గిందని, మన దేశంలో 01 లక్ష కోట్ల ఆయిల్ దిగుమతులు జరుగుతున్నాయని తెలిపారు. రైతులు దేశానికి వెన్నెముక అని, ఇతర పంటల సాగుపై రైతులు ఆలోచన చేయాలని దేశంపై దిగుమతుల భారం తగ్గించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ సమీండ్ల వాణి శ్రీనివాస్, ఏఎంసీ ఛైర్మెన్ గడ్డం నారాయణరెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ గిరి నాగభూషణం, మాజీ వైస్ చైర్మన్ గోలి శ్రీనివాస్ మాజీ ఏఎంసీ ఛైర్మెన్ నక్కల రవీందర్ రెడ్డి, మార్కెటింగ్ ఏడి ప్రకాష్, డిఏవో భాస్కర్, మార్క్ ఫెడ్ డీఎం హబీబ్ ఎమ్మార్వో రామ్మోహన్, ఏఎంసీ వైస్ చైర్మన్ సయ్యద్ అఖిల్, చిక్కులభూమయ్య, మహేశ్వర్ రావు, బాలె శంకర్, సురేందర్ నాయక్, ఏఎంసీ డైరెక్టర్ లు, కౌన్సిలర్లు, సర్పంచులు, నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# రామగుండంలో భక్తిశ్రద్ధలతో 'రన్ ఫర్ జీసస్'

- శాంతి, ప్రేమలే మార్గమని చాటిన క్రైస్తవ సోదరులు - పావురాలను గాలిలోకి ఎగురవేసి ర్యాలీని ప్రారంభించిన మేయర్ - 5 ఇన్క్లైన్ నుంచి గోదావరిఖని చౌరస్తా వరకు ఆధ్యాత్మిక శోభ
- లోక కల్యాణం కోసం చౌరస్తాలో ప్రత్యేక ప్రార్థనలు



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

గోదావరిఖని టౌన్, ఏప్రిల్ 04 : సమాజంలో శాంతి, ప్రేమ, ఐక్యతను పెంపొందించడమే లక్ష్యంగా రామగుండం నియోజకవర్గంలో శనివారం 'రన్ ఫర్ జీసస్' కార్యక్రమం వైభవంగా జరిగింది. ఇంటర్ డినామినేషనల్ పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ర్యాలీలో వందలాది మంది క్రైస్తవులు, దైవజనులు ఉత్సాహంగా పాల్గొన్నారు. శనివారం తెల్లవారుజామున 5 ఇన్క్లైన్ చౌరస్తా వద్దకు చేరుకున్న క్రైస్తవ సమూహంతో ఆ ప్రాంతమంతా ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మహంకాళి స్వామి ముఖ్య అతిథిగా హాజరై, ప్రార్థనల అనంతరం శాంతికి ప్రతీకగా పావురాలను గాలిలోకి ఎగురవేసి ర్యాలీకి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ క్రీస్తు చూపిన ప్రేమ, శాంతి మార్గాలు సమాజానికి దిక్సూచి అని, శాంతియుత సమాజ నిర్మాణంలో క్రైస్తవ సమాజం ఎల్లప్పుడూ కీలక పాత్ర పోషిస్తుందని కొనియాడారు. 5 ఇన్క్లైన్ నుంచి ప్రారంభమైన ఈ రన్, పట్టణంలోని ప్రధాన రహదారుల గుండా సాగి గోదావరిఖని చౌరస్తాకు చేరుకుంది. దారిపొడవునా భక్తి గీతాలు ఆలాపిస్తూ, దేవుని సువార్త సందేశాలను చాటిచెప్పారు. వివిధ చర్చిలకు చెందిన పాస్టర్లు, నాయకులు, మహిళలు, యువత అధిక సంఖ్యలో పాల్గొని తమ ఐక్యతను చాటారు. ర్యాలీ ముగింపులో గోదావరిఖని చౌరస్తా వద్ద భారీ బహిరంగ ప్రార్థన నిర్వహించారు. పట్టణ ప్రజల క్షేమం, శాంతి స్థాపన, సమాజ శ్రేయస్సు కోరుతూ పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. దేవుని కృప ప్రతి ఇంటికీ చేరాలని దైవజనులు ఆకాంక్షించారు. ఇంకా ఈ కార్యక్రమంలో ఐపీఎఫ్ జిల్లా అధ్యక్షులు పాస్టర్ ఎం.మహిపాల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి డిలైట్ నతానియేల్ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ దాస్, జాయింట్ సెక్రటరీ ప్రజార్షి, ట్రెజరర్ థామస్, ఎగ్జిక్యూటివ్ సభ్యులు రవివర్మ, ప్రసన్న, ప్రభాకర్, ఎఫ్రాయిమ్, శాంతిరాజు, సీనియర్ దైవజనులు మేరక్క, ఐజయ్య, నిరీక్షణ్, రాయప్ప రెడ్డి, నాయకులు జిమ్మీ బాబు, దయానంద్ గాంధీ తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణిలో రాజకీయ దోపిడీ పునాదులు పెకిలించాలి

- బకాయిల వసూళ్లలో యాజమాన్య నిర్లక్ష్యం దుర్మార్గం
- మెడికల్ బోర్డు/కారుణ్య నియామకాలు ఆపే అధికారం ఎవరికీ లేదు.
- బిఎంఎస్ నేత అప్పాని శ్రీనివాస్



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

గోదావరిఖని టౌన్, ఏప్రిల్ 4 : సింగరేణిలో పెరుగుతున్న రాజకీయ జోక్యం, అవినీతిని అరికట్టేందుకు కార్మికులు ఐక్యంగా పోరాడాలని బిఎంఎస్ అనుబంధ సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంఘ్ (ఎస్.సి.ఎం.కె.ఎస్.) వర్కింగ్ ప్రెసిడెంట్ అప్పాని శ్రీనివాస్ పిలుపునిచ్చారు. సింగరేణి రామగుండం రీజియన్ అడ్రియాల లాంగ్వాల్ ప్రాజెక్టులో శనివారం ఉదయం మొదటి షిఫ్టులో ఆ సంఘం పిట్ సెక్రటరీ మీనుగు సంతోష్ అధ్యక్షతన నిర్వహించిన ద్వార సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని కార్మికులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సింగరేణిలో రాజకీయ దోపిడీ పునాదులు బలపడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. బొగ్గు, విద్యుత్ బకాయిలను వసూలు చేయడంలో సింగరేణి యాజమాన్యం నిర్లక్ష్యం చూపడం దుర్మార్గమని, సంస్థ నష్టాలకు యాజమాన్యమే బాధ్యత వహించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం కార్మిక సంఘాలు ఐక్యంగా పోరాటాలకు నాయకత్వం వహించాలని ఆయన సూచించారు. అయితే కొంతమంది సంఘాలు రాజకీయ ప్రయోజనాల కోసం వ్యవహరిస్తూ కార్మికుల ప్రయోజనాలను విస్మరిస్తున్నాయని విమర్శించారు. మెడికల్ బోర్డు, కారుణ్య నియామకాల ద్వారా ఉద్యోగాల కల్పన యాజమాన్య బాధ్యత అని, వాటిని నిలిపివేయడం క్షమించరాని చర్య అని పేర్కొన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న కార్మికుల కుటుంబాలకు ఉపాధి కల్పించడం ఎవరి దయాదాక్షిణ్యం కాదని, కోర్టుల తీర్పుల ప్రకారం ఇది తప్పనిసరి బాధ్యత అని గుర్తుచేశారు. సింగరేణికి రావాల్సిన బకాయిలు సంవత్సరానికొకసారి పెరుగుతున్నాయని, గత ప్రభుత్వాల హయాంలో వేల కోట్ల రూపాయల బకాయిలు పేరుకుపోయాయని తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వ కాలంలో కూడా విద్యుత్ బకాయిలు భారీగా పెండింగ్లో ఉన్నాయని ఆరోపించారు. అవుట్సోర్సింగ్ టెండర్లు, బదిలీలు, పర్చేస్ ఆర్డర్లు, డీఎంఎఫ్, సిఎస్ఆర్ నిధుల కేటాయింపుల్లో రాజకీయ జోక్యం అధికమవడంతో సింగరేణి పరిపాలన దెబ్బతిన్నదని అన్నారు. ఈ పరిస్థితులకు ముగింపు పలకడానికి కార్మికులు ఐక్యంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. సింగరేణి భవిష్యత్తు, కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం బిఎంఎస్ చేపడుతున్న పోరాటాలకు మద్దతు ఇవ్వాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో బీఎంఎస్ కోశాధికారి హరిన్, సెంట్రల్ సెక్రటరీ ఈముల సత్యనారాయణ, ఆర్జీ-3 ఉపాధ్యక్షులు అరుకాల ప్రసాద్, పెన్షనర్ అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ బాలయ్య, కాంట్రాక్టు మజ్దూర్ సంఘ్ సెక్రటరీ దాసరి శ్రీనివాస్, ఏరియా సహాయ కార్యదర్శి జాడి వెంకటేష్ తదితరులు, కార్మికులు పాల్గొన్నారు.

# ఫీజు రీయింబర్స్మెంట్పై హైకోర్టు వ్యాఖ్యలు బాధాకరం

- పెండింగ్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలి
- పిడిఎస్యూ రాష్ట్ర అధ్యక్షుడు డా.ఎస్.నాగేశ్వరరావు
- బిఎంఎస్ నేత అప్పాని శ్రీనివాస్




(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఖమ్మం, ఏప్రిల్ 4: ఫీజు రీయింబర్స్మెంట్పై హైకోర్టు చేసిన వ్యాఖ్యలు బాధాకరమని, పెండింగ్లో ఉన్న బకాయిలను సకాలంలో విడుదల చేయడంలో ప్రభుత్వాలు జాప్యం చేస్తున్నాయని జార్జి రెడ్డి పీడీఎస్యూ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఎస్. నాగేశ్వరరావు ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం ఖమ్మం ప్రెస్ క్లబ్లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఫీజు బకాయిల విడుదలలో ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల విద్యార్థుల విద్యాభవిష్యత్పై అనిశ్చితి నెలకొన్నదన్నారు. తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాలు దీని వ్యతిరేకంగా అనేక రోజులుగా ఆందోళనలు నిర్వహిస్తున్నప్పటికీ ప్రభుత్వం స్పందించడం లేదని విమర్శించారు. ప్రభుత్వాలు గడువులు ప్రకటిస్తూ కాలం గడుపుతున్నాయని, కానీ నిధులను విడుదల చేయడం లేదని పేర్కొన్నారు. సాధారణంగా కోర్టులు ప్రభుత్వాలను బాధ్యతాయుతంగా వ్యవహరించేలా ఆదేశాలు ఇస్తాయని, అయితే తాజా తీర్పు విద్యార్థులపై అదనపు భారం మోపేలా ఉందని అభిప్రాయపడ్డారు. ప్రభుత్వం హామీ ఇచ్చిన ఫీజు రీయింబర్స్మెంట్ను విడుదల చేయకపోతే, ముందస్తుగావిద్యార్థుల నుంచి ఫీజులు వసూలు చేసుకునేందుకు ప్రైవేట్ కళాశాలలకు అనుమతి ఇవ్వడం పేద విద్యార్థులపై భారమవుతుందని విమర్శించారు. ఈ తీర్పును పునఃసమీక్షించి, ప్రభుత్వం తక్షణమే బకాయిలను విడుదల చేసేలా ఆదేశించాలని న్యాయస్థానాన్ని కోరారు. రాష్ట్రంలో సుమారు రూ. 10,000 కోట్ల ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్షిప్ నిధులు పెండింగ్లో ఉన్నాయని, దీని వల్ల లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్ సంక్షోభంలో పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యా రంగంపై ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించి, విద్యార్థుల హక్కులను పరిరక్షించాలని డిమాండ్ చేశారు. పెండింగ్లో ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్షిప్ నిధులను వెంటనే విడుదల చేయాలని ఆయన కోరారు.



# మొక్కజొన్న రైతులకు ఇబ్బందులు లేకుండా కొనుగోళ్లు నిర్వహించాలి

- జిల్లాలో 1, లక్ష 30 వేల ఎకరాలలో మొక్క జొన్న పంట సాగు
- జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ స్నేహ శబరీష్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మహబూబాబాద్ టౌన్, ఏప్రిల్ 04 : జిల్లాలోని మొక్కజొన్న రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వ నిబంధనల ప్రకారం మద్దతు ధర కల్పిస్తూ కొనుగోళ్లలో ఎలాంటి జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. శనివారం మహబూబాబాద్ పట్టణం ఇల్లందు రోడ్డు లోని వ్యవసాయ మార్కెట్ ను ఆకస్మికంగా తనిఖీ చేశారు,ఈ సందర్భంగా రైతులు, మార్కెటింగ్,వ్యవసాయ, సంబంధిత అధికారులతో కలెక్టర్ స్వయంగా మాట్లాడారు. జిల్లాలో ఈ సంవత్సరం 1లక్ష 30 వేల ఎకరాలలో మొక్కజొన్న సాగు జరిగిందని, సుమారు లక్ష ఎకరాల మొక్కలు కొనుగోలుకు వస్తున్నాయని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మార్కెట్లో అన్ని వసతులు సౌకర్యాలు కల్పిస్తూ వచ్చిన మొక్కజొన్నలో నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ కొనుగోలు చేయాలని, మద్దతు ధర 2400 రూపాలయలు చెల్లించాలని రైతుల వివరాలు ఆన్లైన్లో నమోదు చేసి ఈ నామ్ విధానం ద్వారా కొనుగోలు చేయాలన్నారు. పెసర్లు, మినుములు, వేరుశనగ, తదితర పంటల వైపు రైతులకు అవగాహన కల్పించాలని ఈ పంటల ద్వారా ప్రస్తుతం మార్కెట్లో అధిక ధరలు పలుకుతున్నందున రైతులు లాభాలలో ఉంటారని అన్నారు. సంబంధిత శాఖల అధికారులు రైతులకు అవగాహన కల్పించాలని మార్కెట్లో అవసరాలకు అనుగుణంగా సిబ్బందిని నియమించుకోవడం కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలని, మార్కెట్లో అంతర్గత సౌకర్యాలను అభివృద్ధి పనులను పూర్తి చేయాలని సూచించారు. కలెక్టర్ వెంట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఇస్లావత్ సుధాకర్, వైస్ చైర్మన్ మదన్ గోపాల్ లోయ, వ్యవసాయ మార్కెట్ కమిటీ సెక్రటరీ సుజన్ బాబు, వ్యవసాయ శాఖ అధికారిని సరిత, ఏడిఏ శ్రీనివాసరావు, మార్కెటింగ్ శాఖ డిఎం వెంకటేశ్వర్లు, ఏఓ తిరుపతిరెడ్డి, తదితరులు ఉన్నారు.

# ముత్తంగి డివిజన్ కాలనీల్లో మౌలిక వసతుల కల్పనే మా ప్రథమ ప్రాధాన్యత

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి - మాజీ జెడ్పీటీసీ శ్రీకాంత్ గౌడ్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



పటాన్చెరు, ఏప్రిల్ 4 : ముత్తంగి డివిజన్ పరిధిలోని నూతన కాలనీలలో మౌలిక వసతుల కల్పనకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తామని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి, పటాన్చెరు మండల ఇంచార్జ్, మాజీ జెడ్పీటీసీ గడీల శ్రీకాంత్ గౌడ్ స్పష్టం చేశారు. ముత్తంగి డివిజన్ పరిధిలోని న్యూ టౌన్ కాలనీ, డి.ఎన్ కాలనీ, మనీ సాయి వెంచర్, సాయి ప్రియ కాలనీలలో వారు శనివారం విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీల్లోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. శిథిలావస్థకు గతంలో కాలనీలు ఏర్పడిన సమయంలో నిర్మించిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీలు, సీసీ రోడ్లు ప్రస్తుతం పూర్తిగా దెబ్బతిన్నాయని, దీనివల్ల తాము తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని కాలనీ వాసులు ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకువచ్చారు. స్థానికుల సమస్యలపై స్పందించిన ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి, శ్రీకాంత్ గౌడ్ అక్కడికక్కడే అధికారులతో సమావేశమయ్యారు. కాలనీల్లో కొత్తగా సీసీ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీల నిర్మాణానికి వెంటనే ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో పటాన్చెరు డిప్యూటీ కమిషనర్ జ్యోతి రెడ్డి,ఇ.సురేష్ ,మాజీ సర్పంచ్ ఉపేందర్, బీఆర్ఎస్వీ నాయకులు మేరాజ్ ఖాన్, డివిజన్ అధ్యక్షులు రామకృష్ణ, సీనియర్ నాయకులు సిల్వేరి శ్రీనివాస్, బబుల్ రెడ్డి, శ్రీనివాస్ గుప్త , కుమార్ గౌడ్, కిట్టు, సందీప్,అబేద్, యాదగిరి, లక్ష్మి కాంత్ రెడ్డి పెద్ద సంఖ్యలో కాలనీ వాసులు పాల్గొన్నారు.

# టెస్కో అమలు చేస్తున్న టెండర్ విధానాన్ని రద్దు చేయాలి

- ఈ విధానం వల్ల చేనేత కార్మికుల ఉపాధి దెబ్బతింటుంది
- పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడు క్యాతం సతీష్ కుమార్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



జయశంకర్-భూపాలపల్లి, ఏప్రిల్ 4 : టెస్కోఅమలు చేస్తున్న టెండర్ విధాన రద్దు చేయాలని, ఈ విధానం వలన చేనేత కార్మికుల ఉపాధి దెబ్బతింటుందని పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడు సతీష్ కుమార్ అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో వేలాది కుటుంబాలకు ఆధారమైన చేనేత పరిశ్రమ ప్రస్తుతం తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటోందని పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షులు క్యాతం సతీష్ కుమార్, చేనేత సంఘం జిల్లా అధ్యక్షులు మాచెర్ల మహేందర్ తెలిపారు. ఈ సందర్భంగా భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావును కలిసి సమస్యలపై వినతి పత్రం సమర్పించారు. ప్రస్తుతం టెస్కో అమలు చేస్తున్న టెండర్ విధానం కారణంగా ధరల పోటీ పెరిగి, మధ్యవర్తులు తక్కువ ధరలకు పనులు దక్కించుకుంటున్నారని పేర్కొన్నారు. దీనివల్ల చేనేత కార్మికులకు తగిన కూలి అందక వారి జీవనోపాధి దెబ్బతింటోందని ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా, ఈ విధానం వల్ల చిన్న చేనేత సహకార సంఘాలు పోటీలో నిలవలేక ఆర్థికంగా బలహీనపడుతున్నాయని, యువత ఈ వృత్తి నుంచి దూరమవుతున్నారని తెలిపారు. ఇది కొనసాగితే సంప్రదాయ చేనేత వృత్తి కనుమరుగయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు. కాబట్టి, చేనేత కార్మికులకు న్యాయమైన పారితోషికం కల్పించేలా, సహకార సంఘాలకు ప్రాధాన్యత ఇచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ముఖ్యంగా టెస్కో టెండర్ విధానాన్ని తక్షణమే పునఃపరిశీలించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమస్యపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో చర్చించి చేనేత కార్మికులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో చేనేత సంఘం జిల్లా అధ్యక్షులు మాచర్ల మహేందర్, పద్మశాలి సంఘం నాయకులు భాగవతం బిక్షపతి, రాజేష్, రవీందర్, పల్లవేని సంపత్, పెంట రంజిత్ కుమార్, పెంట వేణు, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

# సంబంధిత పత్రాలు పూర్తిగా ఉంటేనే దరఖాస్తులు స్వీకరణ

## మీసేవ కేంద్రాల నిర్వాహకులకు ఎమ్మార్వో వై. శ్రీనివాసులు హెచ్చరిక

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



జయశంకర్-భూపాలపల్లి, ఏప్రిల్ 4 : సంబంధిత ధ్రువీకరణ పత్రాలు పూర్తిగా ఉన్నప్పుడే మీసేవ కేంద్రాల ద్వారా దరఖాస్తులు స్వీకరించాలని భూపాలపల్లి ఎమ్మార్వో వై. శ్రీనివాసులు సూచించారు. ఈ మేరకు ఆయన శనివారం ఒక పత్రికా ప్రకటనలో స్పష్టం చేశారు. భూపాలపల్లి మండలంలోని మీసేవ కేంద్రాల నిర్వాహకులు ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ఆయన పేర్కొన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇటీవల నిబంధనలు పాటించకుండా అక్రమాలకు పాల్పడిన మంజూర్ నగర్లోని "సంతోష్ కమ్యూనికేషన్" మీసేవ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ రద్దు చేసినట్లు తెలిపారు. ఆ కేంద్ర నిర్వాహకులపై కేసు కూడా నమోదు చేసినట్లు వెల్లడించారు. మీసేవ కేంద్రాల ద్వారా సమర్పించబడుతున్న దరఖాస్తులను అధికారులు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారని చెప్పారు. అందువల్ల, దరఖాస్తులకు అవసరమైన అన్ని ధ్రువీకరణ పత్రాలు పూర్తిగా సిద్ధంగా ఉన్నప్పుడే మీసేవ కేంద్రాల్లో దరఖాస్తులు చేసుకోవాలని అయన ప్రజలకు సూచించారు.

# అథ్లెటిక్స్ పోటీల ద్వారా ప్రతిభావంతులైన క్రీడాకారులు వెలుగులోకి వస్తారు

## జిల్లా క్రీడల అధికారి ఎం. పరంధామిరెడ్డి



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భద్రాద్రి–కొత్తగూడెం, ఏప్రిల్ 4 : అథ్లెటిక్స్ పోటీల నిర్వహణ ద్వారా ప్రతిభావంతులైన క్రీడాకారులు వెలుగులోకి వస్తారని జిల్లా క్రీడల అధికారి ఎం. పరంధామిరెడ్డి తెలిపారు. భద్రాద్రి–కొత్తగూడెం జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో, కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని సింగరేణి ప్రాంతం రామవరం సాధన గ్రౌండ్లో నిర్వహిస్తున్న జిల్లా సీనియర్ అథ్లెటిక్స్ ఎంపికలను శనివారం ఆయన ప్రారంభించారు. ఒలింపిక్ జెండాను ఊపి పరుగు పందెం పోటీలకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, జిల్లాలో ప్రతిభ కలిగిన అథ్లెట్లు అధికంగా ఉన్నారని, క్రమబద్ధమైన పోటీలు, శిక్షణ ద్వారా వారు రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఛాంపియన్లుగా ఎదిగే అవకాశం ఉందన్నారు. క్రీడాకారులకు అవసరమైన సౌకర్యాల కల్పనకు తన వంతు కృషి చేస్తున్నానని తెలిపారు. గత రెండేళ్లుగా జిల్లా అథ్లెట్లు రాష్ట్ర సీఎం కప్ ఛాంపియన్‌షిప్‌లో విజయాలు సాధించడం గర్వకారణమని పేర్కొన్నారు. బహుమతి ప్రధానోత్సవానికి 17వ డివిజన్ కార్పొరేటర్ ఎర్రవెల్లి శంకర్ అధ్యక్షత వహించి, సాధన గ్రౌండ్ అభివృద్ధికి కృషి చేస్తానని, త్వరలో గ్యాలరీ నిర్మాణం కోసం చర్యలు తీసుకుంటానని తెలిపారు. 14వ డివిజన్ కార్పొరేటర్ కూరపాటి సుధాకర్ రాజు క్రీడల అభివృద్ధికి ఎల్లప్పుడూ సహకరిస్తానని చెప్పారు. 15వ డివిజన్ కార్పొరేటర్ ఆకునూరి సుప్రియ మాట్లాడుతూ, ఎండలను లెక్కచేయకుండా మహిళా క్రీడాకారులు అధిక సంఖ్యలో పాల్గొనడం అభినందనీయమని, రాష్ట్ర స్థాయి పోటీల్లో కూడా విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. 16వ డివిజన్ కార్పొరేటర్ మునిగడప పద్మ మాట్లాడుతూ వేసవి శిక్షణ శిబిరాలను వినియోగించుకుని బాలబాలికలు క్రీడల్లో ముందుకు రావాలని సూచించారు. జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి కే. మహీధర్ మాట్లాడుతూ, ఈ నెల 11న హనుమకొండలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు జిల్లా నుంచి 20 మంది క్రీడాకారులను ఎంపిక చేస్తామని తెలిపారు. జిల్లా జాయింట్ సెక్రటరీ డి.మల్లికార్జున్, కోచ్ రియాజ్ పాషా ఆధ్వర్యంలో జరిగిన ఈ ఎంపికల్లో అథ్లెటిక్స్ కోచ్‌లు జొన్నగిరి ప్రసాద్, పవన్, పీడీ శ్వేతలు పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రామవరం వర్తక సంఘం ప్రతినిధులు జాకీర్, సుభాష్, ముస్తఫా క్రీడాకారులకు స్నాక్స్ అందజేశారు.

# క్రీడలు ఆరోగ్యానికి మేలు - దేహదారుఢ్యం, మానసికోల్లాసం పెరుగుతాయి

## రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర




(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భద్రాద్రి–కొత్తగూడెం, ఏప్రిల్ 4 : ఆటల పోటీల్లో పాల్గొనడం ద్వారా దేహదారుఢ్యం పెరగడంతో పాటు మానసిక ఉల్లాసం కలుగుతుందని, తద్వారా వ్యక్తులు మరింత ఆరోగ్యవంతులవుతారని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర తెలిపారు. శనివారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని ప్రగతి మైదానంలో నిర్వహించిన "గాయత్రి క్రికెట్ ఛాంపియన్స్ ట్రోఫీ–2026"ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానిక యువకులు బాణసంచా పేల్చి, డప్పు వాయిద్యాలతో ఘన స్వాగతం పలికారు. కార్యక్రమం ప్రారంభానికి ముందు ఎంపీ రవిచంద్రతో పాటు బీఆర్ఎస్ నాయకులు దిండిగల రాజేందర్, వనమా రాఘవ, కాపు సీతామహాలక్ష్మీ, మున్నూరుకాపు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆకుల గాంధీ తదితరులు అమరవీరుల స్థూపానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎంపీ టాస్ వేసి, బ్యాటింగ్ చేసి పోటీలను ప్రారంభించారు. నిర్వాహకులు బీ. శ్రీనివాస్, కన్నిలు క్రికెట్ జట్టు సభ్యులను ఆయనకు పరిచయం చేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ, అంతర్జాతీయ క్రికెట్‌లో భారత జట్టు అత్యుత్తమ ప్రతిభ కనబరుస్తోందని ప్రశంసించారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని, ఈ రంగంలో కూడా మంచి అవకాశాలు ఉన్నాయని సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఏనుగుల రాకేష్ రెడ్డి, రంగనాథ్, బాదావత్ శాంతి నాయక్, కార్పొరేటర్లు మల్హోత్రా సాగర్, సింధూ తపస్వి, నాయకులు బొమ్మిడి రమాకాంత్, బాదావత్ శ్రీకాంత్, నవతన్, బొమ్మిడి శ్రీకాంత్, అనుదీప్ తదితరులతో పాటు వందలాది యువకులు పాల్గొన్నారు.

# సింగరేణిలో సహజ మరణానికి కూడా 10 లక్షల ఉచిత బీమా పథకం అమలు

## - యాజమాన్యం చొరవతో యూనియన్ బ్యాంక్ నిర్ణయం - ఈ నెల 1వ తేదీ నుండి అమలు

(ప్రజాలక్ష్యం ప్రత్యేక ప్రతినిధి)

హైదరాబాద్, ఏప్రిల్ 4 : ఇప్పటివరకు సింగరేణిలో కోటి రూపాయల ప్రమాద బీమా పథకాన్ని అమలు చేస్తున్న యూనియన్ బ్యాంక్ సింగరేణి యాజమాన్యం చేసిన సూచనల మేరకు సహజ మరణం చెందిన కార్మికులకు కూడా ఉచిత బీమా సౌకర్యాన్ని కల్పించాలని నిర్ణయించింది. యూనియన్ బ్యాంకులో కార్పొరేట్ శాలరీ అకౌంటు కలిగి ఉన్న కార్మికులు లేదా అధికారులు ఎవరైనా సరే మృతి చెందినట్లయితే వారికి పది లక్షల రూపాయల బీమా సౌకర్యాన్ని వర్తింప జేస్తూ నిర్ణయం తీసుకున్నట్లు సింగరేణి సంస్థకు బ్యాంకు యాజమాన్యం తెలియజేసింది. సింగరేణి సంస్థ ఛైర్మన్ మరియు ఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి ఆదేశాల మేరకు డైరెక్టర్ పర్సనల్ మరియు ఫైనాన్సు శ్రీ గౌతమ్ పోట్రు ప్రత్యేక చొరవ ఫలితంగా యూనియన్ బ్యాంకు యాజమాన్యం ఈ నిర్ణయం తీసుకుంది. ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి ఇది అమలులోకి రానున్నట్లు బ్యాంకు యాజమాన్యం పేర్కొంది. 2024 లో రాష్ట్ర ప్రభుత్వం చొరవతో సింగరేణి కార్మికులకు ఉచిత కోటి రూపాయల ప్రమాద బీమా పథకాన్ని యూనియన్ బ్యాంకు అమలు జరిపింది. ఈ ఒప్పందానికి కొనసాగింపుగా సహజ మరణానికి కూడా 10 లక్షల రూపాయలబీమాను వర్తింపజేస్తూ నిర్ణయించినట్లు యూనియన్ బ్యాంకు అధికారులు పేర్కొన్నారు. ఇతర ఇన్సూరెన్స్ కంపెనీలలో 10 లక్షల బీమాపాలసీ తీసుకోవాలంటే కనీసం ఐదు వేలకు పైగా చెల్లించాల్సి ఉంటుంది. అయితే సింగరేణి యాజమాన్యం తీసుకున్న ప్రత్యేక చొరవ వల్ల ఒక్క పైసా కూడా చెల్లించాల్సిన అవసరం లేకుండా యూనియన్ బ్యాంకు సహజ మరణానికి 10 లక్షల బీమా పథకాన్ని అమలు జరిపింది. దీనిపై సర్వత్ర హర్షం వ్యక్తం అవుతున్నది. కాగా సింగరేణి సంస్థలో కోటి రూపాయల ఉచిత ప్రమాద బీమా సౌకర్యాన్ని అమలు జరుపుతున్న ఇతర బ్యాంకులు కూడా ఇదే విధంగా సహజ మరణానికి కూడా బీమా సౌకర్యాన్ని వర్తింపజేసే విధంగా సింగరేణి యాజమాన్యం చొరవ తీసుకుంటోంది.



# బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిని మర్యాదపూర్వకంగా కలిసిన కార్పొరేటర్ చెరుకు భాగ్యలక్ష్మి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

పాల్వంచ, ఏప్రిల్ 4 : భద్రాద్రి–కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్‌లో 4వ డివిజన్ నుంచి బీజేపీ తరపున గెలుపొందిన ఏకైక కార్పొరేటర్ చెరుకు భాగ్యలక్ష్మి శనివారం బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావును శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఎమ్మెల్సీ మల్కా కొమురయ్యతో కలిసి ఆమె ఈ భేటీ నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు మాట్లాడుతూ, కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో బీజేపీ తరఫున విజయం సాధించడం గర్వకారణమని పేర్కొన్నారు. అనంతరం కార్పొరేటర్ చెరుకు భాగ్యలక్ష్మిని శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు. కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు. పార్టీ ఆశయాలను ప్రజలకు చేరవేసి, రాబోయే ఎన్నికల్లో కొత్తగూడెం మున్సిపల్ పీఠాన్ని కైవసం చేసుకునేలా ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మల్కా కొమురయ్య, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తుల్లా వీరేంద్ర గౌడ్ తదితరులు చెరుకు భాగ్యలక్ష్మిని అభినందించారు.

# క్యాతనపల్లి మున్సిపల్ పాలకవర్గం ఎన్నిక

## జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)




రామకృష్ణాపూర్, ఏప్రిల్ 4 : మున్సిపల్ సాధారణ ఎన్నికల నేపథ్యంలో క్యాతనపల్లి మున్సిపల్ ఛైర్‌పర్సన్, వైస్ ఛైర్‌పర్సన్ ల పరోక్ష ఎన్నికలు నిర్వహించడం జరిగిందని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి. చంద్రయ్య అన్నారు. శనివారం క్యాతనపల్లి మున్సిపాలిటీ కార్యాలయంలో జరిగిన ఎన్నిక కార్యక్రమానికి బెల్లంపల్లి సబ్ కలెక్టర్, ఎన్నికల పరిశీలకులు మనోజ్, క్యాతనపల్లి మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్ లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ మున్సిపల్ పాలకవర్గం పరీక్ష ఎన్నికకు ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం చర్యలు తీసుకోవడం జరిగిందని తెలిపారు. ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా ఉండేందుకు ప్రత్యక్ష ప్రసారం ఏర్పాట్లుహాహాచేయడం జరిగిందని, ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయని తెలిపారు. క్యాతనపల్లి మున్సిపల్ ఛైర్ పర్సన్ గా గొడిసెల సంధ్యారాణి, వైస్ ఛైర్ పర్సన్ గా మిట్టపెల్లి సరిత లను ఎన్నుకోవడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# డాక్టర్ బాబు జగ్జీవన్ రావు 119వ జయంతి

## - ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలి

## - పాల్వంచ ఉత్సవ కమిటీ పిలుపు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



పాల్వంచ, ఏప్రిల్ 4: భారత మాజీ ఉప ప్రధానమంత్రి డాక్టర్ బాబు జగ్జీవన్ రావు 119వ జయంతి సందర్భంగా ఈ నెల 5న జరిగే ఉత్సవాలను అన్ని వర్గాల ప్రజలు ఘనంగా నిర్వహించాలని పాల్వంచ బాబు జగ్జీవన్ రావు ఉత్సవ కమిటీ నాయకులు పిలుపునిచ్చారు. శనివారం పాల్వంచ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఉత్సవ కమిటీ గౌరవ అధ్యక్షుడు, 43వ డివిజన్ మున్సిపల్ కార్పొరేటర్ కాల్వ భాస్కరరావు మాట్లాడుతూ, పాల్వంచ పోలీస్ స్టేషన్ ఎదురుగా జయంతి కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని తెలిపారు. ఈ కార్యక్రమానికి సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం నియోజకవర్గ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సిపిఐ భద్రాద్రి జిల్లా కార్యదర్శి ఎస్.కె. సాబీర్ పాషా, కొత్తగూడెం కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్, డిప్యూటీ మేయర్ సరిపురపు లలిత కుమారి, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు కొత్వాల శ్రీనివాసరావు, కొత్తగూడెం కార్పొరేషన్ కమిషనర్ కోడారు సుజాత, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు తదితరులు హాజరవుతారని తెలిపారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ గౌరవ అధ్యక్షులు కాల్వ భాస్కరరావు, కొత్తపల్లి సోమయ్య, నేషనల్ అవార్డు గ్రహీత దండోరా శీను, కాల్వ ప్రకాష్ రావు, కొమ్మవరపు ఆదాం, గోడ్ల మోహన్‌రావు, రాజేంద్రప్రసాద్, కాల్వ రామారావు, గుర్రం వెంకటరత్నం తదితరులు ప్రజలను కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

# నాణ్యతతో పాటు గడువులోగా పాఠశాల నిర్మాణాలు పూర్తి చేయాలి

## జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశాలు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



జయశంకర్–భూపాలపల్లి, ఏప్రిల్ 4 : పనుల నాణ్యతను కాపాడుతూ నిర్ణయిత గడువులోగా పాఠశాల నిర్మాణాలను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ సంబంధిత ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. శనివారం గణపురం మండలం మైలారం గ్రామంలో నిర్మాణంలో ఉన్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నిర్మాణ పనులను మ్యాప్ ఆధారంగా సమీక్షించారు. వచ్చే సంవత్సరం జూన్ నాటికి నిర్మాణ పనులను పూర్తి చేయాలని గడువు విధించిన కలెక్టర్, పనుల్లో నాణ్యతకు ఎలాంటి రాజీ పడకూడదని స్పష్టం చేశారు. నిర్దేశిత కాలవ్యవధిలో పనులను పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. టీజీఈడబ్ల్యూఐడిసి అధికారులు పనులను నిరంతరం పర్యవేక్షిస్తూ ఎలాంటి ఆలస్యం లేకుండా పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే సంబంధిత శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేసి నిర్మాణాలను వేగవంతం చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీఈఓ రాజేందర్, టీజీఈడబ్ల్యూఐడిసి ఈఈ అరుణ్ కుమార్, డీఈ రామకృష్ణ, ఏఈ జీవన్, కేఎంవీ ప్రాజెక్టు సంస్థ ఇంజినీర్లు తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు ఇబ్బందులు లేకుండా ముందుగానే కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

## ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



జయశంకర్–భూపాలపల్లి, ఏప్రిల్ 4 : రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ముందస్తుగానే కొనుగోలు కేంద్రాలను ప్రారంభించామని భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు తెలిపారు. శనివారం భూపాలపల్లి నియోజకవర్గంలోని గణ పురం మండల కేంద్రం కొత్తపల్లి మార్కెట్ యార్డులో, అలాగే భూపాలపల్లి రూరల్ మండలం గొర్లవేడు గ్రామంలో మార్క్ఫెడ్ సౌజన్యంతో ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని సూచించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల ద్వారానే తమ పంటను విక్రయించాలని పిలుపునిచ్చారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందుగానే కేంద్రాలను ప్రారంభించామని తెలిపారు. మొక్కజొన్నకు క్వింటాలుకు కనీస మద్దతు ధరగా రూ. 2,400 చెల్లిస్తున్నామని, రైతులకు చెల్లింపులు తక్షణమే జరిగేలా చర్యలు తీసుకుంటు న్నామని వెల్లడించారు. అలాగే కొనుగోలు ప్రక్రియ నిరంతరంగా కొనసాగేందుకు మార్కెట్ యార్డుల్లో తార్పాలిన్ కవర్లు అందుబాటులో ఉంచాలని సంబంధిత అధికారులకు ఆదేశిం చారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ ఛైర్మన్ గుంటోజు కిష్టయ్య, వివిధ శాఖల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

# డిజిటల్ ప్రింటింగ్ రంగంలో యువతకు మంచి ఉపాధి అవకాశాలు

## భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



జయశంకర్–భూపాలపల్లి, ఏప్రిల్ 4 : డిజిటల్ ప్రింటింగ్ రంగంలో యువతకు మంచి ఉపాధి అవకాశాలు ఉన్నాయని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. భూపాలపల్లి పట్టణంలో బొల్లేపల్లి సతీష్ కుమార్ గౌడ్‌కి చెందిన ఎస్ఎల్ఎన్ డిజిటల్ ప్రింటింగ్ ఫ్లెక్స్ సంస్థను శనివారం ఎమ్మెల్యే ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఆధునిక సాంకేతికతతో ముందుకు వస్తున్న డిజిటల్ ప్రింటింగ్ రంగం యువతకు మంచి ఉపాధి అవకాశాలను కల్పిస్తుందని తెలిపారు. కొత్త వ్యాపారాలను ప్రోత్సహించడం ద్వారా ప్రాంతీయ ఆర్థిక అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. స్థానిక యువత స్వయం ఉపాధి దిశగా ముందుకు రావాలని, ఇలాంటి సంస్థలు మరింతగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. వ్యాపారాన్ని ప్రారంభించిన నిర్వాహకులకు అభినందనలు తెలియజేసి, భవిష్యత్తులో మరింత విజయాలు సాధించాలని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట భూపాలపల్లి మున్సిపల్ ఛైర్మన్ బుర్ర కొమురయ్య గౌడ్, వైస్ ఛైర్మన్ అంబాల శ్రీనివాస్, కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, స్థానిక నాయకులు, వ్యాపారవేత్తలు, యువకులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలి

## - ఒత్తిడి లేకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలి

## - విద్యార్థులకు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ సూచన

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జయశంకర్–భూపాలపల్లి, ఏప్రిల్ 4 : విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి లోనుకాకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాస్తూ పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ సూచించారు. శనివారం గణపురం మండలంలోని మహాత్మా జ్యోతిబా పూలే పాఠశాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో మెనూ అమలు, గ్యాస్ సరఫరా, మౌలిక సదుపాయాలపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు అందిస్తున్న సౌకర్యాలపై సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం 10వ తరగతి విద్యార్థులతో కలెక్టర్ ముఖాముఖి నిర్వహించారు. పరీక్షల నిర్వహణ, వారి సన్నద్ధతపై విద్యార్థులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఇప్పటికే ఐదు పరీక్షలు పూర్తయ్యాయని, మిగిలిన పరీక్షలకు ఎలా సిద్ధమవుతున్నారో అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు సూచనలు చేస్తూ, మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని, ఈ పాఠశాల మొదటి బ్యాచ్‌గా తమ తల్లిదండ్రులు, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని తెలిపారు. ఎలాంటి ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలని సూచిస్తూ విద్యార్థులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. పాఠశాలలో ప్రహరీ గోడ, సీసీ కెమెరాలు, డిజిటల్ తరగతులు, డైనింగ్ హాల్ ఏర్పాటుకు సంబంధిత ప్రతిపాదనలు పంపించాలని అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ అధికారి ఇందిర, డీఈఓ రాజేందర్, ఎస్.ఓ స్వప్న తదితరులు పాల్గొన్నారు.



# మద్దులపల్లి మార్కెట్ యార్డులో మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభం

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జయశంకర్–భూపాలపల్లి, ఏప్రిల్ 4 : ఖమ్మం, ఏప్రిల్ 4:మార్క్‌ఫెడ్ సౌజన్యంతో మద్దులపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డులో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని శనివారం ఘనంగా ప్రారంభించారు. ఏదులాపురం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో ఈ కేంద్రం ఏర్పాటు చేయబడింది. రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి క్యాంపు కార్యాలయం ఇంచార్జ్ తుంబురు దయాకర్ రెడ్డి సమక్షంలో, మద్దులపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ బైరు హరినాథ్ బాబు కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను వినియోగించుకుని తమ పంటను విక్రయించాలని సూచించారు. దళారులను ఆశ్రయించకుండా నేరుగా కేంద్రాల ద్వారా విక్రయించడం వల్ల రైతులకు న్యాయమైన ధర లభిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ సభ్యులు, ఏదులాపురం మున్సిపల్ ఛైర్‌పర్సన్ పోకబత్తిని అనిత, వైస్ ఛైర్మన్ తమ్మినేని నవీన్, వార్డు కౌన్సిలర్లు కృష్ణకుమారి, శ్రీజ, రంగారావు, డీసీఎంఎస్ మేనేజర్ సందీప్, మార్కెటింగ్ శాఖ జిల్లా అధికారి ఆలీం, నాయకులు బండి జగదీష్, ఆరెంపుల సర్పంచ్ బండి సతీష్ తదితరులు, రైతులు మరియు స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# అమిత్ షా పర్యటనలో ఘర్షణ

### - సీరియస్‌గా తీసుకున్న ఇసి
### - డిసిపి సహా ముగ్గురి సస్పెన్షన్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

న్యూఢిల్లీ,ఏప్రిల్4 : పశ్చిమ బెంగాల్‌లో ఎన్నికల వాతావరణం ఉద్రిక్తంగా ఉంది. కేంద్ర హోం మంత్రి అమిత్ షా పర్యటనలోనే అక్కడ ఘర్షణ వాతావరణం నెలకొందంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఈ నెల 2న మంత్రి అమిత్ షా బెంగాల్‌లోని భవానిపూర్‌లో పర్యటించారు. అక్కడ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సువేందు అధికారి నామినేషన్ కార్యక్రమంలో అమిత్ షా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రోడ్ షో నిర్వహించారు. అయితే, ఈ రోడ్ షోలో ఘర్షణ వాతావరణం తలెత్తింది. బీజేపీ శ్రేణులు పాల్గొన్న ఈ రోడ్ షోలో టీఎంసీకి చెందిన కొందరు దాడికి పాల్పడ్డారు. దీంతో ఇరుపక్షాల మధ్య దాడి జరిగింది. సాధారణంగా కేంద్ర హోం మంత్రి అమిత్ షా పాల్గొనే కార్యక్రమాలకు కఠిన భద్రత ఉంటుంది. ఇలాంటి దాడులకు అవకాశం ఉండదు. కానీ, భవానిపూర్‌లో మాత్రం హింసాత్మక వాతావరణం ఏర్పడింది. దీంతో ఈ అంశంపై ఎన్నికల సంఘానికి బీజేపీ ఫిర్యాదు చేసింది. దీనిపై నివేదిక ఇవ్వాలని బెంగాల్ ప్రధాన కార్యదర్శిని ఈసీ కోరింది. ఈ నివేదిక ఆధారంగా ఈసీ చర్యలు తీసుకుంది. అమిత్ షా పర్యటనలో అనేక భద్రతా వైఫల్యాలు ఉన్నట్లు గుర్తించింది. దీనికి బాధ్యుల్ని చేస్తూ సిద్దార్థ్ దత్తా అనే డీసీపీ సహా మరో ముగ్గురిని సస్పెండ్ చేస్తూ నిర్ణయం తీసుకుంది. శాంతి భద్రతల్ని కాపాడటంలో వీరు విఫలమయ్యారని ఆరోపించింది. పశ్చిమ బెంగాల్ ఎన్నికల్లో భవానిపూర్ నియోజకవర్గం చాలా కీలకం. ఎందుకంటే ఇక్కడి నుంచి సీఎం మమతా బెనర్జీ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సువేందు అధికారి పోటీ చేస్తున్నారు. వీరిలో ఎవరు గెలిచినా సీఎం కావడం ఖాయం. అయితే, మమతను ఓడించాలని బీజేపీ గట్టి పట్టుదలతో ఉంది. అందుకే ఈ నియోజకవర్గంలో ఎన్నికల తతంగా ఆసక్తికరంగా మారింది.

# 210 పరుగుల చేసిన రాజస్థాన్

### - ఆర్థ సెంచరీలు చేసిన జైస్వాల్, జురెల్

న్యూఢిల్లీ,ఏప్రిల్4 : ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2026లో భాగంగా అహ్మదాబాద్ లోని నరేంద్ర మోడీ స్టేడియంలో గుజరాత్ టైటాన్స్ తో జరుగుతున్ పోరులో రాజస్థాన్ రాయల్స్ నిర్ణీత 20 ఓవర్లలో 210 పరుగులు చేసింది. టాస్ గెలిచి బ్యాటింగ్ తీసుకున్న రాజస్థాన్ కి అద్భుతమైన ఆరంభం లభించింది. ధ్రువ్ జురెల్ అద్భుతమైన అర్థ శతకంతో చేయగా, ఓపెనర్లు యశస్వీ జైస్వాల్ (55) హాఫ్ సెంచరీతో చెలరేగగా, వైభవ్ సూర్యవంశీ మెరుపు బ్యాటింగ్ తో గుజరాత్ బౌలర్లకు ముచ్చెమటలు పట్టించారు. అనంతరం జైస్వాల్ సూర్యవంశీ మధ్య నెలకొన్న 70 పరుగుల భాగస్వామ్యాన్ని గుజరాత్ కెప్టెన్ రషీద్ ఖాన్ బ్రేక్ చేశాడు. రషీద్ బౌలింగ్(6.2)లో ÷-లగెన్ ఫిలిప్స్ కి క్యాచ్ ఇచ్చిన వైభవ్ సూర్యవంశీ (18 బంతుల్లో 5 ఫోర్లు ఒక సిక్సుతో 31 పరుగులు) పెవిలియన్ కి వెళ్లిపోయాడు. అనంతరం జురెల్ తో కలిసి ఇన్నింగ్స్ ముందుకు నడిపిస్తున్న క్రమంలో జైస్వాల్ (36 బంతుల్లో 6 ఫోర్లు 3 సిక్సులతో 55 పరుగులు) తన అర్ధ శతకం పూర్తి చేసుకున్న తర్వాత కగిసో రబాడా బౌలింగ్ లో క్లిన్ బౌల్డ్ అయ్యాడు. ఆ తర్వాత వచ్చిన ఆర్ఆర్ కెప్టెన్ రియాన్ పరాగ్ (8), షిమ్రాన్ హెట్‌మయర్ (18) పెద్దగా ఆకట్టుకోలేకపోయారు. ఒకవైపు జురెల్ (42 బంతుల్లో 5 ఫోర్లు 5 సిక్సులతో 75 పరుగులు) మాత్రం దూకుడుగా బ్యాటింగ్ చేస్తూ, తన హాఫ్ సెంచరీని కంప్లీట్ చేసుకున్నాడు.

# సికింద్రాబాద్‌లో భారీగా గంజాయి పట్టివేత

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్,ఏప్రిల్4 : సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో భారీగా గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. రూ.50 లక్షల విలువైన గంజాయితోపాటు, రూ.72,500 నగదును రైల్వే పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గంజాయి విక్రయానికి యత్నించిన నలుగురిని అరెస్టు చేశారు. తుని నుంచి రైలులో హైదరాబాద్, ముంబయికి గంజాయి సరఫరా చేస్తున్నట్లు గుర్తించారు.

# ఖానాపూర్ మున్సిపల్ ఎన్నిక వాయిదా

మొదటిపేజీ తరువాయి

వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ప్రజాస్వామ్యబద్ధంగా జరగాల్సిన ఖానాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్నికను కాంగ్రెస్ ప్రభుత్వం అధికార దాహంతో బీఆర్ఎస్ నాయకులను ముందస్తు అరెస్టులు చేయడం అప్రజస్వామికమని మండిపడ్డారు. ఖానాపూర్ నియోజకవర్గ మున్సిపల్ చైర్మన్ ఎన్నిక బీఆర్ఎస్‌కు అనుకూలంగా మారడంతో కుట్రా పూరిత చర్యలకు దిగజారడం శోచనీయమని ఆరోపించారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రాజ్యాంగ నియమాలను కాంగ్రెస్ ప్రభుత్వం ఉల్లంఘిస్తుందని విమర్శించారు. ప్రజాస్వామ్యంగా జరగాల్సిన ఎన్నికలు పోలీసుల పహారా మధ్య వారికి అనుగుణంగా మార్చుకునే కుతంత్రాలు జరుగుతున్నాయని అన్నారు. ప్రజాక్షేత్రంలో కాంగ్రెస్ పార్టీకి గట్టి గుణపాఠం చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు.

# భారీ ఉగ్రకుట్రను భగ్నం చేసిన పోలీసులు

మొదటిపేజీ తరువాయి

అతను పేలుళ్లకు ఎలాన్ చేసినట్లు వెల్లడించారు. ఏప్రిల్ 2న లక్నో రైల్వేస్టేషన్ వద్ద పేలుడుకు కుట్ర పన్నుతుండగా పక్కా సమాచారంతో ఘటనా స్థలానికి వెళ్లి వారిని అరెస్టు చేసినట్లు తెలిపారు. వీరిపై వివిధ చట్టాల కింద కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. నిందితుల నుంచి పేలుడు పదార్థాలు, ఏడు స్మార్ట్ ఫోన్లు, 24 కరపత్రాలు స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. ఈ నిందితులు కొన్ని ప్రదేశాల్లో చిన్నపాటి పేలుళ్లకు పాల్పడ్డారని.. దాన్ని వీడియో తీసి ఉగ్రసంస్థలకు పంపారని పోలీసులు తెలిపారు. దాని ద్వారా ఉగ్రసంస్థల నుంచి నిధులు సేకరించారని పేర్కొన్నారు. వీరంతా సోషల్ మీడియాను ఉపయోగించి యువతను తీవ్రవాదం వైపు ఆకర్షించే ప్రయత్నం చేశారన్నారు. రైల్వే సిగ్నల్స్, గ్యాస్ సిలిండర్ల ట్రక్కులు, ప్రభుత్వ కీలక ఆస్తులే లక్ష్యంగా దాడికి ఎ÷-లాన్ చేసుకున్నట్లు పేర్కొన్నారు. అలాగే వీరంతా రాజకీయ ప్రముఖుల ఇళ్లు, ప్రముఖ సంస్థల వద్ద రెక్కీ నిర్వహించారని.. ఆ సమాచారాన్ని పాకిస్థానీ హ్యాండ్లర్లకు పంపారని తెలిపారు. ఘజియాబాద్, అలీగఢ్, లక్నోతోపాటు ప్రముఖ ప్రదేశాల్లో వీరంతా సర్వే చేశారని పోలీసులు పేర్కొన్నారు.

# హింసను ప్రోత్సహిస్తే సహించేది లేదు

## బాల్క సుమన్‌కు మంత్రి వివేక్ హెచ్చరిక

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మంచిర్యాల, ఏప్రిల్ 4 : ఖబడ్దార్ బాల్క సుమన్.. చెన్నూరులో హింసను ప్రోత్సహిస్తే ఊరుకునేది లేదని మంత్రి వివేక్ వెంకటస్వామి హెచ్చరించారు. హింసను ప్రోత్సాహించే ఎవరిపైనైనా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. శనివారం (ఏప్రిల్ 4) జరిగిన క్యాతనపల్లి మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికపై మంత్రి వివేక్ స్పందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చెన్నూరు నియోజకవర్గంలో ఈ సారి ప్రజాస్వామ్య పద్ధతిలో మున్సిపల్ ఎన్నికలు జరిగాయన్నారు. క్యాతనపల్లి మున్సిపల్ ఎన్నికే అందుకు నిదర్శమని పేర్కొన్నారు. మొదటి నుంచి ఎన్నికలుసజావుగా సాగేందుకు మేం సహకరించామని.. కానీ బాల్క సుమన్, బీఆర్ఎస్ లీడర్లు రాజకీయ లబ్ధి కోసం కాంగ్రెస్ పార్టీని బద్నాం చేసేందుకు ప్రయత్నించారని మండిపడ్డారు. ఈ క్రమంలోనే బాల్క సుమన్, బీఆర్ఎస్ శ్రేణులు మా కాన్వాయ్?పై దాడి చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో బెదిరించి ఏకగ్రీవాలు చేసి ఎన్నికలు జరగకుండా అడ్డుకున్న చరిత్ర బాల్క సుమన్‌దని విమర్శించారు. బాల్క సుమన్ మాదిరిగా బెదిరింపు, రౌడీ రాజకీయాలు మేం ఎప్పుడు చేయలేదు.. భవిష్యత్‌లో కూడా చేయబోమని పేర్కొన్నారు. అలా చేస్తే ప్రజాస్వామ్యానికి అర్థం ఉండదన్నారు. గత ఎన్నికల్లో సుమన్ తమను బట్టలిప్పి కొడతానని వ్యాఖ్యలు చేసినందుకే చెన్నూరు ప్రజలు తగిన గుణపాఠం చెప్పారని.. మళ్లీ అలాగే వ్యవహరిస్తే ఈసారి కూడా ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. క్యాతనపల్లి మున్సిపాలిటీని, చెన్నూరు నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని.. క్యాతనపల్లి మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్?గా ఎన్నికైన వారికి హృదయ పూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తున్నానన్నారు. క్యాతనపల్లి మున్సిపాలిటీని బీఆర్ఎస్ పార్టీ కైవసం చేసుకున్న విషయం తెలిసిందే.

# సైబర్ నేరగాళ్ల కొత్త ఎత్తులు

### - బాస్‌ల పేరుతో హానికరమైన మెయిల్స్
### - అప్రమత్తంగా ఉండాలని సిపి సజ్జన్నార్ హెచ్చరిక

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్,ఏప్రిల్4 : వ్యాపార సంస్థల అధినేతలు, సీఈఓలు, సీఎఫ్ఓలే లక్ష్యంగా సైబర్ నేరగాళ్లు సరికొత్త వాట్సాప్ మోసాలకు పాల్పడుతున్నారని హైదరాబాద్ సీపీ వీసీ సజ్జనర్ హెచ్చరించారు. సంస్థల అధికారిక ఈమెయిల్స్‌కు హానికరమైన ఫిషింగ్ లింకులు పంపడం ద్వారా కంప్యూటర్లలోకి మాల్వేర్‌ను ప్రవేశపెడుతున్నారని పేర్కొన్నారు. దీనివల్ల సిస్టమ్స్‌పై నేరగాళ్లు పూర్తిస్థాయి రిమోట్ యాక్సెస్‌ను పొందుతూ అక్రమాలకు తెరలేపుతున్నారని చెప్పారు. ఈ మేరకు వివరాలు వెల్లడిస్తూ ఓ ప్రెస్‌నోట్ రిలీజ్ చేశారు. సిస్టమ్ నియంత్రణలోకి వచ్చిన తర్వాత అందులో యాక్టివ్‌గా ఉన్న వాట్సాప్ వెబ్ సెషన్లను నేరగాళ్లు చాకచక్యంగా వినియోగిస్తున్నారని సీపీ తెలిపారు. సీఈఓ లేదా సీఎఫ్ఓల పేరుతో అకౌంటెంట్లకు తప్పుదారి పట్టించే సందేశాలను పంపిస్తూ నమ్మిస్తున్నారని వెల్లడించారు. తాము అత్యవసర సమావేశంలో ఉన్నామని, ఫోన్ ఎత్తడం వీలుపడదని చెబుతూ కోట్లాది రూపాయలు కాజేస్తున్నారని పేర్కొన్నారు. సోషల్ ఇంజనీరింగ్ వ్యూహాలతో తక్షణమే తమ ఖాతాలకు డబ్బును బదిలీ చేయించుకుంటున్నారని చెప్పారు. పై అధికారుల నంబర్ల నుంచే సందేశాలు వస్తుండటంతో అకౌంటెంట్లు కూడా నిజమేనని నమ్మి మోసపోతున్నారని అన్నారు. ఇటీవల హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో ఇటువంటి కేసులు నమోదవుతున్నాయని తెలిపారు. ప్రతి కంపెనీ కూడా ఇటువంటి సైబర్ దాడుల పట్ల అత్యంత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వాట్సాప్‌లోపై అధికారుల పేరుతో వచ్చే ఆర్థిక అభ్యర్థనలను గుడ్డిగా నమ్మకూడదని పేర్కొన్నారు. వెంటనే అధికారులకు నేరుగా ఫోన్ చేసి ఆసందేశం నిజమేనా కాదా అని ధృవీకరించుకోవాలని చెప్పారు. ఆఫీసు సిస్టమ్స్‌లో నాణ్యమైనవాల్స్, యాంటీ వైరస్ సాఫ్ట్‌వేర్‌లను నిరంతరం అప్‌డేట్ చేసి ఉంచాలని అన్నారు.

# బెడిసికొట్టిన మందుబాబుల ప్లాన్

### - వాట్సాప్ గ్రూప్‌తో తనిఖీలపై ముందే హెచ్చరికలు
### - ట్రాఫిక్ ఎస్ఐ ఎంటర్‌తో దొరికిపోయిన మోసం

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

పెద్దపల్లి,ఏప్రిల్4 : డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల నుంచి తప్పించుకునేందుకు మందుబాబులు వేసిన ఒక మాస్టర్ ఎ÷-లాన్ డైరెక్టుగా పోలీసులకే దొరికిపోయింది. పోలీసులు ఎక్కడెక్కడ చెకింగ్ చేస్తున్నారో ముందే సమాచారం తెలుసుకునేందుకు వారు ఏకంగా ఒక వాట్సాప్ గ్రూప్‌ను క్రియేట్ చేశారు. అయితే, ఆ గ్రూప్‌లోకి నేరుగా ట్రాఫిక్ ఎస్ఐ ఎంట్రీ ఇవ్వడంతో మందుబాబుల గుండెల్లో రైళ్లు పరిగెత్తాయి.

గోదావరిఖని ప్రాంతంలో కొంతమంది మందుబాబులు కలిసి 'పోలీస్ మామల స్క్వాడ్' పేరుతో ఒక వాట్సాప్ గ్రూప్‌ను ప్రారంభించారు. కేవలం ఇద్దరితో మొదలైన ఈ గ్రూప్, చూస్తూనే వేల మంది సభ్యులకు చేరుకుంది. ఈ గ్రూప్ ప్రధాన ఉద్దేశ్యం ఏమిటంటే.. పట్టణంలో ఎక్కడైనా పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేస్తుంటే, వెంటనే ఆ లొకేషన్ వివరాలను గ్రూప్‌లో షేర్ చేయడం. దీనివల్ల మందుబాబులు ఆ మార్గాల్లో వెళ్లకుండా ప్రత్యామ్నాయ దారులను వెతుక్కుని పోలీసుల కళ్లు గప్పేవారు. ఇటీవల వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో ఒక వ్యక్తి పోలీసులకు పట్టుబడ్డాడు. అతని సెల్ ఫోన్ తనిఖీ చేయగా ఈ వింత వాట్సాప్ గ్రూప్ వ్యవహారం బయటపడింది. ఆ గ్రూప్‌లోని మెసేజ్‌లను చూసిన స్థానిక ట్రాఫిక్ ఎస్ఐ, వెంటనే అందులో ఒక సెల్ఫీ వీడియోను పోస్ట్ చేశారు. 'అరేయ్ మామ.. నేను ట్రాఫిక్ ఎస్ఐని రా మామ.. నా మీదే గ్రూప్ పెడతారా?' అంటూ గట్టి వార్నింగ్ ఇచ్చారు. 'నేను గోదావరిఖని మున్సిపల్ చౌరస్తాలో చెకింగ్ చేస్తున్నాను, దమ్ముంటే రండిరా మామ చూసుకుందాం' అని సవాల్ విసిరారు. ఆ వీడియోను చూసిన మందుబాబులు ఒక్కసారిగా హడలిపోయారు. వెంటనే గ్రూప్ నుండి లెఫ్ట్ అవ్వడం ప్రారంభించారు. అయితే ఎస్ఐ మాత్రం తగ్గేదేలే అన్నట్లుగా.. 'ఎవరూ వెళ్ళిపోకండి, మీ అందరి నెంబర్లు సేవ్ చేసుకున్నాను, ఫోటోలు కూడా తీశాను. మీ అందరికీ త్వరలోనే ఒక స్పెషల్ అవేర్నెస్ ప్రోగ్రామ్ పెడతాను, అందరూ రండి' అని అదిరిపోయే కౌంటర్ ఇచ్చారు. మందుబాబుల 'స్మార్ట్ ప్లాన్' పోలీసుల చేతికి చిక్కడంతో ఇప్పుడు గోదావరిఖనిలో ఈ వార్త చర్చనీయాంశంగా మారింది. పోలీసులు సాంకేతికతను వాడుకుని మరీ మందుబాబుల ఆట కట్టించడంతో, ఇప్పుడు ఆ గ్రూప్‌లో ఉన్న సభ్యులంతా పోలీసులకు ఎక్కడ దొరికిపోతామో అని బిక్కుబిక్కుమంటున్నారు.

# కెసిఆర్ క్యాంప్ కార్యాలయంపై దాడి

మొదటిపేజీ తరువాయి

జరిగిన దాడి అని, ప్రజాస్వామ్యం పై సీఎం చేయించిన దాడి అని ఆరోపించారు. పట్టపగలు అధికార మదంతో విర్రవీగుతూ సోయి మరచి వ్యవహరిస్తున్న కాంగ్రెస్ నాయకుల తీరు బీహార్ గ్యాంగ్‌ను తలపిస్తోందని మండిపడ్డారు. ఏకంగా ప్రజా ప్రతినిధుల క్యాంపు కార్యాలయాల పైనే ముప్పేట దాడులు చేస్తుంటే రాష్ట్రంలో శాంతి భద్రతలు ఉన్నట్లా లేనట్లా?. కాంగ్రెస్ పాలనలో ప్రజా ప్రతినిధులు, ప్రజా సంఘాలు, మీడియాపై దాడులు నిత్యకృత్యం కావడం సిగ్గుచేటని అన్నారు. శాంతిభద్రతలను కాపాడాల్సిన పోలీసు యంత్రాంగం కాంగ్రెస్ పార్టీకి ప్రైవేట్ సైన్యంలా మారిపోయారా? ఎందుకు అడ్డుకోవడం లేదంటూ ప్రశ్నించారు. ఒకవైపు 'హేట్ స్పీచ్ బిల్' పేరుతో ప్రజలు, ప్రతిపక్షాల నోళ్లు మూయిస్తూ, మరోవైపు కాంగ్రెస్ గూండాలతో దాడులు చేయించడమేనా మీ ప్రజా పాలన? అంటూ నిలదీశారు. ఇందిరమ్మ రాజ్యమని చెబుతూ గూండా రాజ్యం అమలు చేస్తారా? అని అన్నారు . సీఎం, మంత్రులు ఇతర రాష్ట్రాల్లో పొలిటికల్ టూర్లు చేస్తూ పాలనను గాలికి వదిలేసారని విమర్శించారు. ముఖ్యమంత్రి, మంత్రులు ఇతర రాష్ట్రాల ఎన్నికల ప్రచారంలో ఉంటే, ఇక్కడ పాలనను ఎవరు చూస్తారని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేల కార్యాలయాలపై దాడులు చేయాలని సందేశాలు ఇచ్చారా? కాంగ్రెస్ నాయకులకు ఫ్రీ హ్యాండ్ ఇచ్చారా? అంటూ అనుమానం వ్యక్తం చేశారు. ఏడవ గ్యారంటీగా ప్రజాస్వామ్య పునరుద్ధరణ అని డబ్బా కొట్టి ఇప్పుడు, ఉన్న ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారు. ఎమర్జెన్సీ పాలనను తలపిస్తున్నారు. మీ అణచివేతలకు, నిర్బంధాలకు, దాడులకు బీఆర్ఎస్ పార్టీ అదరదు, బెదరదని స్పష్టం చేశారు. ప్రజాక్షేత్రంలో కాంగ్రెస్‌ను అడుగడుగునా నిలదీస్తూనే ఉంటం, ప్రజల తరఫున పోరాటం చేస్తూనే ఉంటమని వివరించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంపై దాడులు జరిపిన కాంగ్రెస్ గూండాలను గుర్తించి వెంటనే అరెస్ట్ చేయాలని రాష్ట్ర డీజీపీకి డిమాండ్ చేశారు. ఇలాంటి దాడులు ఆపకపోతే ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు ప్రజలే వీధుల్లోకి రావాల్సిన పరిస్థితి వస్తుందని, తస్మాత్ జాగ్రత్త అని హెచ్చరించారు.

# బిఆర్ఎస్ ఖాతాలో ఇబ్రహింపట్నం, క్యాతన్‌పల్లి

మొదటిపేజీ తరువాయి

ముగ్గురు కౌన్సిలర్లపై కోర్టులో కేసు కొనసాగుతున్న నేపథ్యంలో ఎన్నిక నిర్వహించడం సరైనది కాదని ఎన్నికల అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. అయితే కోర్టు ఆదేశాల మేరకు ఎన్నిక నిర్వహించామని ఎన్నికల అధికారి స్పష్టం చేశారు. దీంతో ఎన్నికల ప్రక్రియ కొనసాగింది. ఈ ఎన్నికలో భారత్ రాష్ట్ర సమితి తరపున సుదర్శన్ రెడ్డి ఛైర్మన్ అభ్యర్థిగా పోటీ చేయగా, కాంగ్రెస్ తరపున ఆకుల యాదగిరి పేరును ప్రతిపాదించారు. ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ఎన్నికలను చేతులు ఎత్తే విధానంలో నిర్వహించారు. ఎట్టకేలకు బీఆర్ఎస్ ఈ మున్సిపాలిటీని తన ఖాతాలో వేసుకుంది. గతంలో అనేక విధ్యాలుగా గొడవలకు కారణంగా మారిన క్యాతనపల్లి మున్సిపాలిటీ పీఠాన్ని అధికారిక కాంగ్రెస్ పార్టీ దక్కించుకోలేకపోయింది. మున్సిపల్ ఛైర్‌పర్సన్‌గా బీఆర్ఎస్ కౌన్సిలర్ గొడిశెల సంధ్యారాణి ఎన్నికయ్యారు. సీపీఐ మద్దతుతో ఆమె మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఎన్నికల్లో విజయం సాధించారు. ఇక బీఆర్ఎస్ మద్దతుతో సీపీఐ కౌన్సిలర్ మిట్టపల్లి సరిత వైస్ ఛైర్మన్‌గా ఎన్నికయ్యారు. మంచిర్యాల జిల్లా క్యాతనపల్లి మున్సిపాలిటీలో బీఆర్ఎస్, సీపీఐ పొత్తు పెట్టుకోగా, 22 వార్డులకుగాను 10 వార్డుల్లో బీఆర్ఎస్, 4 వార్డుల్లో సీపీఐ అభ్యర్థులు గెలుపొందారు. బీఆర్ఎస్-సీపీఐ కూటమికి స్పష్టమైన బలం ఉన్నది. కాంగ్రెస్ అభ్యర్థులు ఏడు స్థానాల్లోనే గెలిచారు. కానీ, మంత్రి వివేక్, కాంగ్రెస్ నేతల అరాచకాల వల్ల గతంలో ఛైర్మన్, వైస్‌ఛైర్మన్ ఎన్నిక పక్రియ నిలిచిపోయింది. చివరకు కోర్టు ఆదేశాలతో శనివారం క్యాతనపల్లి మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఎన్నికను నిర్వహించారు. తాజాగా నిర్వహించిన మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఎన్నికకు కాంగ్రెస్ కౌన్సిలర్లు దూరంగా ఉన్నారు. బీఆర్ఎస్, సీపీఐ నుంచి ఎన్నికైన 14 మంది కౌన్సిలర్లు మాత్రం ఎన్నికకు హాజరయ్యారు. ఇక కోరం ఉండటంతో ఎన్నిక పక్రియను సజావుగా కొనసాగించారు. దీంతో గొడిశెల సంధ్యారాణి మున్సిపల్ ఛైర్‌పర్సన్‌గా ఎన్నికయ్యారు. ఇక బీఆర్ఎస్ మద్దతుతో సీపీఐ కౌన్సిలర్ మిట్టపల్లి సరిత వైస్ ఛైర్మన్‌గా గెలుపొందారు.

# సింగరేణి కార్మికులకు శుభవార్త

మొదటిపేజీ తరువాయి

ఎటువంటి ప్రీమియం చెల్లించాల్సిన అవసరం లేదు. ఇది పూర్తిగా ఉచితంగా అందించే సేవ. సింగరేణి వంటి కష్టతరమైన వృత్తిలో ఉన్న కార్మికులకు ఈ పథకం పెద్ద అండగా నిలవనుంది. విధి నిర్వహణలో కాకుండా, ఇంటి వద్ద సహజంగా మరణించినా వారి కుటుంబాలకు ఈ 10 లక్షల రూపాయల ఆర్థిక సాయం అందుతుంది. ఇది కార్మిక కుటుంబాల్లో భరోసాను నింపుతోంది. సింగరేణి చరిత్రలో ఇలా సహజ మరణానికి కూడా భారీ మొత్తంలో బీమా వర్తించడం ఇదే తొలిసారి అని కార్మిక సంఘాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. యాజమాన్యం , యూనియన్ బ్యాంక్ తీసుకున్న ఈ నిర్ణయంపై కార్మికుల నుండి ప్రశంసలు వ్యక్తమవుతున్నాయి.

# దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరగదు

మొదటిపేజీ తరువాయి

విమర్శించారు. కనీస మౌలిక సదుపాయాలు లేకుండా జీవన ప్రమాణాలు ఏ స్థాయిలో ఉంటాయనేది ఎవరైనా ఊహించవచ్చని అన్నారు. ఎన్డీయే విధానాలతో ప్రతి ఒక్క వర్గానికి, ముఖ్యంగా మహిళలు ఎంతో లబ్ధి పొందుతున్నారని ప్రధాని అన్నారు. వలస కార్మికులకు ఉద్యోగాలు కల్పన కేరళలో అతిపెద్ద సమస్యగా ఉందని, బీజేపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత అన్ని సమస్యలను పరిష్కరిస్తామని, ఇది మోదీ ఇచ్చే హామీ అని ప్రధాని భరోసా ఇచ్చారు. ఈశాన్య రాష్ట్రాలు, గోవా తరహాలోనే కేరళను అభివృద్ధి చేస్తామని అన్నారు. శబరి రైల్వే ప్రాజెక్టు నిలిచిపోవడానికి ఎల్‌డీఎఫ్ కారణమని విమర్శించారు. బీజేపీ డబుల్ ఇంజన్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే అన్ని అడ్డంకులూ తొలగిపోతాయని భరోసా ఇచ్చారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే ఈశాన్య రాష్ట్రాల్లో మాదిరిగా అభివృద్ధి ప్రాజెక్టులు చేపడతామన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నేతల తీరుపై మండిపడ్డ ఆయన.. పశ్చిమాసియా అంశంపై భయాన్ని సృష్టించే వ్యాఖ్యలు చేస్తున్నారని అన్నారు. కేరళలో శబరిమల రైల్వే ప్రాజెక్టు కొత్త అవకాశాలను తీసుకురాగలదని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఇది శబరిమలకు ప్రత్యక్ష అనుసంధానాన్ని మెరుగుపరుస్తుందని.. స్థానిక వ్యాపారాలకు కొత్త ఊపునిస్తుందని చెప్పారు. యువతకు కొత్త ఉపాధి మార్గాలను తెరుస్తుందని వివరించారు. కానీ రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రాజెక్టును అసంపూర్తిగా వదిలేసిందని విమర్శించారు. భాజపా డబుల్ ఇంజిన్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఇలాంటి అడ్డంకులన్నీ తొలగిపోతాయన్నారు. కాగా, కేరళ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ఏప్రిల్ 9న ఒకే విడతలో జరుగనుండగా, మే 4న ఫలితాలు వెలువడతాయి.

# తెలంగాణ సంపద కొల్లగొడుతున్న రేవంత్

మొదటిపేజీ తరువాయి

ఆగ్రహించారు. రాష్ట్ర ప్రజానీకం గంపెడు ఆశలతో కాంగ్రెస్‌కు అధికారం కట్టబెడితే.. చట్ట సభల్లో ప్రజా సమస్యలు చర్చకు రాకుండా వ్యక్తిగత దూషణలతో కాలం వృథా చేశారని మండిపడ్డారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2023 నుంచి ఫీజురీయింబర్స్‌మెంట్ ఇవ్వలేదని.. కాంగ్రెస్ ప్రభుత్వం రెండున్నర ఏళ్లలో రూ.600 కోట్లు మాత్రమే విడుదల చేసిందని ధ్వజమెత్తారు. పేద విద్యార్థుల జీవితాలతో రేవంత్ రెడ్డి సర్కార్ చెలగాటం ఆడుతోందని ఆగ్రహించారు. రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీల అమలు ఎలా సాధ్యమవుతుందని ఎన్నికల వేళ అగినప్పుడు.. తాను చేసి చూపిస్తానని రేవంత్ ప్రగల్భాలు పలికారని చెప్పారు. ఇప్పుడు హామీలు అమలు చేయకుండానే చేసినట్లు చెప్పుకుంటున్నారని విమర్శించారు. వేల కోట్ల విలువ చేసే భూములను ప్రైవేట్ వ్యక్తులతో కలిసి సీఎం రేవంత్ అమ్ముకుంటున్నారంటూ ఎంపీ ఈటల రాజేందర్ సంచలన ఆరోపణలు చేశారు.

# గోదావరిఖనిలో ఘోర రోడ్డు ప్రమాదం

మొదటిపేజీ తరువాయి

గమనించిన స్థానికులు.. కారులోని వారిని బయటకు తీశారు. అనంతరం అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. డ్రైవర్ నియంత్రణ కోల్పోవడం వల్లే ప్రమాదం జరిగినట్లుగా అనుమానిస్తున్నారు.

# ప్రజల దృష్టి మరల్చేందుకు దాడులు

మొదటిపేజీ తరువాయి

ఆస్తులను ధ్వంసం చేయడమేనని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చడం చేతగాక ప్రజల దృష్టి మరల్చేందుకు కాంగ్రెస్ ఇలాంటి చర్యలను ప్రోత్సహిస్తోందని మండిపడ్డారు. మాజీ ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయం మీద ఇలాంటి చర్యలకు పాల్పడితే ఇక సామాన్యులకు రక్షణ ఎక్కడ ఉందని ప్రశ్నించారు. దాడికి పాల్పడిన దుండగులను గుర్తించి, కేసులు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనలో పోలీసులు అలసత్వం వహించడం గర్హనీయమని పేర్కొన్నారు.

# బాసర మాస్టర్ ప్లాన్‌కు సిఎం రేవంత్ ఓకే

మొదటిపేజీ తరువాయి

సౌకర్యాలు కల్పిస్తూ, ఆలయాన్ని అభివృద్ధి చేసే దిశగా అన్ని చర్యలు చేపట్టాలని అధికారులకు దిశానిర్దేశంచేశారు. బాసర ఆలయ అభివృద్ధిపై ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శనివారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా బాసర ఆలయ అభివృద్ధికి సంబంధించిన మాస్టర్ ప్లాన్‌ను సీఎంకు అధికారులు వివరించారు. మాస్టర్ ప్లాన్‌పై అధికారులకు పలు సూచనలు చేశారు సీఎం. ఆలయ అభివృద్ధి అద్భుతంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. భక్తుల విశ్వాసాలను గౌరవిస్తూ, శాస్త్ర ప్రకారం ఆలయ అభివృద్ధి ఉండాలని సూచించారు. భవిష్యత్తు అవసరాలను, రద్దీని దృష్టిలో ఉంచుకుని విశాలమైన రోడ్లు ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఆలయ పరిసరాల్లో ఈవీ వాహనాలను మాత్రమే వినియోగించేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. ఆలయ పవిత్రతకు భంగం కలగకుండా నిబంధనలు కఠినతరం చేయాలని ఆదేశించారు. తిరుమల తరహాలో అన్ని ఆలయాల పరిసరాల్లో ఎలాంటి రాజకీయ కార్యకలాపాలు జరగకుండా నిబంధనలు ఉండాలని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. సమావేశానికి మంత్రి కొండా సురేఖ, ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి, ఎంపీ వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీనివాసరాజు, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, కమిషనర్ హనుమంతరావు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ నెల 6న బాసర ఆలయ అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేయనున్నారు. రూ.225 కోట్లతో ఆలయ అభివృద్ధి పనులను సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించనున్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రుల బలోపేతానికి చర్యలు తీసుకోవాలి : జిల్లా కలెక్టర్ అంకిత్ ఆదేశాలు




(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భద్రాద్రి-కొత్తగూడెం, ఏప్రిల్ 4 : జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ ఆసుపత్రులను బలోపేతం చేసి ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని భద్రాద్రి జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. శనివారం ఐడీఓసీ కలెక్టరేట్ కార్యాలయం సమావేశ మందిరంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో జిల్లాలోని ఏరియా ఆసుపత్రుల సూపరింటెండెంట్లు, వైద్యశాఖ అధికారులతో కలిసి ఆసుపత్రుల పనితీరు, అభివృద్ధి పనులు, ఆరోగ్యశ్రీ సేవలపై సమగ్రంగా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఆసుపత్రుల్లో అమలవుతున్న ఆరోగ్యశ్రీ సేవలపై పూర్తి వివరాలు తెలుసుకున్నారు. కొనసాగుతున్న నూతన నిర్మాణాలు, మరమ్మత్తుల పనులను నిర్దిష్ట గడువులో పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రతి ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలు, సిబ్బంది కొరత, వైద్యుల లభ్యత వంటి అంశాలను సమీక్షించి, అవసరమైన సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వైద్యులు సమయపాలన పాటిస్తూ ప్రజలకు నాణ్యమైన సేవలు అందించాలని తెలిపారు. భద్రాచలం ఏరియా ఆసుపత్రిలో మరుగుదొడ్ల మరమ్మత్తుల అవసరంపై స్పందించిన కలెక్టర్, వెంటనే పనులు చేపట్టి పూర్తి చేయాలని ఆదేశించారు. ఆసుపత్రుల్లో మౌలిక సదుపాయాల మెరుగుదలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందుతున్న ఆధునిక వైద్య సేవలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని, పేద ప్రజలు ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లకుండా ప్రభుత్వ ఆసుపత్రులపై విశ్వాసం పెంపొందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సాధారణ ప్రసవాలు, సిజేరియన్ కేసులపై సమీక్షించి అవసరమైన చోట సేవలను మరింత మెరుగుపరచాలని చెప్పారు. పరిశుభ్రతకు ప్రాధాన్యతనిస్తూ తగిన శానిటేషన్ సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బ్లడ్ బ్యాంకుల పనితీరు, రక్త నిల్వలపై సమీక్షించి అత్యవసర సేవలకు ఎటువంటి లోటు లేకుండా చూడాలని సూచించారు. అలాగే ప్రైవేట్ స్కానింగ్ సెంటర్లపై క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించాలని తెలిపారు. జిల్లాలో నమోదవుతున్న సికిల్ సెల్ అనీమియా కేసులపై ప్రత్యేక దృష్టి సారించి, అధిక కేసులు ఉన్న మండలాలు, పరీక్షల విధానం, కిట్ల లభ్యతపై సమగ్ర నివేదిక సమర్పించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డీసీహెచ్ఓ రవిబాబు, ఏరియా ఆసుపత్రుల సూపరింటెండెంట్లు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



# పాల్వంచలో ఘనంగా కాల్వ దేవదాసు పుట్టినరోజు వేడుకలు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

పాల్వంచ, ఏప్రిల్ 4 : భద్రాద్రి జిల్లా పాల్వంచకు చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, సమాజ సేవకుడు కాల్వ దేవదాసు 72 వ పుట్టినరోజు వేడుకలు పాల్వంచలోని ఆయన క్యాంప్ కార్యాలయంలో శనివారం పుర ప్రముఖుల సమక్షంలో ఘనంగా జరుపుకున్నారు. కేక్ కట్ చేసి, స్వీట్స్ పంపిణి చేసారు. బోకే అందించి దుశ్శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా పుర ప్రముఖులు మాట్లాడుతూ, సాధారణ వ్యక్తిగా పాల్వంచలో ఆయన ప్రస్థానం మొదలై ప్రముఖ వ్యక్తి గా ఎదిగిన తీరును అభివర్ణించారు. కాంగ్రెస్ పార్టీలో సీనియర్ నాయకులుగా ఎదిగి మాజీమంత్రి సంభాని చంద్రశేఖర్ అనుచరునిగా ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించిన తీరును గుర్తు చేసారు. శుభాకాంక్షలు, అభినందనలు తెలుపుతూ భవిష్యత్తు లో ఏకంగా ఎదగాలని, రాజకీయంగా ఎదగాలని ఆకాంక్షించారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో కొత్తగూడెం కార్పోరేషన్ పాల్వంచ 43 డివిజన్ కార్పోరేటర్ కాల్వ భాస్కర్, సింగరేణి రిటైర్డ్ జనరల్ మేనేజర్ శనగ వెంకటేశ్వర్లు, యస్సీ, యస్టీ, హక్కుల పరిరక్షణ సంఘం టౌన్ అధ్యక్షుడు కాల్వ ప్రకాష్ రావు, ముళ్ల పుడి రాజేంద్ర కుమార్,ఇజ్రాయెల్, దానియేల్, ప్రేమ్ ప్రకాష్, జాన్, గంధం యాదగిరిరావు, కాల్వ రామారావు, కొప్పుల వెంకటేశ్వర్లు, గులగట్టు మల్లయ్య, ఎస్.రామ చందర్ రావు తదితరులు ఉన్నారు.

# ప్రత్యేక సమగ్ర సవరణ దృష్ట్యా మ్యాపింగ్ ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలి

## రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మంచిర్యాల, ఏప్రిల్ 4 : ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం దృష్ట్యా మ్యాపింగ్ ప్రక్రియ పురోగతి సాధించేలా ప్రత్యేక దృష్టి సారించాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అన్నారు. శనివారం హైదరాబాద్ నుండి ఇతర ఎన్నికల అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు, ఈ ఆర్ ఓ లు, ఏ ఈ ఆర్ ఓ ల తో ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో ఓటర్ల మ్యాపింగ్, బూత్ స్థాయి అధికారుల శిక్షణ, బూత్ స్థాయి ఏజెంట్ల నియామకం తదితర అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి మాట్లాడుతూ ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియలో పురోగతి సాధించాలని, బూత్ స్థాయి అధికారులు మ్యాపింగ్ త్వరితగతిన చేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించి బూత్ స్థాయి ఏజెంట్ల నియామకం జరిగేలా కృషి చేయాలని తెలిపారు. బూత్ స్థాయి అధికారులకు శిక్షణ అందించాలని, బూత్ స్థాయి ఏజెంట్లకు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలకు శిక్షణ సంబంధిత మెటీరియల్ అందజేయాలని తెలిపారు. బూత్ స్థాయి అధికారుల పోస్టులు ఖాళీగా ఉండకుండా చూసుకోవాలని, ఎక్కడైనా ఖాళీలు ఉన్నట్లయితే వెంటనే సంబంధిత అధికారులను నియమించాలని తెలిపారు. పెండింగ్ లో ఉన్న ఫారం 6, 7, 8 దరఖాస్తులను తొందరగా



పరిష్కరించాలని తెలిపారు. జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ జిల్లాలో ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమ సంబంధిత సిబ్బందికి శిక్షణ అందించడం జరిగిందని, జిల్లా ఎన్నికల అధికారి స్థాయిలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో బూత్ స్థాయి ఏజెంట్ల నియామకంపై సమావేశం నిర్వహించడం జరిగిందని తెలిపారు. జిల్లాలో ఇప్పటి వరకు 63 శాతం మ్యాపింగ్ ప్రక్రియ పూర్తయిందని, పోలింగ్ కేంద్రాల వారీగా కనీసము 50 శాతము మ్యాపింగ్ అయ్యేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. సరిగా పనిచేయని బూత్ స్థాయి అధికారులను తొలగించడం జరిగిందని, వారి స్థానంలో కొత్త వారిని నియమించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య, జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీనివాసరావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ చంద్రకళ, ఎన్నికల విభాగం అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగామయి దయానంద్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



సత్తుపల్లి, ఏప్రిల్ 4 : ఖమ్మం జిల్లా సత్తుపల్లి పట్టణంలోని శనివారం ఎమ్మెల్యే డాక్టర్ మట్ట రాగమయి దయానంద్ పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ముందుగా బస్టాండ్ వద్ద " రన్ ఫర్ జీసస్ " కార్యక్రమం లో పాల్గొన్నారు అనంతరం ఆర్టీవో ఆఫీస్ ను, పరిసర ప్రభుత్వ భవనాలను స్వయంగా పరిశీలించారు. సత్తుపల్లి మండలం రుద్రాక్షపల్లి పంచాయితీలో పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. గ్రామంలో 12 లక్షలు రూపాయలతో నూతన అంగన్వాడీ భవనం, 24 లక్షలు రూపాయలు తో సీసీ రోడ్లు ప్రారంభించారు. అనంతరం గ్రామంలో అంగోతు శ్రీను, లావుడ్య శివ ఇరువురి ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశం చేశారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి మున్సిపల్ చైర్మన్ రెహానా బేగం, కమలపాషా, వైస్ చైర్మన్ బొంతు సుమలత వేణు, ప్రభుత్వ అధికారులు, మున్సిపల్ కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# పాత పెన్షన్ విధానాన్ని వెంటనే పునరుద్ధరించాలి



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మహబూబాబాద్ టౌన్, ఏప్రిల్ 04 : ప్రభుత్వం ఇవ్వాల్సిన కరువు బత్యం డి.ఏ బకాయిలు మరియు పిఆర్సి ఉసేత్తకుండా వ్యవహరించడం ఉద్యోగుల పట్ల శాపంగా మారింది అని న్యాయశాఖ ఉద్యోగుల సంఘం మహబూబాబాద్ ఆధ్వర్యంలో శనివారం మూడు కోట్ల సెంటర్ అంబేద్కర్ విగ్రహం ముందు నిరసన తెలిపారు. న్యాయశాఖ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో జరిగిన నిరసన కార్యక్రమంలో జిల్లాలోని వివిధ శాఖల ఉద్యోగస్తులు పాల్గొన్నారు. ఎక్కడో జరిగే యుద్ధానికి ప్రస్తుతం సిపిఎస్ ఉద్యోగస్తులు బలి అవుతున్నారు అని ప్రతి ఉద్యోగి యొక్క ఎన్ పీ ఎస్ ఖాతా నుండి షేర్ మార్కెట్లో ఉద్యోగుల జీవితాలతో జూదం ఆడుతున్న ప్రభుత్వం మేనిఫెస్టోలో పెట్టిన అంశాలను మర్చిపోయిందని ఎస్ సి పి ఎస్ ఈ యు రాష్ట్ర కార్యదర్శి ముబిన్ అహ్మద్ అన్నారు. ప్రభుత్వం ఇప్పటివరకు పాత పెన్షన్ సాధన గురించి మాట్లాడకపోవడం శోచనీయం అని డి ఏ బకాయిలు సిపిఎస్ ఉద్యోగులకు ఏకకాలంలో చెల్లించాలని ఇప్పటివరకు వాయిదాల పద్ధతిలో చెల్లించే నగదు ఇప్పటివరకు ఉద్యోగస్తుల ఖాతాలో జమ కాకపోవడం మరియు రావాల్సిన డి.ఏలు ఇవ్వకుండా ఉండడం ప్రభుత్వ సావితి తల్లి ప్రేమ అర్థంకాని పరిస్థితిలో ఉద్యోగుల జీవితాలు రోడ్డున పడి కొన్ని అత్యవసర శాఖలు రాత్రింబవళ్లు సెలవు దినాలలో కూడా పనిచేస్తూ వారి హక్కుల కోసం పోరాటం చేస్తుంటే ప్రభుత్వం ఒకపక్క వారి రాజకీయాల లబ్దికోసం అన్ని విధాల పథకాలను బందులు ఇస్తూ మా ఉద్యోగస్తులకు ఉరితాడు బిగిస్తుందని న్యాయశాఖ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడ పోలేపల్లి శ్రీనివాస్ అన్నారు. ఈ నిరసన కార్యక్రమము మహబూబాబాద్ జిల్లా న్యాయ శాఖ నుండి పురుడు పోసుకుంది అని ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా అన్ని న్యాయశాఖలో జరుగుతుందని తదుపరి కార్యాచరణ రాష్ట్ర న్యాయశాఖ ఉద్యోగస్తులు వివిధ జిల్లాలో నిరాహార దీక్షలు , ఆమరణ నిరాహార దీక్షలు మరియు చేయబోయే ప్రతి చర్యకు ప్రభుత్వం బాధ్యత వహించవలసి వస్తుందని ప్రభుత్వానికి హెచ్చరిస్తున్నాము అని ఈ సందర్భంగా ఉద్యోగస్త నాయకులు అన్నారు.

ఈ కార్యక్రమం లో రెవెన్యూ,మున్సిపల్ ,కలెక్టరేట్, వివిధ శాఖల ఉద్యోగస్తులు, రెవెన్యూ శాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం డి ఫిరోజ్ సిపిఎస్ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు నాగముని ,టి ఆర్ టిఎఫ్ గౌరవ అధ్యక్షులు ఆవునూరి రవి, రాష్ట్ర ఐటీ సెల్ కన్వీనర్ విఎండి రఫీక్ జిల్లా కోశాధికారి కొప్పుల నాగరాజు,బయ్యారం జిల్లా సిపిఎస్ అధ్యక్షులు రవీందర్ ఉద్యోగస్తులు మరియు జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షులు మామిడాల సత్యనారాయణ ప్రధాన కార్యదర్శి సిద్ధార్థ సీనియర్ న్యాయవాదులు వివిధ శాఖల ఉద్యోగస్తులు ఉద్యోగ సంఘ నాయకులు పెద్ద ఎత్తున హాజరై ఈ నిరసన కార్యక్రమానికి మద్దతు తెలిపినారు. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లుతెర్చుకొని ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండి,డి ఏ బకాయిలు పిఆర్సి తో పాటు పాత పెన్షన్ విధానాన్ని వెంటనే అమలుపరచి ఉద్యోగస్తులను ఆదుకోవాలి లేనిపక్షంలో ఉద్యోగస్తులు పెద్ద ఎత్తున తదుపరి కార్యాచరణ చేపట్టడం జరుగుతుందని ప్రభుత్వానికి హెచ్చరించారు ఈ కార్యక్రమంలో పిఆర్టియు మండల బాధితులు బి రామ్జి నాయక్ యుటిఎఫ్ బాధ్యులు హరి టిపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు బి రమేష్, ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయిస్ యూనియన్ వివిధ మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు న్యాయశాఖ ఉద్యోగులు మున్సిపల్ శాఖ సెంట్రల్ ఫారం సెక్రటరీ సింగు రమేష్ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.



# నిరుపేద విద్యార్థులకు ఉన్నత విద్య కోసం ఆర్థిక సహాయం

## - తండ్రి జ్ఞాపకార్థం రూ.15 వేల అందించిన తాడికొండ వీరభద్ర ప్రతాప్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

పాల్వంచ, ఏప్రిల్ 4 : నిరుపేద విద్యార్థులకు ఉన్నత విద్యను కొనసాగించేందుకు ఆర్థిక సహాయం అందిస్తూ తాడికొండ వీరభద్ర ప్రతాప్ ప్రశంసలు అందుకుంటున్నారు. హైదరాబాద్‌కు చెందిన తాడికొండ వీరభద్ర ప్రతాప్, అహ్మదాబాద్‌లోని జైడస్ కాడిల్లా ఫార్మాస్యూటికల్ కంపెనీలో వైస్ ప్రెసిడెంట్‌గా పనిచేస్తున్నారు. తన తండ్రి విశ్వేశ్వర భైరవ ప్రసాద్ జ్ఞాపకార్థం గత పదేళ్లుగా పేద విద్యార్థులకు ఆర్థిక సహాయం అందిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. ఈ క్రమంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ పట్టణం బొల్లోరిగూడెం ప్రాంతానికి చెందిన ఆనాబత్తుల రక్షితకు రూ.15 వేల ఆర్థిక సహాయం అందించారు. ఆమె ప్రస్తుతం అనుబోస్ ఇంజనీరింగ్ కళాశాలలో సివిల్ ఇంజనీరింగ్ ఫైనల్ ఇయర్ చదువుతోంది. శనివారం బొల్లోరిగూడెంలోని శ్రీలలిత కామేశ్వర స్వామి ఆలయంలో ఈ నగదును వీరభద్ర ప్రతాప్ తరఫున ఆయన బంధువు, ఆలయ ధర్మకర్త శివలెంక అశ్వని కుమార్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా అశ్వని కుమార్ మాట్లాడుతూ, ప్రముఖ సంస్థలో ఉన్నత పదవిలో ఉండి తన తండ్రి జ్ఞాపకార్థం పేద విద్యార్థులకు సహాయం అందించడం గొప్ప విషయం అని ప్రశంసించారు. భవిష్యత్తులో కూడా మరిన్ని సేవలు అందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వికాస తరంగిణి భద్రాద్రి జిల్లా అధ్యక్షురాలు దేవినేని రోజా రమణి, ఆలయ కమిటీ సభ్యులు శనగ రామచందర్ రావు, సమ్మిడి జనార్ధన్ రెడ్డి, సంగ్లోత్ రంజిత్, జర్పుల లింగ్యానాయక్, ఆరెం ప్రశాంత్, పోసారపు శ్రీను, పోసారపు నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# సిపిఐ పోరాటాలను ప్రజలకు తెలియచేయ్యడమే లక్ష్యం

## - సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్




(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మేడ్చల్ మల్కాజిగిరి ఎప్రిల్ 4 : సిపిఐ పార్టీ చేసిన పోరాటాలను సాధించిన విజయాలను రాబోవు రోజుల్లో ప్రజల కోసం చేయాల్సిన పనులను తెలియజేయడానికి సిపిఐ రాష్ట్ర పార్టీ పిలుపుమేరకు సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో ఇంటింటికి సిపిఐ కార్యక్రమాన్ని నేడు జగద్గిరిగుట్ట ప్రాంతంలో నిర్వహించారు. ఈ కార్యక్రమ సందర్భంగా సిపిఐ పార్టీ పోరాటం ఫలితంగానే జగద్గిరిగుట్టలో పేద ప్రజలు గుడిసెలు వేసుకొని నివాసం ఏర్పరచుకొని జీవించారని అది నేడు ఒక గొప్ప పేరు ప్రఖ్యాతలను సంపాదించుకోవడానికి కారణం సిపిఐ పార్టీని అని అన్నారు. నేడు జగద్గిరిగుట్టలో నివాసం ఏర్పరచుకున్న కొత్తవారికి జగద్గిరిగుట్ట ఎలా ఏర్పడింది అనే చరిత్ర తెలియదని ఆ చరిత్ర తెలియజేయడానికి మరియు సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో బస్తి దావకాన కోసం, ప్రభుత్వ మెడికల్ కాలేజీ కోసం, రోడ్డు వెడల్పు కోసం, శ్రీనివాస్ నగర్ కమ్యూనిటీ హాల్ రక్షణ కోసం, పరికిచెరువు పరిరక్షణ కోసం, జగద్గిరిగుట్ట లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయ భూముల పరిరక్షణ కోసం పోరాటాలు నిర్వహించి అనేక విజయాలు సాధించిందని అన్నారు. అదేవిధంగా రాబోవు రోజుల్లో బస్ డిపో ఏర్పాటు కోసం, ప్రభుత్వ జూనియర్ మరియు డిగ్రీ కళాశాల ఏర్పాటు కోసం, మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్ కోసం, క్రీడా మైదానం కోసం పోరాటాలు నిర్వహిస్తారని వీటిని తెలియజేయడానికి సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో ఇంటింటికి సిపిఐ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాల్సిందిగా ప్రజలను కోరడం జరిగింది.

ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్, రాష్ట్ర సమితి సభ్యులు ఏసురత్నం, మండల సహాయ కార్యదర్శి హరినాథ్ రావు, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్, జిల్లా కౌన్సిల్ సభ్యుడు నరసింహారెడ్డి, ప్రజానాట్యమండలి అధ్యక్షులు ప్రవీణ్, బాబు యువజన సమైక్య కార్యదర్శి వెంకటేష్, శాఖా కార్యదర్శులు సహదేవరెడ్డి, వీరస్వామి, కొండయ్య, కె వెంకటేష్ సిపిఐ నాయకులు సత్యనారాయణ, రాజు, ఇమామ్, సామెల్, రామ్ రెడ్డి, బాలరాజు, రామచంద్రారెడ్డి, వెంకటాచారి, బిక్షపతి, సంతోష్, నరసింహ, యాదగిరి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతిభ చూపుతున్న వెంకటాపురం ప్రాథమిక పాఠశాల విద్యార్థులు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)




సత్తుపల్లి, ఏప్రిల్ 4: ఖమ్మం జిల్లా సత్తుపల్లి నియోజకవర్గం వేంసూర్ మండలం వెంకటాపురం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో శనివారం తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు భాస్కర్ అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. ఈ సమావేశానికి మండల విద్యాశాఖ అధికారి చలంచర్ల వెంకటేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతున్నదని పేర్కొంటూ తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలలపై విశ్వాసం ఉంచినందుకు అభినందనలు తెలిపారు. అనంతరం పాఠశాలలో వివిధ అంశాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సాధులక్ష్మి, ఏఎంసీ చైర్మన్ కర్రీ విజయ, జెడ్పీఎస్ఎస్ ప్రధానోపాధ్యాయులు బొంతు శ్రీనివాసరావు, జెడ్పీఎస్ఎస్ వెంకటాపురం ప్రధానోపాధ్యాయులు మిరియాల రవిబాబు, ఉపాధ్యాయులు, అంగన్వాడీ సిబ్బంది, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# తంపులూరు పంచాయతీ నిధుల దుర్వినియోగం

## - మెదక్ జిల్లా డిపిఓకు గ్రామస్తుల ఫిర్యాదు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

టేక్మాల్ ఏప్రిల్ 04 : ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఈనెల రెండవ తేదీన తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి గ్రామపంచాయతీలో గ్రామసభ నిర్వహించడం జరిగింది. ఇందులో భాగంగా టేక్మాల్ మండల పరిధిలోని తంపులూర్ గ్రామంలో 15వ ఆర్థిక సంఘంనిధులుభారీగాదుర్వినియోగమయ్యాయని గ్రామస్తులు ఆరోపించారు. ఈ మేరకు పంచాయతీ కార్యదర్శి తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ శనివారం మెదక్ జిల్లా పంచాయతీ రాజ్ అధికారికి రాతపూర్వక ఫిర్యాదును గ్రామస్తులు అందజేశారు. గ్రామాభివృద్ధి కోసం ప్రభుత్వం కేటాయించిన 15వ ఆర్థిక సంఘం నిధులు సుమారు 9,25,000 రూపాయలు దుర్వినియోగం అయ్యాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. నిధుల ఖర్చుపై గ్రామస్తులు పంచాయతీ



కార్యదర్శిని వివరణ కోరగా, ఆయన పొంతన లేని సమాధానాలు చెబుతున్నారని గ్రామస్తులు మండిపడ్డారు. నిధులు ఎక్కడ ఖర్చు చేశారు? ఏ పనులకు వినియోగించారు? అనే విషయాలపై స్పష్టత ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ సొమ్మును దుర్వినియోగం చేసిన అధికారులపై విచారణ జరిపి, కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# రహదారి విస్తరణ పనులు ప్రారంభం

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)




కాగజ్‌నగర్, ఏప్రిల్ 4 : కాగజ్ నగర్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రధాన రహదారి విస్తరణ పనులను శుక్రవారం అధికారికంగా ప్రారంభించారు. మున్సిపాలిటీ కమిషనర్ తిరుపతి ఆధ్వర్యంలో ఈ పనులు ప్రారంభమయ్యాయి. పట్టణంలో పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీని తగ్గించడంతో పాటు ప్రజలకు సౌకర్యవంతమైన రవాణా సదుపాయం కల్పించాలనే లక్ష్యంతో రహదారి విస్తరణ కార్యక్రమాన్ని చేపట్టినట్లు అధికారులు తెలిపారు. ముందుగా మున్సిపాలిటీ కార్యాలయం సమీపంలోని ప్రధాన రహదారి ఇరువైపులా ఉన్న ఆక్రమణలను మున్సిపల్ సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది సమన్వయంతో తొలగించారు. రహదారి విస్తరణ పనులకు అడ్డుగా ఉన్న షెడ్లు, తాత్కాలిక నిర్మాణాలు, వ్యాపార దుకాణాల ముందుభాగంలో ఏర్పాటు చేసిన నిర్మాణాలను తొలగించి రహదారిని ఖాళీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ తిరుపతి మాట్లాడుతూ పట్టణ అభివృద్ధిలో భాగంగా ప్రధాన రహదారులను దశలవారీగా విస్తరించే కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. రహదారులు విస్తరించడంతో ట్రాఫిక్ సమస్యలు తగ్గడంతో పాటు అత్యవసర సేవలకు వెళ్లే వాహనాలకు కూడా సౌలభ్యం కలుగుతుందని చెప్పారు. పట్టణ ప్రజలు అభివృద్ధి పనులకు సహకరించాలని కోరారు . ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, టౌన్ ప్లానింగ్ అధికారులు పాల్గొన్నారు.

Printed, Published and Owned by **KORUKANTI MANIDEEP PATEL,** Printed at SRI BALAJI PRINTING PRESS, H.No. 4-4-/85, Thilak Road, Karimnagar, Telangana - 505001 and Published at H.No.2-6-242, Ist Floor, Bus stand to Wesly Church Road, Mukarampura, Karimnagar, Karimnagar (Dist.), Telangana-505001, Editor: **GOLI SAMMI REDDY.** RNI.No.TELTEL/2010/35941. Cell: 9394322782, email: prajalakshyam@gmail.com